నవ రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 17 పక్షపత్రిక సెప్టెంబర్ 1-15, 2016




## మోదీ సర్! ముందు మార్గసూచిలోనే మార్పు కావాలి



## జాతీయ విద్యావిధానం పై సవరణలు, సూచనల్ని కేంద్రానికి అందించిన లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్

# బీహార్ మద్యనిషేధం కొత్త సమస్యలు తెస్తుంది, కఠిన మద్య నియంత్రణే పరిష్కారం: జేపీ

మద్యనిషేధం వల్ల మాఫియా, కల్తీ మరణాలు పెరుగుతాయని.. మద్యాన్ని తేలిగ్గా అందుబాటులో లేకుండా కఠినంగా నియంత్రించటం వల్ల పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, జీవనపరంగా చితికిపోకుండా నివారించవచ్చని, ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలూ ఆలోచన చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.




బీహార్ మద్యనిషేధ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలా? అనే అంశంపై 'ది టెలిగ్రాఫ్' ఆధ్వర్యంలో పాట్నాలో జరిగిన చర్చలో జేపీ పాల్గొన్నారు.

"మద్యం పేదల జీవితాల్ని చిదిమేస్తుంది. పేద మహిళలు, పిల్లలు మద్యం దుష్ప్రభావాల వల్ల దుర్భర పరిస్థితులనెదుర్కొంటున్నారు. మద్యాన్ని తేలిగ్గా అందుబాటులో లేకుండా చేయటం, మద్యం దుష్ప్రభావాలపై విస్తృత ప్రచారం, తాగుడుకు బానిసైనవారికి డీ అడిక్షన్ సెంటర్ల ఏర్పాటు, తాగి నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు అమలు చేయటం వంటి చర్యలు తీసుకోవాలి. అంతేతప్ప మద్యనిషేధం విధిస్తే తీవ్ర సమస్యలు తలెత్తుతాయి. నూనెలు, నెయ్యి, పంచదార, కాఫీ వంటివన్నీ ఆరోగ్యానికి హానిచేసేవే. కానీ వాటిని సరైనరీతిలో వినియోగించుకుంటున్నామా? నిషేధిస్తున్నామా?.. మద్యాన్ని కఠినంగా నియంత్రించాలనటంలో సందేహం అక్కర్లేదు. కానీ అలవాటుగా కాకుండా పరిమితిలో తీసుకునేవారి స్వేచ్ఛను హరించే రీతిలో మద్య నిషేధం చేస్తే నైతిక పోలీసింగ్‌లా మారుతుంది. సౌదీ అరేబియాలోని షరియా చట్టంలాగా నైతిక నియంతృత్వ ధోరణితో బీహార్ ప్రభుత్వం దీన్ని అమలు చేస్తోంది. ఇది అవినీతిని, నేరాలు, నేరముఠాలను పెంచుతుంది. అంతిమంగా విఫలమవుతుంది. ప్రపంచమంతా అదే రుజువైంది.

నితీష్ ప్రభుత్వం మంచి ఉద్దేశంతో చేస్తున్న చెరుపు... మద్యనిషేధం! బీహార్ ప్రభుత్వం ఇప్పటికైనా మద్యనిషేధం బదులు కఠిన మద్యనియంత్రణ విధానాన్ని చేపట్టి దేశమంతా కూడా అమలు చేసేలా కృషి చేయాలి" అని జేపీ అన్నారు.

ఈ చర్చలో పాల్గొన్న జనతాదళ్ (యునైటెడ్) సెక్రటరీ జనరల్ కె.సి.త్యాగి, మాజీ కేంద్ర మంత్రి, రాష్ట్రీయ జనతాదళ్ జాతీయ ఉపాధ్యక్షుడు

డా॥రఘువంశ్ ప్రసాద్ సింగ్, బీహార్‌లో వెనకబడిన ప్రాంతాల మహిళలు ఏం కోరు కుంటున్నారో పుస్తక రూపంలో వెలువరించిన ఢిల్లీ విశ్వవిద్యాలయ బోధకురాలు ప్రతిష్ఠాసింగ్ తదితరులు స్థూలంగా మద్యనిషేధాని కనుగుణంగా వాదించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధిశర్మిష్ఠ ముఖర్జీ కూడా ఈ ప్యానెల్‌లో ఉన్నారు. మరోవైపు, జేపీ, ప్రముఖ కాలమిస్టు, పద్మశ్రీ అశోక్ మాలిక్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, పారిశ్రామికవేత్త శక్తిసింగ్ తదితరులు మద్యనిషేదం విఫల మయ్యే అవకాశాల్ని హెచ్చరిస్తూ మద్య నియంత్రణకు అనుకూలంగా వాదించారు.



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక సెప్టెంబర్ 1-15, 2016

సంపుటి - 7 సంచిక - 17


## లోపలి పేజీల్లో...


మోదీ సర్! ముందు మార్గసూచీలోనే ............ 5

జాతీయ విద్యావిధానం 2016 ముసాయిదా... 10

భవిష్యత్తు ఉద్యోగాలకు ఈ చదువులు .......... 14

కాసుల చదువుల మధ్య కామన్ స్కూల్.......... 16

వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి రూ.60 కోట్లు.......... 18

దూకుడు దౌత్యమా ? .............................. 20

చట్టప్రకారం ఎకరాకు రూ. 18 లక్షలు.......... 23

పోలవరం కల నెరవేరేనా? ...................... 26

అవినీతి మధ్య అప్పు మీద అప్పు... ముప్పు....... 28

మరో నయీంను సృష్టిస్తారా?...................... 30

నిరక్షరహిత స్వచ్ఛ భారత్ యువత ధ్యేయం..... 32

ప్రభుత్వ వైద్య కళాశాల కోసం లోక్‌సత్తా......... 33

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే........ 34



## సంపాదక వర్గం


**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# 'అందరికీ ఆరోగ్యం' విధానంతోనే క్రీడా సంస్కృతిని పెంచగలం



రియో ఒలింపిక్స్‌లో తిరుగులేని సామర్థ్యాన్ని కనబరిచి పతకాలు సాధించిన పి.వి సింధు, సాక్షి మాలిక్ నిరాశా భారత్‌కు కొంత ఊరట. పతకాన్ని సాధించలేకపోయినా గొప్ప పోరాటపటిమను చూపిన దీప వంటి మన క్రీడాకారులనూ, కోచ్ పుల్లెల గోపీచంద్‌నూ ఈ సందర్భంగా అభినందించాలి. మిగిలిన ప్రధాన రంగాలకు కేటాయింపులు లేకపోయినా పతకాల క్రీడాకారులను తయారుచేసుకునే కొన్ని చిన్న దేశాలు, ఆటవిడుపుగా క్రీడల్లో పోటీచేసే కొన్ని సుసంపన్న దేశాలతో మనల్ని పోల్చుకోలేం. మన దేశానికున్న వనరులు, జనాభా, వేల ఏళ్ల వారసత్వం, ప్రజల్లో క్రీడా గుర్తింపు పట్ల ఆకాంక్ష ఇవన్నీ పలు క్రీడల్లో పతక విజేతలను తయారుచేయాలి. కానీ విదేశాల్లో తలసరి రోజుకు 50పైసల దాకా వెచ్చిస్తుంటే మనదేశంలో 3పైసలే ఖర్చుచేస్తుండటం, రాజకీయ జోక్యం వంటి స్వయంకృతాల వల్ల మనం పతకాల కోసం అర్రులుజాచే పరిస్థితిలో ఉన్నాం. ఇక పతకానికి మరోవైపు మన వైఫల్యం అంతకంటే లోతైనది. ప్రధానంగా, దేశీయ ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటం మన క్రీడా పునాదిని గుల్లబారుస్తోంది. ఒలింపిక్స్, ఇతర క్రీడాపోటీల లక్ష్యమైన శారీరక, మానసిక దృఢత్వం, పోటీప్రపంచంలో సామరస్యతతో గెలవటం వంటివి పెంపొందించే క్రీడా సంస్కృతిని దెబ్బతీస్తోంది. మన జనాభాలో మెజారిటీగా ఉన్న యువత.. తెలివితేటల్లో, కష్టపడేతత్వంలో, ఆదర్శభావాల్లో ప్రపంచంలో ఎవరికీ తీసిపోరు. కానీ సరైన పౌష్టికాహారం లేకుండా, తరచూ అనారోగ్యాల బారిన పడి ఆ ఖర్చును తట్టుకోలేక ఇంకా పేదరికంలోకి కూరుకుపోతూ, చివరకు మెరుగైన ఉపాధి కోసం కూడా ప్రయత్నించే ఓపిక లేక నిరాశానిస్పృహలతో ఉన్నదాంతో సర్దుకుపోతున్న యువత సంఖ్య పెరిగిపోతుంటే సమాజంలో క్రీడాస్ఫూర్తి ఎలావస్తుంది? ప్రజల ఆరోగ్యపరిరక్షణను రాజకీయ వ్యవస్థ, సమాజం పట్టించుకోకపోవటం, పౌష్టికాహారలోపంతో ఈసురోమంటున్న యువతరం, జబ్బు వచ్చాక ఏదో హడావుడి చేయటం తప్ప వ్యాధి రాకుండా చర్యలు, తొలి దశల్లోనే చికిత్స చేసే ఏర్పాట్లు లేని దేశంలో ఎన్ని కోట్ల మంది యువత ఉన్నా ఒలింపిక్స్‌లో పోటీపడే వాతావరణం ఎక్కడుంటుంది? ఇతర దేశాల నుంచి వచ్చే దాడులకన్నా జబ్బుల దాడుల వల్లే భారత్ భవిష్యత్తులో ఆర్థికంగా కుంగిపోయే ప్రమాదముంది. 'ఫేస్‌బుక్' వ్యవస్థాపకుడు జుకర్‌బర్గ్ రూ.3లక్షల కోట్లు విరాళం ఇచ్చిన విషయం గురించి పట్టించుకున్నట్టుగా, ఆయన తన బిడ్డకు రాసిన లేఖలో పేర్కొన్న- 'పిల్లలు మానసిక ఒత్తిడి లేకుండా పౌష్టికాహారంతో పెరగాలి, పాఠశాలలు, వైద్యకేంద్రాలు, తల్లిదండ్రుల బృందాలు, స్థానిక ప్రభుత్వాల పాత్ర పిల్లల పెంపకంలో, అందరికీ సమానావకాశాలను అందించటంలో కీలకం. వ్యాధుల నిరోధాన్ని విస్మరించి వాటి చికిత్స పేరిట 50 రెట్లు ఎక్కువగా వ్యయం చేయడం ఏ దేశానికీ ఆరోగ్యకరం కాదు' అన్న మాటల్ని మనలో చాలామంది పట్టించుకోలేదు. లోక్‌సత్తా తొలి నుంచి వాదిస్తున్నట్టు 'అందరికీ ఆరోగ్యం' అందించే బాధ్యతను ప్రభుత్వం చేపడితేనే ఈ సంక్షోభానికి పరిష్కారం మొదలవుతుంది. మన జాతీయాదాయంలో కేవలం 2శాతంతో అందరికీ ఆరోగ్యాన్ని అందించే విధానాన్ని కూడా ఇటీవల లోక్‌సత్తా నరేంద్రమోదీ ప్రభుత్వానికి అందించింది. ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో గ్రామాల నుంచి ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారం అందించే ఏర్పాటు, వ్యాధుల నివారణ, తొలిదశలోనే చికిత్స ఇందులో కీలకం. ఇవి లేకుంటే.. కొంతమంది సంపన్నుల పిల్లలు, దాతల అండతోనో, పరిస్థితులు కలిసొచ్చో అక్కడక్కడా కొందరు సామాన్యుల పిల్లలు క్రీడాకారులుగా రాణిస్తుంటారు తప్ప దేశ యువత ఒలింపిక్ స్థాయి గురించి ఆలోచనే చేయలేరు, పోటీల లక్ష్యమైన క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోలేరు. అందరికీ ఆరోగ్యంతోపాటు క్రీడలను మన విద్యావ్యవస్థలో భాగం చేయాలి. ఉన్న కాసిని క్రీడాస్థలాలను కూడా కబ్జా చేయటం, ఇతర అవసరాలకు వాడుకోవటం చేస్తూ పతకాలు రావాలంటే ఎలా వస్తాయి? ఆమధ్య హైదరాబాద్‌లో పేద, మధ్యతరగతి పిల్లలు ఆడుకునే ఎన్టీఆర్ స్టేడియంను తెరాస ప్రభుత్వం వేరే నిర్మాణాలకు కేటాయిస్తామంటే లోక్‌సత్తా గట్టిగా పోరాడింది. ఆడ, ఈడ (మగ) తేడాలేకుండా పిల్లలు, వారితో కలిసి పెద్దలు ఆటలాడుకునే విధంగా నగరంలో గ్రౌండ్స్‌ను నిర్మించాలనే ప్రజాచైతన్య కార్యక్రమాన్ని చేపట్టింది. వీటితోపాటు, చిన్నపని, పెద్దపని అని లేకుండా చేసే పనిని గౌరవంగా భావించే శ్రమ సంస్కృతిని పనిగట్టుకుని సమాజంలో ప్రోత్సహించాలి. డిగ్నిటీ ఆఫ్ లేబర్ వల్ల మనదేశంలో ఉపాధి సమస్య కూడా కొంతమేర పరిష్కారమవుతుంది. ఆరోగ్య, విద్యావ్యవస్థలతో శారీరక, మానసిక దృఢత్వాలు పెంపొందిస్తుంటే కావలసినంతమంది మెరికల్లాంటి యువ క్రీడాకారులు దొరుకుతారు. వారి నుంచి ప్రత్యేక శిక్షణకు ఎంపిక చేసుకుని తగినంత వెచ్చిస్తే ఒలింపిక్ పతకాల కోసం ఈ దేశం సుదీర్ఘకాలంగా కంటున్న కలలు నెరవేరతాయి, క్రీడా పోటీల లక్ష్యమైన క్రీడాస్ఫూర్తి సమాజంలో పెరుగుతుంది. యువతరం ఆశలను అందుకోగలిగేలా జర్నలిస్టులు తమ పూర్తి శక్తిసామర్థ్యాలతో పనిచేసే అవకాశం లభించటం వల్లనేమో.. మన దేశీయ ప్రాచుర్య మీడియా క్రీడా కథనాల్లో, పేజీల్లో తరచూ సృజనాత్మకత వెల్లివిరుస్తుంటుంది. ఎలా చేస్తే గెలిచివుండేవారో, ఇక ముందు ఏం చేయాలో మేధస్సును, భావోద్వేగాలను కలగలిపి రకరకాలుగా విశ్లేషించే ప్రయత్నం కనిపిస్తుంది. ఇదే తపన, విభిన్న పరిష్కారాల కోసం ప్రయత్నం రాజకీయ, పాలనా అంశాలలో కూడా చూపించగలిగితే ఖచ్చితంగా మన మీడియా గొప్ప ప్రమాణాలను అందుకోగలుగుతుంది. రియో ఒలింపిక్స్‌లో భారతదేశ వైఫల్యాన్ని ప్రయోజనకరంగా విశ్లేషించి ప్రచారం చేయటానికి మీడియా తన సృజనాత్మకతను విస్తరిస్తుందని ఆశిద్దాం.

మీ

(సంతకం)




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ *నం: 62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.




# మోదీ సర్! ముందు మార్గసూచీలోనే మార్పు కావాలి

***ఎన్నికలలో గెలవటం మాత్రమే రాజకీయం, నాయకత్వం కాదని, ఎవరు అధికారంలో ఉన్నా ప్రజల నిరంతర భాగస్వాములవుతుంటేనే ప్రజాస్వామ్యం విజయవంత మవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్య.. పెరుగుతున్న ఆయన పరిణతికి అద్దం పడుతుంది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన మై-గవ్ పోర్టల్ రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీ ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రజలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా మాట్లాడుతూ ఆయనీ మాటలన్నారు. అధికారం ఒక మార్గమే తప్ప లక్ష్యం కాదని పరోక్షంగా అంగీకరించారు. ప్రధానిగా మోదీ వ్యక్తం చేసిన అభిప్రాయాలలో ఇది అత్యంత కీలకమైనది. అయితే ఈ లక్ష్యాన్ని సాధించటానికి ఆయన ప్రతిపాదించిన పరిష్కారాలు ఆయన గందరగోళానికి అద్దం పడుతున్నాయి. టౌన్‌హాల్ తరహాలో ప్రశ్నలకు జవాబుల రూపంలో మోదీ చెప్పిన ముఖ్యమైన అంశాలు ఇవి:***

"ఒకసారి ఓటేసి అయిదేళ్లు కాంట్రాక్ట్ ఇచ్చేసి ఇక నుంచీ మీరే జవాబుదారీ, మీరే సమస్యలు పరిష్కరించాలని పాలకుల్ని అనటం సరికాదు. అయిదేళ్ల తర్వాత రెండో కాంట్రాక్టర్‌కి అప్పగించి.. ఇంతకు ముందు ఆయన చేయలేదు, మీరు చేయండి అంటున్నారు. ఓటేసి ప్రభుత్వాలను ఎన్నుకోవటానికే ప్రజాస్వామ్యం పరిమితమైతే అది ఎప్పటికీ ఫలితం ఇవ్వదు. ఇప్పుడు ప్రభుత్వం ముందున్న పెద్దసవాల్.. సుపరిపాలన. మనదేశంలో సుపరిపాలన మాట ఎత్తితే దాన్ని దుష్టరాజకీయంగా చెబుతున్నారు. దేశంలో మార్పు తేవడానికి ఎన్ని మహత్తరమైన విధాన నిర్ణయాలు తీసుకున్నప్పటికీ దాన్ని అంతిమవ్యక్తికి అందించకపోతే మనం విఫలమైనట్టే లెక్క. మనం ఎంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకుని డబ్బు ఖర్చు చేసినా దాని ఫలితం లబ్ధిదారునికి చేరకపోతే ఉపయోగం ఉండదు. మహా అయితే వారం రోజుల పాటు వాటికి ప్రచారం వస్తుంది తప్పితే ప్రజలకు ఉపయోగం ఉండదు. సుపరిపాలనపై దృష్టి పెట్టకపోతే సామాన్యుడి జీవితాల్లో మార్పు రాదు.

సుపరిపాలన గురించి మాట్లాడితే.. దురదృష్టం కొద్దీ.. మనదేశంలో కొంతమంది ఒపీనియన్ మేకర్స్ ఎక్కడో పంచాయతీలో ఏదైనా జరిగితే దానికి ప్రధానమంత్రినే అడుగుతారు. మునిసిపాలిటీ, జిల్లా, పంచాయతీ, రాష్ట్రం.. ఎక్కడ ఏం జరిగినా ప్రధానమంత్రే సమాధానం చెప్పాలంటున్నారు. ప్రధానమంత్రికే కష్టం వస్తే.. అదేమంత పెద్ద విషయం కాదంటున్నారు. కానీ పంచాయతీ తన బాధ్యతను బాధ్యతగా తీసుకోవటం లేదు. మునిసిపాలిటీలు, జిల్లా పంచాయతీలు, రాష్ట్రాలు కూడా తమ బాధ్యతలను బాధ్యతలుగా భావించటం లేదు. దీనివల్ల ప్రభుత్వానికి నష్టం జరుగుతుంది. ఎవరి బాధ్యతను వారి బాధ్యతగా భావించటమే సుపరిపాలనకు అర్థం. కింది నుంచి పైవరకు అందరూ తమతమ స్థాయిలో బాధ్యతను బాధ్యతగా భావించాలి. అప్పుడే సంస్కరణ సాధ్యమవుతుంది. ఎవరి బాధ్యతకు వారే వారే జవాబివ్వటం చాలా అవసరం. ప్రభుత్వం ప్రతి అంశంలో వేలు పెట్టాల్సిన

అవసరం లేదు. అది ఆంగ్లేయుల నుంచి వచ్చింది. దాన్ని మార్చడానికి సుపరిపాలన చాలా అవసరం.


అడ్డంకులు కల్పించి, ప్రజలు ప్రతి విషయానికీ మన దగ్గరకు రావాలన్న పరిస్థితి ఎందుకు? ప్రజాస్వామ్యంలో ఏదైనా మంచి వ్యవస్థ ఉందంటే.. అది ఫిర్యాదుల పరిష్కార విభాగమేనని చెప్పాలి. అందుకే సామాన్యుడి ఫిర్యాదు వినటానికి ఉత్తమ వ్యవస్థ ఉండాలి. నిర్దిష్ట గడువులోగా సమస్యలపై స్పందించాలి. ఇబ్బందులను తొలగించ టానికి ప్రభుత్వ వ్యవస్థ ప్రజల చేయి పట్టి నడవాలి. ఈ దిశగా మేం ప్రయత్నిస్తున్నాం. ఫిర్యాదుల పరిష్కారంపై ప్రతి నెలా సెక్రటరీలు, చీఫ్ సెక్రటరీలతో మాట్లాడుతున్నా.

ఇప్పటివరకూ ప్రభుత్వాలు ఈ ఎన్నికల్లో గెలిచిన వెంటనే తర్వాతి ఎన్నికల్లో ఎలా గెలవాలన్న దానిపై దృష్టి పెడుతూ వచ్చాయి. ఆ కోణంలోనే ప్రభుత్వ ప్రణాళికలు ఉండేవి. జనం మనసులు ఎలా ఆకట్టుకోవాలి, అధిక ఓట్లు పొందటానికి మార్గాలేంటి అని ఆలోచించారు. దాని వల్ల దేశం ముందడుగు వేయటం సాధ్యం కాదు. ఇలాంటి ఆలోచనల కారణంగా సుపరిపాలన, చెక్స్ అండ్ బ్యాలెన్సెస్, ప్రతి దశలో తనిఖీ, బాధ్యతతో కూడిన జవాబుదారీ తనంలాంటి అంశాల్లో ఉదాసీనత ప్రవేశించింది.

విదేశాల్లో ఉన్న భారతీయులు దేశంలో పైసా పెట్టుబడి పెట్టకపోయినా తన చుట్టూ ఉన్న ఐదు విదేశీ కుటుంబాలను ఏటా భారత్‌కి పంపితే చాలు. మాతృదేశంలో ఎన్ని అవమానాలు ఎదురైనా ఎలా సేవ చేయాలో అంబేద్కర్‌ని చూసి నేర్చుకోవాలి. గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌ల నుంచి స్వయం సేవ స్ఫూర్తి పొందాలి.

భారత్‌లాంటి అతి పెద్ద ప్రజాస్వామ్యంలో ప్రజలు భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతో ఉంది. సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఇప్పుడు అది సాధ్యమవుతోంది. స్వచ్ఛ భారత్ కార్యక్రమమే ప్రజా భాగస్వామ్యానికి ప్రబల ఉదాహరణ. దాని ద్వారా ప్రజలు, నాయకులు ఎంతో కొంత చేయడానికి ప్రయత్నిస్తున్నారు.”

ప్రధానమంత్రి సమస్యను గుర్తించటంలో వాస్తవాలకు దగ్గరగా వచ్చారుగానీ పరిష్కారాల దగ్గరికొచ్చేసరికి దాటవేశారు. వాస్తవానికి ఆయన చేసిన, ఆయన తరచూ చెప్పుకునే మూడు గొప్ప పనుల్లో రెండు యూపీయే ప్రభుత్వ హయాంలోనివే. డా॥ మన్మోహన్ ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించివుంటే ఆధార్, జీఎస్టీ విషయంలో కూడా మోదీకి పెద్దగా అవకాశం లభించేది కాదు. మరి కొత్తగా మోదీ విజన్ ఏమిటి?




అధికారంలో వుండే పార్టీ మారినా ప్రభుత్వాల విధానాల్ని కొనసాగించటం, దేశ ప్రయోజనాల దృష్ట్యా పార్టీలకతీతంగా వ్యవహరించటం, ఇతర పార్టీల కృషిని ఉదారంగా అభినందిస్తూ పరస్పర గౌరవంతో వ్యవహరించటం వంటి పరిణతి ధోరణుల్ని అభినందిస్తూనే అడుగుతున్న ప్రశ్న ఇది.

అలాగే గుజరాత్ ముఖ్య మంత్రిగా మోదీ జీఎస్టీ బిల్లును వ్యతిరేకించారు, ఆయన పార్టీ బీజేపీ ఆధార్‌ని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)ను వ్యతిరేకించింది. మరి ప్రధాని అయ్యాక ఎందుకు మోదీ మాట మార్చారు? ఈ ప్రశ్నకు ఆయన చుట్టూ వున్న వారు తరచూ హాస్యాస్పదమైన సమాధానమిస్తుంటారు– మోదీ అంతకుముందు గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్నారు, ఇప్పుడిప్పుడే ప్రధానమంత్రిగా వ్యవహరించటం నేర్చుకుంటున్నారు! ప్రధానమంత్రి పదవేమీ ఇంటెర్న్‌షిప్ కాదు. మీరు తీరిగ్గా నేర్చుకుని మీకు జ్ఞానోదయమయ్యాక దేశానికి మేలు చేస్తామంటే, ఈలోగా ఇతర దేశాలు మన అవకాశాల్ని లాగేసుకుని దూసుకెళ్లిపోతాయి. ఈదేశానికున్న యువతరం అడ్వాంటేజ్ బండి వెళ్లిపోతుంది. ఉన్నంతలో సర్దుకోవటం, గొప్ప అవకాశాల కోసం ఎన్నో జీవితకాలాలు ఎదురుచూడటమే మిగులుతుంది. ప్రజల అసాధారణ మద్దతుతో ఎన్నికై, ప్రజాదరణతో కొనసాగుతున్న ప్రధానిగా మోదీ చేయవలసింది– సాధ్యమైనన్ని అత్యుత్తమ, ఆచరణాత్మక ఆలోచనల్ని పోగేసుకుని వేగంగా అమలుచేయటం.

ఆ మధ్య ప్రధాని ఒక అంతర్జాతీయ పత్రికతో

మాట్లాడుతూ.. తాను ప్రధానిగా బాధ్యతలు తీసుకున్నవెంటనే నిపుణులందరితో కూర్చుని దేశాన్ని ఆర్థికపథంలో దూసుకుపోయేలా చేయగల బిగ్‌బ్యాంగ్ సంస్కరణలేమిటో చెప్పమని కోరానని, కానీ ఎవరూ స్పష్టంగా చెప్పలేకపోయారని అన్నారు... భారతదేశానికున్న బిగ్‌బ్యాంగ్ రిఫాంస్ శక్తి ఈదేశ ప్రజలకున్న శక్తిసామర్థ్యాలను వెలికితీయటంలో ఉందని తన చుట్టూ ఏర్పరుచుకున్న అతి విధేయ, అర్థ జ్ఞాన, ప్రజల పట్ల ప్రేమ లేని ఆలోచనాపరులు, బ్యూరోక్రసీని దాటి చూడగలిగితే మోదీకి కనిపిస్తుంది. భారత్ ఇల్లు ఎలా చక్కదిద్దుకోవాలో లోక్‌సత్తా చాలా స్పష్టంగా తెలియచేస్తోంది, స్వదేశీ మార్కెట్ సత్తాను వెలికితీయాలని ఇటీవల రిజర్వుబ్యాంకు గవర్నర్ రాజన్‌లాంటి వారు కూడా సూచించారు. భారత్ ఇప్పుడున్న వృద్ధి రేటును కాస్త పెంచుకుని కొన్ని దశాబ్దాలపాటు సుస్థిరంగా అభివృద్ధి చెందాలంటే ముందు ఇల్లు చక్కదిద్దుకునే సంస్కరణలు తప్ప మార్గం లేదు.

మై-గవ్ కార్యక్రమంలో మోదీ చెప్పిన అంశాలలో ప్రజల భాగస్వామ్యం, అధికారమే లక్ష్యంగా ఎన్నికలలో పోటీ చేయకపోవటం, ప్రజలకు సేవ చేయటానికి ఎన్నారైలు తదితర సొంత వనరులున్నవారు రాజకీయాల్లోకి రావటం, పంచాయతీలు, జిల్లాలు, రాష్ట్రాల్లో జవాబుదారీతనం కీలకమైనవి.

వీటికి మోదీ చెప్పిన స్థూల పరిష్కారం- సాంకేతికతను వినియోగించుకుంటూ ప్రచారం చేయటం!

భారత్‌ను మార్చటానికి ఆచరణాత్మకమైన అవకాశాలు ఈవేళ ఉన్నాయని చెప్పటానికి.. యువ జనాభా ఎక్కువగా ఉండటంతోపాటు అద్భుత సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండటం కూడా ప్రధాన కారణం. ఈ మాట లోక్‌సత్తా ఏళ్ల క్రితమే చెప్పింది. అయితే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రాజధానుల నుంచి అన్ని సమస్యల్ని పరిష్కరించగలరా? సాంకేతికత ఇంకాఇంకా అభివృద్ధి చెందినా కూడా అది సాధ్యం కాదు. ప్రపంచంలో మనకంటే అభివృద్ధి చెందిన దేశాలు సాంకేతికంగా ఎంతో ముందున్నా కూడా ఇలాంటి కేంద్రీకృత పాలన చేయటం లేదు. వాళ్లు కూడా అధికారాన్ని వికేంద్రీకరించి బలమైన స్థానిక ప్రభుత్వాల ద్వారానే ప్రజల రోజువారీ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలుగుతున్నారు. ప్రజల భాగస్వామ్యానికి వారు పెద్దపీట వేస్తున్నారు. ఆ దేశాల నుంచి టెక్నాలజీని దిగుమతి చేసుకున్నంత వేగంగా అక్కడి సంస్కరణల్ని, మెరుగైన పాలనాపద్ధతుల్ని, రాజకీయ సంస్కృతిని దిగుమతి చేసుకోకపోవటం వల్ల మనం కేంద్రీకృత పాలన పట్ల భ్రమల్లోనే బతుకుతున్నాం. తక్షణ రాజకీయ అవసరాల కోసం ఆ భ్రమల్ని పెంచిపోషిస్తున్నాం. సాంకేతికతతోనే ప్రజల సమస్యల్ని పరిష్కరించాలనుకుంటే ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులుగా గొప్ప సృజనాత్మక నాయకులు అక్కర్లేదు, రోబోలను లీడర్లుగా పదవుల్లో కూర్చోబెట్ట వచ్చు. 365 రోజులూ 24 గంటలూ సమస్యల్ని పరిష్కరిస్తూనే వుంటారు. యంత్రం అంటేనే అలవాటుగా పనులు చేయటం. దాని వల్ల అనవసర భారం తగ్గి వేగం, పారదర్శకత పెరుగుతాయి. కానీ అలవాటుగా చేసే పనుల్ని దాటి ఆలోచించి ప్రయత్నించటం మానవ లక్షణం. కాబట్టే, పాలనలో ఎప్పటికప్పుడు సృజనాత్మక పరిష్కారాలను అందించాలంటే సమర్థత, నిబద్ధత ఉన్న నాయకత్వం అందుబాటులో ఉండాలి. ఎంత సాంకేతికత ఉన్నా కూడా ప్రజలు తమ అవసరాలకనుగుణంగా వెంటనే ఉమ్మడి సమస్యల్ని పరిష్కరించుకునేందుకు స్థానికంగా జవాబుదారీతనం వున్న ఏర్పాట్లు కావాలి. అప్పుడే మోదీ చెప్పిన ప్రజల భాగస్వామ్యం సాధ్యమవుతుంది. స్థానికంగా ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులకు, దానికితోడు నేరుగా బడ్జెట్ నుంచి ఏటా కనీసం రూ.1000 తలసరి ప్రజలకపేరున గ్రాంట్ వుండి వార్డు స్థాయిలో ఎన్నుకున్న కమిటీలు ఉంటే ప్రజలు వేగంగా తమ సమస్యల్ని పరిష్కరించుకోగలుగుతారు. అవినీతి జరిగితే వెంటనే ఆ వ్యక్తిని కాలర్ పట్టుకు ప్రశ్నించగలుగుతారు. అప్పుడు మోదీ ఫిర్యాదు చేసినట్టు.. పంచాయతీలలో సమస్య గురించి ప్రధానికి ఫిర్యాదు చేయరు. పంచాయతీల్లో, మునిసిపాలిటీల్లో, రాష్ట్రాల్లో సమస్యలు వుంటే తననెందుకు అడుగుతారని బాధపడుతున్న ప్రధాని.. అధికారాల్ని, నిధుల్ని అక్కడికి తగినంతగా పంపిణీ చేయలేదనే వాస్తవాన్ని ఎందుకు గుర్తించరు? ప్రభుత్వం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచటానికి మై-గవ్ ద్వారా నిర్వహించిన పోటీలో 'డ్యూటీస్ ఆఫ్ సిటిజన్స్' అంశంపై విజయవాడ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన ఎ.వైష్ణవికి ప్రధాని స్వయంగా బహుమతిని అందచేశారు. పౌరులు ఈ విధుల్ని సక్రమంగా నిర్వర్తించాలంటే వారి చేతిలో ఉండే చట్రాలేమిటి? ఓటు, భావప్రకటనా స్వేచ్ఛను సక్రమంగా వినియోగించుకుంటూ ఎన్నికలు లేని సమయాల్లో కూడా క్రియాశీలంగా ప్రజలు బాధ్యతలు తీసుకోవాలంటే తగిన అవగాహన వారికి ఎలా వస్తుంది? స్థానిక ప్రభుత్వాలు బలంగా వుండి, వార్డు స్థాయిలో ప్రజల చేతుల్లో అధికారాలుంటేనే ఈ మొత్తం ప్రక్రియ సక్రమంగా జరిగి సిటిజన్‌షిప్ వేళ్లూనుకుంటుంది. అందుకే లోక్‌సత్తా తొలి నుంచీ స్థానిక ప్రభుత్వాలకు నిధులు,

అధికారాలు ఇవ్వాలని ప్రజలను చైతన్యపరుస్తూ పోరాడుతోంది. రాష్ట్రాలకు బదిలీ చేసే నిధుల్లో 33శాతాన్ని రాష్ట్రాలకు బదలాయించాలని స్పష్టమైన కారణాలతో 14వ ఆర్థికసంఘాన్ని కూడా లిఖితపూర్వకంగా కోరింది. వ్యక్తిగతంగా కూడా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆర్థికసంఘం సారథుల్ని అభ్యర్థించారు. అంతగా కోరితే గతంకంటే ఓ లక్షన్నర కోట్లు ఎక్కువ ఇచ్చారు. ఇప్పుడు రూ.2,87,000 కోట్లు స్థానిక ప్రభుత్వాలకు బదిలీ అవుతున్నాయి. కానీ అది చాలదు. రాష్ట్రాలకు 42శాతం నిధుల్ని బదిలీ చేస్తున్నప్పుడు అందులో మూడో వంతు, అంటే సుమారు రూ.8,00,000కోట్లు స్థానిక ప్రభుత్వాలకు ఇచ్చే అవకాశాన్ని ఆర్థికసంఘం జారవిడిస్తే, కేంద్ర ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. మోదీ గారూ! మూడో అంచె ఫెడరల్ వ్యవస్థ పట్ల ఇంత ఉదాసీనంగా వ్యవహరిస్తే, పాలనలో ప్రజల భాగస్వామ్యం ఎలా పెరుగుతుంది?

ఆ తర్వాత ఎన్నికలలో గెలుపు మీద తప్ప ప్రజల సమస్యల పరిష్కారం మీద దృష్టి పెట్టటంలేదని ప్రధాని వాపోయారు. అది వాస్తవం. ప్రజల ఫిర్యాదుల మీద ప్రత్యేక దృష్టి పెట్టి సెక్రటరీలు, చీఫ్ సెక్రటరీలతో మాట్లాడుతున్నానన్నారు. దీనికి పరిష్కారం ఏమిటి? ప్రజలు తమ రోజువారీ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ధైర్యం చేయలేక, ఆన్‌లైన్‌ను సైతం మస్కా కొడుతున్న అక్కడి లంచాలు, వేధింపుల్ని తట్టుకోలేక తమ పనుల కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఓటుతో వేటాడుతున్నారు. ప్రభుత్వాధికారులు చేయాల్సిన పనుల్ని తాము చేసి పెట్టి ఓట్లు దండుకోవటానికి కోట్లు ఖర్చు పెట్టి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆ పదవుల కోసం పోటీచేయాలనుకునేవారు ప్రైవేటు కార్యాలయాలు తెరుస్తూ ఒక పెద్ద నెట్‌వర్క్‌ని మెయింటెయిన్ చేస్తున్నారు. ఇదంతా చేసినందుకు తిరిగి కోట్లు దోచుకుంటున్నారు. దీన్ని పరిష్కరించాలనుకుంటే ప్రధాని ఏం చేయాలి? ముందుగా ప్రభుత్వోద్యోగ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్ణీత గడువులోగా ప్రజలకు పనిచేసి పెట్టకపోతే, దరఖాస్తుదారునికి రోజుకు రూ.250 కనీస జరిమానా చెల్లించేలా 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని అమలు చేయాలి. కానీ ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు పెంచకుండానే, ప్రభుత్వోద్యోగులకు రూ.1లక్ష కోట్ల పైచిలుకు మేర జీతాల్ని పెంచేశారు. దేశ సరిహద్దుల వద్ద కాపలా కాస్తున్న సైనికుల కోసమంటూ 'ఒకే హోదా- ఒకే పెన్షన్' పేరుతో లక్ష కోట్లు ఇచ్చేశారు. అవినీతి ఆరోపణలు వచ్చిన ఉద్యోగుల మీద విచారణకు లోక్‌పాల్ పర్మిషన్ కావాలనే వెసులుబాటును కల్పించేందుకు అవినీతి నిరోధక చట్టంలో 17(ఎ) సవరణను ప్రతిపాదించారు. దీన్ని తొలగించాలంటూ లోక్‌సత్తా ఇప్పటికే ప్రభుత్వానికి, ఎంపీలందరికీ కూడా లేఖలు రాసింది. ఉద్యోగులు భార్యాపిల్లల ఆస్తుల్ని చెప్పాల్సిన పన్లేదంటూ లోక్‌పాల్‌కు సవరణలు చేశారు. దేశంలోపల సైనికుల్లాంటి 1 కోటి మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులు దేశభక్తితో పనిచేస్తే, నిజంగా ఈదేశంలో రాజకీయాలు, ఎన్నికలు ఇంత భ్రష్టుపట్టేవా మోదీగారూ? సెటిల్‌మెంట్ దందాలతో నేరచరిత్రులు విస్తరించగలిగేవారా, రాజకీయాలను శాసించగలిగేవారా? ప్రభుత్వోద్యోగ వ్యవస్థను ప్రక్షాళన చేసి సమర్థతను పెంచటం, అసమర్థులను తొలగించటం, నైపుణ్యముంటే బైటివారిని కూడా తీసుకోవటం, సర్వీస్ గ్యారంటీ చట్టం చేయటం వంటివి చేయకుండా.. ఎన్నికల తీరు మారాలి అంటే ఏ మేరకు నిజాయతీగా ఆలోచిస్తున్నట్టు?

ఇలా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా పనులు జరిగితే, స్థానిక పాలనలో ప్రజలకు నిజమైన అధికారం, భాగస్వామ్యం ఉంటే మంచి యువ నాయకులు దిగువ నుంచి వస్తారు. దేశానికి ఏదైనా చేద్దామనుకునేవాళ్లు తటపటాయించకుండా రాజకీయాల్లోకి వచ్చి సత్తాగల విధానాల్ని, సేవల్ని అందించగలుగుతారు. మోదీ గారు ఆహ్వానించిన ఎన్నారైలు స్వదేశానికి వచ్చి సేవ చేయగలుగుతారు.

మేకిన్ ఇండియాలో పెట్టుబడి పెట్టండని మోదీ కాలికి బలపం కట్టుకుని విదేశాల్లో తిరిగినా అక్కడ్నుంచీ ఎవరూ పెద్దగా స్పందించలేదని పరిణామాలను బట్టి అర్థమవుతుంది. గాంధీ, అంబేద్కర్, పటేల్, సరోజినీ నాయుడు, నెహ్రూ వంటి వారు విదేశాలలో చదువుకుని వచ్చి ఈదేశానికి సేవ చేశారంటే, అందుకు అప్పటి ఆర్థికవ్యవస్థ కూడా అనుకూలించింది. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో దేశం కోసం కేటాయించేంత సమయం చాలామందికి ఉండేది. పైగా పారిశ్రామిక విప్లవం నేపథ్యంలో దేశ స్వాతంత్ర్యం స్వదేశంలో చాలామంది ప్రయోజనాలకు అవసరంగా మారింది. దేశంలో అందరూ కలిసొచ్చిన ఒక భావోద్వేగభరిత లక్ష్యం కోసం వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో పోరాడటం అంటే దాదాపు ఎవరూ సంకోచించలా. కానీ ఈవేళ పరిస్థితులు వేరు. పోటీ ప్రపంచంలో, రోజువారీ ఆదాయం ముఖ్యమై అవకాశాలు, ఆకాంక్షలు పెరిగిన తరుణంలో విదేశాల్లో ఆదాయాన్ని వదులుకుని వచ్చే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. విదేశాల్లో ఉన్నత పదవుల్లో విజయవంతమైనవారు సైతం మనదేశంలోకొచ్చి సంస్కరణల బాధ్యతను చేపట్టే సాహసం చేయలేకపోతున్నారు, నాయకత్వ లక్షణాల్ని ప్రదర్శించ

లేకపోతున్నారు. వారి పరిమితులు వారి కుంటాయి. ఈ నేపథ్యంలో, స్వదేశంలోగానీ, విదేశాల నుంచిగానీ పెద్దఎత్తున సమర్థులు, నిజాయతీపరులైన యువత రాజకీయాల్లోకి వచ్చి సేవ చేయాలంటే.. ప్రజలు ఎన్నికల్లో మంచివారిని గెలిపించి, ఎన్నికైన మరుసటిరోజు నుంచి నువ్వు దిగిపో, నువ్వు దిగిపో అనకుండా పనిచేయనిచ్చే వాతావరణం కావాలి. వ్యక్తిగత దూషణలు లేకుండా హేతుబద్ధంగా హుందాగా చర్చించుకునే రాజకీయ సంస్కృతి కావాలి. ఇందుకు ప్రభుత్వ కార్యాలయాల పనితీరును ప్రక్షాళన చేయటం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారతను ఇవ్వటం ఎంతగానో దోహదం చేస్తాయి.

మరో అంశం స్వచ్ఛ భారత్. స్వచ్ఛభారత్ కార్యక్రమానికి ప్రజల మద్దతు అద్భుతంగా ఉన్నా అరకొరగానే కొనసాగుతోంది. ప్రధానే చెప్పినట్టు, ఎంతోకొంత జరుగుతోంది. ఎంతోకొంత కాకుండా ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములై లక్ష్యాన్ని సంపూర్ణంగా సాధించాలంటే స్థానిక ప్రభుత్వాలతో ఆ కార్యక్రమాన్ని సంధానం చేయాలి.

మోదీ వల్ల పైస్థాయిలో అవినీతి తగ్గిన మాట వాస్తవం. కానీ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా వ్యక్తిగతంగా నిజాయతీపరుడని మనం మరువకూడదు. ఓటుకు కోట్లు కేసులో రెండు రాష్ట్రాల మధ్య (ఏపీ, తెలంగాణ) మధ్య ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతుంటే సీబీఐ విచారణ జరపాల్సిన బాధ్యతను విస్మరించి ఉదాసీనంగా వ్యవహరించిన ప్రధానమంత్రి వ్యక్తిగతంగా నిజాయతీగా ఉంటే ఉపయోగమేంటి? అవినీతిని సహించటానికి, వ్యక్తిగతంగా అవినీతికి పాల్పడకుండా ఉండటానికి పాలకుల విషయంలో పెద్ద తేడాను చూడలేం. సొంత ప్రతిభకన్నా ప్రతిపక్షం బలహీనత మోదీకి ఎక్కువ కలిసివస్తోంది. మోదీ తన రాజకీయ అవసరాల్ని వదిలిపెట్టనక్కర్లేదుగానీ, గందరగోళాన్ని, రాజకీయ అవకాశవాదాన్ని దాటి పరిణతిని ప్రదర్శించటం దేశ ప్రయోజనాల రీత్యా చాలా అవసరం.

అలాగే, దళితులపై దాడులకు సంబంధించి ఎన్నో ఉదంతాలు జరిగాక ఇటీవల హైదరాబాద్‌లో మోదీ చాలా ఆవేశపూరితంగా 'దళితులను కాదు.. నన్ను కాల్చండి' అని ప్రకాశం పంతులులా ఛాతీ చూపించారు. మోదీ ప్రతిపక్షాల మీద దాడి చేశాననుకున్నారేమోగానీ, వాస్తవానికి అది స్వపక్షం మీదే, తన పనితీరు మీదే దాడి. మోదీ ప్రభుత్వం రాజీలేని చట్టబద్ధ పాలన, వివక్ష లేని సమాజం కోసం అందరికీ విద్య, ఆరోగ్యం, న్యాయ, పోలీసు సంస్కరణలతో మరింత పోరాటం చేయటం అవసరం అని చెప్పటానికే తప్ప రాజకీయ విమర్శ కోసం ఈ అంశాన్ని చెప్పటం లేదు.

"మంచి ఇంజిన్, సమర్థుడైన డ్రైవర్ ఉన్నా ట్రాక్ సరిగాలేనంత వరకూ రైలు ప్రయాణం సరిగా జరగదు. మనదేశానికి సరైన దిశామార్గం లేకపోవటం వల్ల అధికారంలో ఎవరున్నా జనం జీవితాల్లో రావాల్సిన స్థాయి మార్పులు రావటం లేదు. ప్రపంచంలోని అనేక దేశాలలో చాలా సాధారణంగా జరిగే పనులు కూడా మనదేశంలో జరగటానికి విపరీతంగా శ్రమించాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి సమయం పడుతోంది. వనరులు, నాయకత్వంతో పాటుగా విధానాలకు, వ్యవస్థల నిర్మాణానికి మనం ప్రాధాన్యత ఇచ్చినప్పుడే మనం ఆశించిన మార్పుల్ని దేశంలో సాధించగలం. ఆ లక్ష్యంతోనే తరతరాల కృషిగా లోక్‌సత్తాను ఆగస్టు 3, 1997లో ప్రారంభించాం. స్వచ్ఛ భారత్ లాంటి కార్యక్రమానికి ప్రభుత్వ సంకల్పం, అందరి మద్దతూ ఉన్నా అది ప్రధాని ప్రసంగానికి, టీవీ యాడ్స్‌కి పరిమితం కావటానికి కారణం సరైన ట్రాక్ లేకపోవటమే" అని 2015లో మాజీ రాష్ట్రపతి డా॥ ఏపీజే అబ్దుల్ కలాంకు నివాళిగా పార్టీలకతీతంగా నిర్వహించిన లోక్‌సత్తా 18వ వార్షికోత్సవ రౌండ్‌టేబుల్ సమావేశంలో జేపీ అన్నారు. ఆ మాటల వెనక వాస్తవాన్ని గుర్తిస్తే మోదీ ప్రభుత్వ వైఫల్యానికి కారణాలు అర్థమవుతాయి.

అందుకే దేశాన్ని బాగు చేయటానికి ముందు స్పష్టమైన రోడ్‌మ్యాప్ (మార్గసూచీ)ని రూపొందించుకోవాలని మోదీకి లోక్‌సత్తా విజ్ఞప్తి చేస్తోంది. అందులో భాగంగా దేశంలోని అంతర్గత బలాల్ని వెలికితీయగలిగే నాణ్యమైన విద్య, ఆరోగ్యాల్ని అందరికీ అందించటం, యాంత్రీకరణ సవాలును అధిగమించే గలిగేలా ఉపాధి అవకాశాల సృష్టి, అధికారాన్ని వికేంద్రీకరించి రాష్ట్రాలకు మరిన్ని అధికారాలనివ్వటం, స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేస్తూ రాష్ట్రాలకిచ్చే వాటాలో 33శాతాన్నివ్వటం, ఫిరాయింపులకు కళ్లెం వేసేలా ముఖ్యమంత్రులకు ప్రత్యక్ష ఎన్నిక విధానం, ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వీస్ గ్యారంటీ చట్టం, సహకార వ్యవస్థను బలోపేతం చేయటం, పటిష్ట చట్టబద్ధ పాలన సంస్కృతిని పాదుకొల్పటం, న్యాయ, పోలీసు వ్యవస్థల పనితీరును సమూలంగా బాగుచేయటం, ప్రజల మధ్య సామరస్యతను పెంచే రిజర్వేషన్ విధానం తదితర సంస్కరణల్ని తేవాలని కోరుతోంది. ఇలా అందరి నుంచీ మెరుగైన ఆలోచనలను స్వీకరించి అమలుచేస్తే మోదీ రాజకీయంగా, వ్యక్తిగతంగా ఆశిస్తున్న విజయాలు, కీర్తిప్రతిష్ఠలు వాటంతటవే వస్తాయి, మై గవ్ రాజకీయ పార్టీల్లో, ప్రజల్లో అవర్ గవ్‌గా మారుతుంది.

# జాతీయ విద్యావిధానం 2016 ముసాయిదాపై కేంద్రానికి అందించిన లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ సవరణలు, సూచనల్ని విడుదల చేసిన జేపీ




కేంద్ర ప్రభుత్వం ప్రతి పాదించిన నూతన (2016) జాతీయ విద్యా విధానం ముసాయిదా లోని అంశాలకు సవరణల్ని, సూచనల్ని ప్రతి  పాదిస్తూ లోక్‌సత్తా / ఎఫ్‌డీఆర్ రూపొందించిన పాఠశాల విద్యావిధానం డాక్యుమెంట్‌ను కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రిత్వ శాఖకు అందచేసినట్టు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. పేదరికాన్ని, కుల, లింగ వివక్షల్ని తొలగించ టానికి, ఉద్యోగాలకు, ఆర్థికా భివృద్ధికి, విలువలున్న బలమైన సామాజిక వ్యవస్థకు నాణ్యమైన విద్యే మాస్టర్ కీ అన్నారు. అందుకే అందరికీ నాణ్యమైన విద్యను రాజకీయానికి, పాలనకు, సమాజానికి కేంద్రబిందువు చేయటం, ఉన్న వనరుల మధ్య కూడా భారత్‌ను గొప్ప విద్యాశక్తిగా తీర్చిదిద్దటం, అన్ని వర్గాల ప్రజలూ కోరుకుంటున్న విద్యా ‘విజయాన్ని’ నిజమైన ఫలితాల దిశగా మళ్లించటం తదితర అంశాల ప్రాతిపదికగా సూచనలను రూపొందించామన్నారు. **“నేర్చుకున్న చదువులో ఎలాంటి ప్రమాణాలు పట్టుబడ్డాయి, ప్రభుత్వ, గుర్తింపు వున్న ప్రైవేటు స్కూళ్లలో తల్లిదండ్రులు నచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకుంటే ప్రభుత్వమే ఫీజులు చెల్లించటం, ఉపాధ్యాయుల జీతాల నుంచి విద్యార్థుల ఫీజు వైపు విద్యావిధానాన్ని క్రమంగా మార్చి.. విద్యార్థుల సంఖ్యను జీతాలకు ముడిపెట్టటం, వివిధ స్కూళ్ల**

**మధ్య పోటీవాతావరణం, స్థానిక ప్రజల పర్యవేక్షణ, భాగస్వామ్యం, స్థానిక పరిస్థితులకు తగ్గ ఏర్పాట్లు, జవాబుదారీతనానికి బలమైన వ్యవస్థలు, స్వయందిద్దుబాటు ఏర్పాట్లు" అంశాల చుట్టూ ఐదు విభాగాలుగా లోక్‌సత్తా/ ఎఫ్‌డీఆర్ కేంద్రప్రభుత్వానికి ఆచరణాత్మక సవరణల్ని, సూచనల్ని అందించినట్టు** తెలిపారు.

పెద్దసంఖ్యలో డ్రాపౌట్లు, విద్యలో ప్రమాణాలు లేకపోవటం, సుశిక్షతులైన ఉపాధ్యాయుల కొరత, వృత్తి, వొకేషనల్ కోర్సులకు తగినన్ని సంస్థాగత ఏర్పాట్లు లేకపోవటం వంటి లోపాలతోపాటు స్కూలు చదువుకు, ఉన్నత విద్యకు మధ్య సంబంధం తెగిపోయి విద్య వ్యాపారంగా మారటం వంటి వైఫల్యాల్ని గుర్తిస్తూ దేశ ప్రయోజనాల కోసం పనిచేసే యువతను తయారుచేసే సమ్మిళిత విద్యావ్యవస్థను అందించాలనే తపన ప్రభుత్వ ముసాయిదా పత్రంలో కనిపించినప్పటికీ, ఆ విధానానికి ఇంకా స్పష్టత, సరైన దిశానిర్దేశం అవసరమని లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ భావించినట్టు జేపీ తెలిపారు.

### విద్యా'విజయాన్ని' పునర్నిర్వచించాలి

విద్యావ్యవస్థను తీర్చిదిద్ది విస్తృతం చేసేందుకు దశాబ్దాలుగా కృషి జరిగింది కానీ ఫలితాలు అధ్వాన్నంగా, నిరాశా జనకంగా ఉన్నాయని, ఈ వైఫల్యానికి మూలమేమిటి, ప్రస్తుత తీరుతెన్నులెలా ఉన్నాయి, ఆచరణసాధ్యంగా ఏం చేస్తే విద్యావ్యవస్థలో సమూల పరివర్తన తీసుకురాగలం అనే అంశాల్ని మనం స్పష్టంగా గుర్తించటం అవసరమని జేపీ అన్నారు. "విద్యకు, విద్య, వృత్తి రంగాలలో గొప్ప విజయాలను సాధించటానికి మన సమాజంలో భారీ డిమాండ్ ఉంది. కానీ అందుకు తగ్గట్టుగా అవకాశాలు మాత్రం విద్యావ్యవస్థ నుంచి లేవు. దీనివల్ల తల్లిదండ్రుల్లో, విద్యార్థుల్లో నైరాశ్యం, నిస్తేజం పెరిగిపోతున్నాయి, ఆర్థికాభివృద్ధి, దేశ ప్రగతి కుంటు పడుతున్నాయి. నాణ్యమైన విద్యకు ఉన్న డిమాండ్‌ను మనం సప్లయ్ వైపు సంస్కరణలతో సక్రమంగా అనుసంధానం చేస్తే మనం విద్యారంగంలో ఇప్పుడు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపవచ్చు. ఇటీవల కొన్నేళ్లుగా విద్యారంగానికి ప్రభుత్వాల కేటాయింపులు గణనీయంగా పెరిగాయికానీ, ఫలితాలు మాత్రం యధాతథంగా అధ్వాన్నంగా, నిరాశాపూరితంగానే కొనసాగుతున్నాయి. అనేకమంది సేవాభావం కలిగిన, అభ్యుదయ ఆలోచనాపరులైన పౌరులు, కార్పొరేట్లు, ఎన్‌జీవోలు ఈ రంగంలో గణనీయ కృషి చేస్తున్నాయి. విద్యారంగంలో ఉన్న డిమాండ్‌ను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటంతో, దాన్ని వ్యాపారప్రయోజనాలకు వినియోగించుకునేందుకు ప్రైవేటు రంగం భారీ పెట్టుబడులు పెట్టింది. అంతిమంగా, చెప్పుకోదగిన దేశాలలో భారత్ విద్యాప్రమాణాలు అత్యంత అధ్వానంగా ఉన్నాయి. రెక్కాడితేగాని డొక్కాడని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు పోటీప్రపంచానికి తగ్గ చదువు వస్తుందనే ఆశతో తమ స్తోమతుకు మించిన ఫీజులు కడుతూ ప్రైవేటు స్కూళ్లలో చేరుస్తున్నారు. బాగా చదువు చెబుతారు అనే ఆశతో

**విద్యావ్యవస్థను తీర్చిదిద్ది విస్తృతం చేసేందుకు దశాబ్దాలుగా కృషి జరిగింది కానీ ఫలితాలు అధ్వాన్నంగా, నిరాశా జనకంగా ఉన్నాయని, ఈ వైఫల్యానికి మూలమేమిటి, ప్రస్తుత తీరుతెన్నులెలా ఉన్నాయి, ఆచరణసాధ్యంగా ఏం చేస్తే విద్యావ్యవస్థలో సమూల పరివర్తన తీసుకురాగలం అనే అంశాల్ని మనం స్పష్టంగా గుర్తించటం అవసరమని జేపీ అన్నారు.**

తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లలో చేరుస్తున్నా అక్కడా చదువుల్లో నాణ్యత లేదు. అటు ప్రభుత్వ స్కూళ్లు, ఇటు చాలా ప్రైవేటు పాఠశాల్లో చదువు ఫెయిలవటమే ఈవేళ విద్యా వ్యవస్థలో సంక్షోభానికి మూలంగా ఉంది. స్కూళ్లలో మౌలిక వసతులు, ఇంకా ఉపాధ్యాయులు, ఎక్కువ జీతాలు వంటివి మనం చేయాల్సి ఉందిగానీ, వాటి మూలంగా మన విఫల పాఠశాల విద్య బాగుపడదు. మన చదువు – ఫలితాలపై మనకు స్పష్టమైన, సహేతుక ఆధారాలు, సాక్ష్యాలతో కూడిన దృక్పథం కావాలి. మనదేశంలో స్కూలు వి ద్య అంటే ప్రభుత్వంలో, ప్రైవేటు రంగంలో కలిపి 20కోట్ల మంది పిల్లల భవిష్యత్తుకు సంబంధించినది. 12వ తరగతి వరకూ అందరు పిల్లలకూ స్కూలు విద్యగానే పరిగణిస్తే, ఈ సంఖ్య 30కోట్లకు చేరుతుంది. ఇంత సువిశాల పాఠశాల వ్యవస్థలో, ఇప్పటికే ఎంతో నిర్లక్ష్యం, ఉదాసీనత నిండిపోయి, జవాబుదారీతనం కొరవడిన వ్యవస్థలో కేవలం ప్రభుత్వ ఆదేశాలు, బడ్జెట్ కేటాయింపులే ప్రక్షాళన తీసుకురాలేవు. శక్తికి మించి మరీ తమ పిల్లలకు మంచి చదువును అందించాలని అన్నివర్గాల తల్లిదండ్రులలో ఉన్న తపనే మనదేశంలో విద్యారంగాన్ని బాగు చేయటానికి గొప్ప ఇంధనం.

తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల

యాజమాన్యాలు, మీడియా ఇలా సమాజంలో దాదాపు అందరూ విద్యను, విద్య ద్వారా విజయాన్ని ఎంతో విలువైనవిగా భావిస్తున్నా ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో, విద్యా విజయాన్ని, ఆ విజయానికి కొలమానాన్ని పునర్నిర్వచించటం అర్థవంతమైన పాఠశాల విద్యా వ్యవస్థ ప్రధాన సూత్రం కావాలి. ప్రోత్సాహకాలను, ఫలితాలను కొలిచే పద్ధతిని మార్చి, విద్యతో సంబంధమున్న వారందరినీ నిజమైన విజయం, నాణ్యమైన ఫలితాలలో భాగస్వాములను చేయాలి. ఇలాంటి పాలసీ ద్వారా మాత్రమే పాఠశాల విద్య మెరుగుపడి ఇప్పటివరకూ ప్రతిభ మరుగునపడ్డ కోట్లాదిమంది పిల్లలకు ఆశను, అవకాశాల్ని అందించ గలుగుతుంది. జాతీయ విద్యా విధానం ముసాయిదాపై లోక్‌సత్తా / ఎఫ్‌డీఆర్ అందించిన సూచనలు సహేతుక ఆధారాలతో, గణాంకాలతో, భారతదేశంలో, వివిధ దేశాలలోని అత్యుత్తమ విద్యా విధానాలను పరిశీలించి ఈ రకంగా రూపొందించినవి” అని జేపీ తెలిపారు.

**అందరికీ నాణ్యమైన విద్య కోసం కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సత్తా / ఎఫ్‌డీఆర్ అందించిన ప్రధాన సవరణలు, సూచనల్ని జయప్రకాష్ నారాయణ్ మీడియాకు విడుదల చేశారు..**

### లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ పత్రంలోని ప్రధాన సవరణలు, సిఫార్సుల సారాంశం :

#### 1. విద్యాప్రమాణాలను పెంచటానికి తీసుకోవాల్సిన చర్యలు :

- మౌలిక విద్యా నైపుణ్యాలు, కాన్సెప్ట్‌లను గ్రహించగలిగే సామర్థ్యం, పరిజ్ఞానాన్ని ఆచరణలో ఉపయోగించగలిగే శక్తి.. వీటిని విద్యార్థులలో పరీక్షించగలిగేరీతిలో ఒత్తిడి లేకుండా, అర్థవంతంగా ఉండే రెగ్యులర్ మూల్యాంకన విధానం
- ఉపాధ్యాయుల పనితీరును, విద్యార్థులలో ప్రమాణాలను బేరీజు వేసేందుకు తనిఖీ, పర్యవేక్షణ. లోపాల్ని గుర్తించి ఉపాధ్యాయులకు తగిన సూచనలివ్వటం, పరిష్కార చర్యలను చేపట్టటం ఈ ఏర్పాటు లక్ష్యం కావాలి
- స్కూళ్లలో ప్రమాణాల తనిఖీకి, ప్రైవేటు స్కూళ్ల ప్రమాణాల పరిశీలనకు, నిర్దిష్ట కాలవ్యవధిలో పరీక్షల నిర్వహణకు, రాష్ట్ర స్థాయి పరీక్షల నిర్వహణకు స్వతంత్ర ప్రతిపత్తిగల టెస్టింగ్ బోర్డుల ఏర్పాటు
- స్కూళ్ల ప్రమాణాల అంచనాకు, గుర్తింపు (అక్రెడిటేషన్), మార్గదర్శకత్వాలకు, ఉన్నతస్థాయి సలహాలకు, జాతీయ ఉమ్మడి పరీక్షల నిర్వహణకు జాతీయ టెస్టింగ్ బోర్డు ఏర్పాటు
- మన మూల్యాంకనా పద్ధతుల్ని, విద్యాప్రమాణాల్ని పెంచుకునేందుకు వీలుగా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనావేసేందుకు నిర్వహించే అన్ని ప్రపంచస్థాయి సర్వేల్లోనూ పాల్గొనాలి

#### 2. స్కూళ్ల ఏకీకరణ

జాతీయ విద్యావిధానం ముసాయిదా 4వ పేరాలో ఆయా స్కూళ్లతో సంప్రదించిన మీదట స్కూళ్ల ఏకీకరణ అనే ప్రతిపాదన ఆహ్వానించదగ్గది. ఇందుకోసం విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ)ను సవరించాల్సి రావచ్చు. కానీ జాతీయ స్థాయిలో స్థూలంగా నిబంధనల రూపకల్పన, అత్యుత్తమ విధానాలను అనుసరించటం ముఖ్యం.

- ఏకీకరణ చేసిన పాఠశాలల అవసరాలకనుగుణంగా ఉపాధ్యాయులు, మౌలికవసతుల్ని హేతుబద్ధం చేయాలి
- అయితే, ఈ విధానాన్ని అమలుచేసే క్రమంలో ఇంటి నుంచి స్కూలు 3కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం వెళ్లాల్సిన విద్యార్థులకు కిలోమీటరుకు కొంతచొప్పున రవాణా సబ్సిడీ ఇవ్వాలి. కిలోమీటరుకు రూ. 150 చొప్పున ఈ సబ్సిడీ ఇవ్వొచ్చు. ప్రభుత్వం నుంచి ఇలాంటి మద్దతు వల్ల స్కూళ్ల హేతుబద్ధీకరణ తేలిగ్గా సాధ్యమవుతుంది. తక్కువ ఖర్చుతో, ఏర్పాట్లతో పర్యవేక్షణకు అవకాశాలు పెరుగుతాయి. ప్రమాణాలు గణనీయంగా మెరగువుతాయి.

#### 3. బోధనా మాధ్యమం

ఇంగ్లిషు మీడియం విద్యను ఈ దిగువ అంశాలతో కలిపి అందించాలి

- ఐదవ తరగతి వరకు మీడియం మాతృభాషలోనే ఉండాలి
- ఇంగ్లిషును ఒక భాషగా కనీసం ఐదేళ్లపాటు ప్రాథమిక పాఠశాలలో బోధించాలి
- 6వ తరగతి నుంచి వీలున్నచోటల్లా ఇంగ్లిషు మాధ్యమాన్ని అందించాలి
- 8వ తరగతి వరకు బోధన రెండు భాషల్లో సరళంగా ఉండాలి. ఇంగ్లిషు భాష మీద కాకుండా అర్థం చేసుకోవటం లక్ష్యంగా ఈ చదువు ఉండాలి

- ఇంగ్లిషులో బోధనకు తగ్గ ప్రమాణాలను సాధించటానికి ఉపాధ్యాయులకు నిరంతరం తగిన శిక్షణనిస్తుండాలి
- విద్యార్థులు స్కూలు నుంచి బైటికి వచ్చే సమయానికి ఇంగ్లిషులో పట్టు సంపాదించి ధారాళంగా మాట్లాడటానికి వీలుగా 9వ తరగతి నుంచి ఇంగ్లిషును బోధనలో ఎక్కువగా వినియోగించాలి
- మాతృభాష నుంచి ఇంగ్లిషు మాధ్యమంలోకి విద్యార్థులు ఒత్తిడి లేకుండా నెమ్మదిగా మారటానికి వీలుగా సరళమైన మూల్యాంకన పద్ధతులుండేలా పరీక్షా పద్ధతుల్ని ఏర్పరచాలి

### 4. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం

అవసరమైన ఈ కీలక మార్పులకు అనుగుణంగా ఆర్‌టీఈ చట్టాన్ని సవరించాలి. విద్యను అందించటంలో ప్రభుత్వ స్కూళ్లతోపాటు ప్రైవేటు స్కూళ్లను కూడా ప్రభుత్వ విధానంలో ఈ దిగువ విధంగా భాగస్వాముల్ని చేయాలి:

- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిపాదించిన స్వతంత్ర అక్రెడిటేషన్, టెస్టింగ్ బోర్డులకు ప్రైవేటు స్కూళ్ల తనిఖీ, గుర్తింపు బాధ్యతను అప్పచెప్పాలి
- ఇప్పటికే ఉన్నత ప్రమాణాలను కలిగివున్న పాఠశాల్లో అణగారిన వర్గాలకు ఇస్తున్న 25శాతం కోటాని కొనసాగించవచ్చు
- గుర్తింపు, టెస్టింగ్ బోర్డు సలహా మేరకు ప్రభుత్వం తక్కువ ఖర్చుతో చెప్పుకోదగిన విద్యాబోధన చేసే ప్రైవేటు పాఠశాలల్ని గుర్తించాలి. ఆ స్కూళ్లలో ఫీజు బడ్జెట్ పరిధిలో, ఉదాహరణకు ఏడాదికి రూ. 12,000 ఉండవచ్చు. అటువంటి స్కూళ్లను ప్రభుత్వ విద్యావిధానం పరిధిలోకి తీసుకురావాలి.
- విద్యకు ఇచ్చే నిధుల్ని ఉపాధ్యాయుల జీతాల నుంచి క్రమంగా విద్యార్థుల ఫీజు వైపు క్రమంగా మళ్లించాలి. తమ పిల్లల్ని ప్రభుత్వ స్కూలుకు పంపుతారా, ప్రయివేటు స్కూలుకు పంపుతారా.. ఎంచుకునే అవకాశం తల్లిదండ్రులకే ఇవ్వాలి. ప్రభుత్వ విద్యావిధానం కింద గుర్తింపు ఉన్న ప్రైవేటు స్కూళ్లకు తల్లిదండ్రులు విద్యార్థులను పంపితే, ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుంది.
- తక్కువ ఖర్చు ప్రైవేటు స్కూళ్లలో పేద, తక్కువ ఆదాయవర్గాల పిల్లలే చేరే అవకాశం ఉంటుంది కాబట్టి ప్రభుత్వ నిధులు అర్హులైన పిల్లలకే అందుతాయి
- ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు కలిసి ఏర్పాటు చేసుకునే ఛార్టర్ స్కూళ్లను, స్వచ్ఛంద సంస్థలు, దాతృత్వ సంస్థలు ఏర్పాటు చేసే స్కూళ్లను ప్రభుత్వం ప్రోత్సహించాలి
- ప్రైవేటు స్కూళ్లలో ఉపాధ్యాయుల జీతాలకు ఇచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను క్రమంగా విద్యార్థుల ఫీజుతో సంధానం చేస్తారు. అంటే నిధులకు పిల్లలు కేంద్రబిందువు అవుతారు
- స్వతంత్ర మూల్యాంకనం, గుర్తింపు, విద్యాప్రమాణాలు సంతృప్తికరంగా ఉన్నాయా లేదా అనే అంశాల్లో తప్ప అటువంటి ప్రైవేటు స్కూళ్లలో ప్రభుత్వం జోక్యం చేసుకోదు
- ప్రభుత్వంలో ఉపాధ్యాయులు రిటైరైతే, ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు చేరటాన్ని బట్టి కొత్త నియామకాలను ప్రభుత్వం సర్దుబాటు చేస్తుంది. తల్లిదండ్రుల ఎంపికలో ప్రభుత్వ స్కూళ్లకు ప్రాధాన్యం తగ్గి విద్యార్థుల సంఖ్య తగ్గితే, ఆ మేరకు ప్రభుత్వ ఉపాధ్యాయుల జీతాల బిల్లుకూడా తగ్గుతుంది. ఆ మిగిలిన డబ్బును ప్రభుత్వేతర పాఠశాలల్లో విద్యార్థుల ట్యూషన్‌కి వెచ్చిస్తారు

### 5. స్థానిక ప్రజల నేతృత్వం, జవాబుదారీతనం, పాలన

- తల్లిదండ్రుల అభిప్రాయాలకు బలం పెంచాలి. ఆర్‌టీఈ చట్టం (సెక్షన్ 21)లో పాఠశాల యాజమాన్య కమిటీల (ఎస్ఎంసీ) ఏర్పాటుకు అవకాశం ఉంది. తల్లిదండ్రుల బృందాలను ఈ కమిటీల్లో చేర్చే నిబంధనను ఏర్పాటుచేయాలి.
- నాణ్యమైన విద్యను అందించటం, రెగ్యులర్ తనిఖీలు, పర్యవేక్షణ, పరీక్షలు తదితర అంశాలకు సంబంధించి పాఠశాలల నిర్వహణకు స్వతంత్ర విద్యాబోర్డులను బ్లాకు, జిల్లా, నగర స్థాయిల్లో ఏర్పాటు చేయాలి
- పాఠశాల విద్యకు కీలకమైన సిలబస్, పాఠ్యపుస్తకాలు, పరీక్షలు, ఉపాధ్యాయ శిక్షణ, గుర్తింపు తదితర అంశాలను రాష్ట్ర స్కూలు ఎడ్యుకేషన్ బోర్డు చేపడుతుంది.

అందరికీ నాణ్యమైన విద్య కోసం కేంద్రానికి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా అందించిన సవరణలు, సూచనల పూర్తివివరాలను www.fdrindia.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

# భవిష్యత్తు ఉద్యోగాలకు ఈ చదువులు ఎందుకు పనికిరావంటే..



**భా**రత్ నుంచి అంతర్జాతీయ గ్రాడ్యుయేషన్ చదువుల కోసం వచ్చే వారిలో మరి ముఖ్యంగా ఇటీవలికాలంలో నైపుణ్యాలు బాగా కొరవడుతున్నాయనే అభిప్రాయం ప్రవాస భారతీయ విద్యావేత్తల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ, ప్రయివేటు విశ్వవిద్యాలయాల నుంచి అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలతో విదేశాలకు వచ్చేవారిని గత రెండు దశాబ్దాలుగా చూస్తున్నానని, కానీ ఈమధ్యకాలంలో 'నేర్చుకున్న చదువుకు-క్షేత్రస్థాయి అవసరాలకు' మధ్య అంతరం స్థిరంగా పెరుగుతూ వస్తోందని నెబ్రాస్కా విశ్వవిద్యాలయంలో అసోసియేట్ డీన్‌గా పనిచేస్తున్న దీపక్. కె ఇటీవల ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక కాలమ్‌లో పేర్కొన్నారు.

భారత అండర్ గ్రాడ్యుయేట్ విద్యావ్యవస్థ వైఫల్యాల వల్ల విద్యార్థుల్లో కనిపిస్తున్న లోపాల్ని ఆయన ఈరకంగా వివరించారు:

**1) నేర్చుకున్న పాఠాల్ని ఆచరణలో చేసి చూపలేకపోవటం:** అండర్‌గ్రాడ్యుయేషన్‌లో నేర్చుకున్న థియరీని పోస్టుగ్రాడ్యుయేషన్‌లో ప్రాక్టికల్‌గా ప్రదర్శించటం విద్యార్థులకు మొట్టమొదటి అతిపెద్ద సమస్య. ఉదాహరణకు, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీలో చాలామంది విద్యార్థులు అండర్ గ్రాడ్యుయేషన్‌లో చదువుకున్నదాన్నిబట్టి లాంగ్వేజెస్ ప్రోగ్రామింగ్ తెలుసని చెప్పేస్తారు. తీరా ఒక వ్యాపారరంగ అవసరాన్నో, సమస్యనో పరిష్కరించాల్సి వచ్చేసరికి చేతులెత్తేస్తున్నారు.

**2) ప్రశ్నించే, తరచి చూసే సామర్థ్యం కొరవడటం:** ఒక విషయాన్ని పరిశీలించే తరచిచూసే సామర్థ్యాన్ని పెంచుకోకపోవటం వల్ల తమకున్న అవకాశాలను, ఆలోచనలను తర్కబద్ధంగా, సమగ్రంగా అర్థం చేసుకునే శక్తిని విద్యార్థులు కోల్పోతున్నారు. పోస్టుగ్రాడ్యుయేషన్ స్థాయి విద్యార్థిలోగానీ, ఉద్యోగిలోగానీ స్పష్టంగా, హేతుబద్ధంగా ఆలోచించి, సొంతంగా విశ్లేషించి, సృజనాత్మకంగా కొత్త పరిష్కారాలను జోడించే సత్తా ఉండాలి. విద్యాసంస్థలు, ఉద్యోగ యాజమాన్యం ఆశిస్తున్న ఈ వాస్తవిక ప్రమాణాన్ని చాలామంది విద్యార్థులు అందుకోలేకపోతున్నారు.

**3) ఎంటర్‌ప్రెన్యూర్‌లా ఆలోచించటం:** కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు చేస్తూ ప్రపంచవ్యాప్తంగా అనేక బహుళ జాతి సంస్థలకు సారథ్యం వహిస్తున్న అనేకమంది ఐఐటి, ఐఐఎం

పట్టభద్రులు మనకున్నా భారతీయ సంతతికి చెందిన మెజారిటీ గ్రాడ్యుయేట్‌లు ఎంటర్‌ప్రెన్యూర్‌లా ఆలోచించలేకపోతున్నారు. సృజనాత్మకంగా, సొంతంగా, కొత్తగా ఆలోచించే స్వేచ్ఛాయుత మానసిక వాతావరణాన్ని తొలిదశ చదువులోనే వారికి అందించగలిగితే ఈ మైండ్‌సెట్ మారుతుంది.

**4) విద్యార్జనలో నిజాయతీ:** అంతర్జాతీయ విద్యార్థులు మోసపూరితంగా వచ్చి చేరుతున్నారని అమెరికా, బ్రిటన్‌లోని విద్యాసంస్థల్లో తరచూ వినిపించే ఫిర్యాదు దురదృష్టవశాత్తూ వీరిలో భారత్ నుంచి వచ్చిన విద్యార్థులే ఎక్కువ. ఇలాంటి ఫిర్యాదులు భారతదేశ విద్యా, పరిశోధనా సంస్థల్లో కూడా వినిపిస్తుంటాయి. ప్రతి విడతలోనూ పరీక్షల్ని, అసైన్‌మెంట్లని మార్చటంలో ప్రొఫెసర్ల నిర్లక్ష్యం కూడా ఇందుకు కారణం. అయితే ఇందుకు ప్రధాన బాధ్యత విద్యాసంస్థల మీదే ఉంటుంది. ఉపాధి పొందటానికి, ఉన్నత విద్యకు కావలసిన నైతిక సామర్థ్యాన్ని ఇవి విద్యార్థులకు అందించాల్సి ఉంటుంది. అరచేతిలో చిటెకలో సమాచారం అందుతున్న ఈరోజుల్లో ఈ అకడమిక్ నిజాయతీ ఆవశ్యకతను ప్రతి విద్యార్థీ గుర్తించి నడవడికలో భాగం చేసుకోవాలి.

**5) బహుముఖ సామర్థ్యం:** సమస్యల్ని ఎదుర్కోవటానికి ఆలోచనతో కూడిన మల్టీడిసిప్లినరీ దృక్పథం రాబోయే రోజుల్లో ప్రతి ఉద్యోగికీ అవసరమవుతుంది. జీవితంలో, వ్యాపార ప్రపంచంలో ఎదురయ్యే సంక్లిష్ట సమస్యల్ని బహుళ రంగాల నుంచి విశ్లేషించి పరిష్కరించటానికి వినూత్న పనితీరు, సృజనాత్మక ఆలోచనలను ఎప్పటికప్పుడు పెంచుకుంటుండటం అవసరం. వివిధ రకాల కోర్సుల మధ్య సంధానం లేని ప్రస్తుత విద్యావ్యవస్థ వల్ల భారత్‌లోని చాలామంది విద్యార్థులలో ఈ సామర్థ్యాలు కొరవడుతున్నాయి.

భారతదేశంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత విద్యాసంస్థలు ఈ అంశాలను క్షుణ్ణంగా సమీక్షించుకుని తగిన మార్పులు చేసుకోవాలి. తక్షణ అవసరాలకే కాకుండా, భవిష్యత్తు ఉద్యోగావకాశాలను కూడా దృష్టిలో పెట్టుకుని భారతీయ విద్యావ్యవస్థను పునాది నుంచీ ప్రక్షాళన చేయాల్సి ఉంది. మన విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రావాలి. ప్రాజెక్టులతో కూడిన చదువు, ఆదాయంతో కూడిన ఇంటర్న్‌షిప్,




వివిధ రకాల సబ్జెక్టులను వాటి మధ్య అనుసంధానాన్ని గుర్తిస్తూ నేర్చుకోవటం వంటివి విద్యావ్యవస్థలో భాగమవ్వాలి.

"కానీ, అంతిమంగా ఇవేవీ సర్వరోగనివారిణులు కావని కూడా మనం గుర్తించాలి. మార్టిన్ లూథర్ కింగ్ చెప్పినట్టు.. మేధస్సును, వ్యక్తిత్వాన్ని పెంచటమే మంచి చదువు లక్ష్యం. అందుకోసం లోతైన, సమగ్రమైన, సామర్థ్యాన్ని వెలికితీసే అధ్యయనం విద్యావ్యవస్థలో భాగం కావాలి" అని దీపక్ అన్నారు.

ఇలాంటి చదువును అందించగల నేపథ్యం భారతీయ సంస్కృతికి ఉంది. కావలసిందల్లా, రాజకీయ, సామాజిక సంకల్పమే. పరిమితమైన రిజర్వేషన్లతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ నాణ్యమైన విద్య నుంచి దృష్టి మరలిస్తున్న సాంప్రదాయ రాజకీయాన్ని ఛేదించాలి. నాణ్యమైన పాఠశాల విద్యతో బహుముఖ ప్రజ్ఞాశాలురైన పౌరుల్ని తయారుచేయటం, జేబులో నుంచి ఖర్చు లేకుండా అందరికీ ఆరోగ్యం అందించటం వంటి మౌలిక మార్పులు తెచ్చే మెరుగైన రాజకీయం కోసమే లోక్‌సత్తా రాష్ట్రాలకు మరిన్ని అధికారాలను వికేంద్రీకరించాలని కోరుతోంది.

# కాసుల చదువుల మధ్య కామన్‌స్కూల్ కల

**- కె.శ్రీనివాస్**
సీనియర్ సంపాదకులు



**భా**రత్‌కు పొరుగున ఉన్న అతి చిన్న దేశం భూటాన్. రాచరికం నుంచి ప్రజాస్వామ్యానికి శీఘ్ర పరివర్తనలో ఉన్నది. పదకొండో తరగతి దాకా అందరికీ నాణ్యమయిన ఉచిత విద్య అందించడం ఆ దేశ విద్యావిధానంలో ఒక ముఖ్యమయిన అంశం. హైయర్ సెకండరీ విద్య దాకా చదువు చెప్పే ప్రభుత్వ స్కూళ్లు ఆ దేశంలో 1300 ఉంటే, ప్రైవేటు స్కూళ్లు 24 మాత్రమే ఉన్నాయి. స్థానిక భాష జోంఖా, ఇంగ్లీషు, లెక్కలు- ఈ మూడు ఆ దేశ విధానకర్తలు ప్రధానంగా భావించే విద్యాంశాలు. పదకొండో తరగతి ముగిసే నాటికి జోంఖా భాషలో వ్యవహారిక, పరిపాలనా, సాహిత్య అవసరాల కోసం చదవడం, రాయడం విద్యార్థులకు రావాలి. ఇంగ్లీషులో మాట్లాడడం రావాలి. ప్రభుత్వ కార్యాలయాలలో జూనియర్ అసిస్టెంట్ స్థాయిలో లెక్కలు చేయగలగాలి. టూరిజం ఒక ప్రధాన ఉపాధి అయిన ఆ దేశంలో సంబంధిత వృత్తుల్లో ఉన్న యువతీయువకులు అవసరమైన మేరకు ఇంగ్లీషు మాట్లాడగలరు. భారత్ సినిమాలు, టీవీల ప్రభావంతో హిందీ కూడా మాట్లాడగలరు. అదనంగా కంప్యూటర్ కోర్సులు నేర్చుకుని ఉద్యోగాలూ సంపాదించుకోగలరు. ఉన్నత విద్యకు అవకాశాలు ఆ దేశంలో పరిమితమే అయినప్పటికీ, హైస్కూలు విద్య ఆ సమాజానికి ఈ దశలో కావలసిన కనీస మానవవనరులను అందించడంతోపాటు, ఒక స్థాయి ఉపాధిని గ్యారంటీ చేస్తున్నది. ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కోత విధించి అయినా సరే విద్యా వ్యాప్తి సార్వత్రికం చేయాలని, నాణ్యతలో రాజీ పడకూడదని ఆ దేశ పాలకులు భావిస్తున్నారు. ఆ దేశంలో సంతోషపు సూచిక ఉచ్ఛస్థాయిలో ఉండడానికి సార్వజనీన విద్య కూడా ఒక కారణం.

ప్రపంచంలో అతిబలశాలి రాజ్యంగా ఉన్న అమెరికాలో కిండర్‌గార్టెన్ నుంచి 12వ తరగతి దాకా ప్రభుత్వం ఉచిత విద్య అందిస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉచిత విద్య అందించే పబ్లిక్ స్కూళ్లలో అయినా, ప్రైవేటు నిధులతో ఫీజులతో నడిచే స్కూళ్లలో అయినా చదివించవచ్చు. అత్యధిక అమెరికన్ విద్యార్థులు పబ్లిక్ స్కూళ్లలోనే చదువుతారు. పబ్లిక్ స్కూళ్లలో విద్య అంత నాణ్యంగా ఉంటుంది. ప్రపంచంలో విద్యార్థుల మీద అత్యధికంగా తలసరి వ్యయం చేసే దేశం అమెరికా. ఆ దేశంలో చాలాచోట్ల పబ్లిక్ స్కూళ్లు స్థానిక సంస్థల పన్నుల ఆదాయంతోనే నడుస్తాయి. 12వ తరగతి తరువాత ఉన్నత విద్య ఆ దేశంలో అత్యంత ఖరీదు. అది వేరే విషయం.

ఒక పెద్ద దేశం, అతి చిన్న దేశం- రెండూ చదువుని అంత ముఖ్యమయినవిగా భావిస్తుంటే, భారతదేశం ఎందుకు విద్యారంగాన్ని ఇంతగా నిర్లక్ష్యం చేస్తున్నది? ప్రభుత్వం ద్వారా ఉచిత విద్య ఇక్కడ కూడా లభిస్తున్నది. పదకొండో పన్నెండో తరగతుల వరకే కాదు, ఇంజనీరింగులూ పీహెచ్‌డీ లకూ కూడా నిధులు అంది స్తున్నది. కానీ, పునాది విద్య ఎందుకు కునారిల్లిపోయింది? పదో తరగతి తరువాత చదువు నుంచి జారుకుంటున్న వారి సంఖ్య ఎందుకు అధికంగా ఉంటున్నది? ప్రభుత్వ స్కూళ్లను నిర్లక్ష్యపు ఊబిలో తోసేసి, ప్రైవేటు విద్యారంగానికి ఎందుకు వత్తాసు పలికింది? పోనీ ఆ ప్రైవేటు రంగమయినా నాణ్యమయిన, సర్వతోముఖమయిన విద్య అందించే విధంగా నియంత్రణ ఎందుకు చేయడం లేదు?

ఈ ప్రశ్నలు విషాదకరమయినవి. కొత్తగా ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన వ్యక్తి అప్పుడే నిద్రలేచినట్టు, ఆడపిల్లలకు టాయిలెట్లు లేని పాఠశాలలు ఉండడమేంటి అని ఆశ్చర్యపోతాడు, ఈ దేశంలో ఇంత చెత్త ఉన్నదేమిటీ అని గుండెలు బాదుకున్నట్టు. ఈ విధ్వంసంలో అధికారంలో ఉన్న పార్టీలే కాదు, ప్రతిపక్షాలుగా చట్టసభలలో పాలుపంచుకున్న అందరికీ పాత్ర ఉన్నది.

ఉచితంగా ఇస్తే చాలదు, ఆ విద్య నాణ్యంగా ఉండాలి. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుని వివిధ హోదాలలో దేశపాలనలో, సమాజరంగంలో పాత్ర పోషిస్తున్నవారు ఇంకా దేశంలో అసంఖ్యాకంగా ఉన్నారు. ఎందరో మేధావులను, రచయితలను,

సంఘసేవకులను, రాజకీయవేత్తలను అందించిన ప్రభుత్వ పాఠశాలలు నాణ్యత లేనివిగా ఎట్లా మారాయి? ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఎట్లా ఖాయిలా పడ్డాయో అట్లాగే స్కూళ్లూ శిథిలమయ్యాయి. ఇప్పటికీ, మారుమూల పల్లెటూళ్లలో, గిరిజన గూడేలలో, కాలినడకన వెళ్లి పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులు ఎందరో ఉన్నారు. పాఠశాల నిర్వహణే జీవితంగా చదువు దీపాన్ని వెలిగించడానికి తాపత్రయపడుతున్న హెడ్మాష్టర్లూ ఉన్నారు. ఒకరో ఇద్దరో పదిమందో బాధ్యతారహితులు ఉండవచ్చు. కానీ, మొత్తం మీద ఉపాధ్యాయ వృత్తిని సీరియస్‌గా తీసుకునే గురువులే, పిల్లలు ఎదిగి పెద్దవారయితే సంబరపడే గురువులే విరివిగా కనిపిస్తారు. కానీ, వారి తపనకు ఆలంబన ఏదీ? వ్యవస్థాగతమయిన వనరులు ఏవీ? ప్రభుత్వ స్కూళ్ల మీద అపప్రథ వ్యాపిస్తుంటే, ప్రైవేటు విద్యాసంస్థల వ్యాప్తి కోసం పాలకులు దానిని అనుమతించారు. ప్రైవేటు విద్యకు వలసవెళ్లినవారు పోగా, బడుగుబలహీనులు ప్రభుత్వ స్కూళ్లలో మిగిలిపోయారు. ప్రైవేటీకరణలో బాధితులు వారే.

ఉచిత విద్య మీద ఖర్చు తగ్గించాలి. టీచర్ల సంఖ్య తగ్గించాలి. కొత్త నియామకాలు చేయకూడదు... ఇటువంటి ఆదేశాలను ప్రపంచప్రభువుల నుంచి తీసుకోవడం మొదలుపెట్టిన తరువాత, స్కూళ్ల పరిస్థితి మరింత దిగజారింది. ప్రాథమిక, సెకండరీ విద్యల సంగతి సరే, ఉన్నత విద్యకు ప్రభుత్వ పెట్టుబడులు మరింత తగ్గించాలి. చదువును కూడా ఒక వ్యాపార సేవగా గుర్తించాలి. విదేశీ విద్యాసంస్థల వ్యాపారం కోసం ప్రభుత్వ విద్యాసంస్థల నిధులను, ప్రతిష్టను దిగజార్చాలి. ఇవి ఇటీవలి పరిణామాలు. కావాలంటే, మొన్న డిసెంబర్‌లో నైరోబీలో ఏం జరిగింది, నిర్మలా సీతారామన్ ఏ అంశాల్లో రాజీపడి వచ్చారో తెలుసుకోండి. ఇక్కడ చదువుకున్నవారిని చవకగా ఎగరేసుకుపోవడం మొన్నటి దాకా చూశాం. అది బ్రెయిన్ డ్రెయిన్ అనుకున్నాం. ఇప్పుడు, ఇక్కడ చదువుచెప్పేపని కూడా వారే తీసుకుంటారు. ప్రభుత్వ విద్యను పునాదిలోనే దిగజార్చడం మొదలుపెట్టిన దశకు, ఇప్పుడు ఉన్నత విద్యను నిశ్శబ్దంగా హత్య చేస్తున్న దశకు మధ్యలో జులాయి విద్యాసంస్థలు ఎగుమతి ఆధారిత విద్యతో తెగ సొమ్ము చేసుకున్నాయి. కాంట్రాక్టర్ల తరువాత ఇప్పుడు హవా విద్యాసంస్థ యజమానులదే. రాజకీయాలలోనూ వారికిప్పుడు ఉచ్ఛదశ ప్రాప్తించింది. ఉన్నత విద్యను గ్లోబలైజ్ చేసే ప్రక్రియకు అనుబంధంగా ఇప్పుడు మొత్తం విద్యావిధానాన్ని ఏకరూపంగా మార్చేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నారు. మూల్యాంకన పద్ధతులు, సిలబస్‌లు అన్నీ మారిపోతున్నాయి. కొద్దోగొప్పో బాధ్యత కలిగిన పాత చదువులు చదివినవారిలో ఆ విద్య చైతన్యంగానో సామాజిక అవగాహనగానో మారుతుంటే, దానిని ఉక్కుపాదంతో అణచివేయడానికి యూనివర్సిటీల మీద దాడులు జరుగుతున్నాయి.

ప్రైవేటు విద్యాసంస్థల ఉధృతికి మరో కారణం ఇంగ్లీషు మాధ్యమం. ఉపాధికి, సాధికారతకు కూడా ఇంగ్లీషే మార్గమని భావించే వారిని తప్పుపట్టలేము. శుష్క భాషాభిమానంతో మాతృభాషలను కాపాడుకోలేము. ప్రజల ఆకాంక్షను, మాతృభాషల రక్షణను రెంటినీ సమన్వయం చేసే పరిష్కారాలను వెదికే తీరిక ప్రభుత్వాలకు లేదు. మౌలిక వసతుల కల్పన పేరుతో రోడ్ల మీద రోడ్లు, ఎయిర్‌పోర్టులు, పోర్టులు కడతారు కానీ, అన్నిటికంటే కీలకమయిన మౌలిక సదుపాయాలు విద్య, ఆరోగ్యం– అన్న గుర్తింపు ఉండదు. ఈ రెండు రంగాలను కూడా మార్కెట్‌కు వదిలేసి, దేశభవిష్యత్తును ప్రమాదంలో పడవేశాయి ఇటీవలి ప్రభుత్వాలు.

విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి, కొత్తగా తీర్చిదిద్దుకోవడానికి కొత్త రాష్ట్రంగా తెలంగాణకు అవకాశం లభించింది. వివక్ష వల్ల ఏర్పడిన వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు సార్వజనీనమయిన, నాణ్యమయిన విద్యను అందించడం ఒక నమ్మదగిన మార్గం. కామన్‌స్కూల్ తన కల అని కేసీఆర్ చెప్పుకున్నారు. కమ్యూనిటీ కనుసన్నలలో మంచి చదువులు కామన్‌స్కూళ్లలోనే సాధ్యం. సర్కారుబడులు గతంలో అవే పనిచేశాయి. వాటిని పటిష్టమూ సుస్థిరమూ చేయడం ద్వారానే ఇప్పుడు కూడా ఆ కలను నెరవేర్చుకోవచ్చు. వందోరెండొందలలో గురుకుల పాఠశాలలు ప్రారంభించడం 'కేజీ టూ పీజీ ఉచిత విద్య'కు ప్రత్యామ్నాయం కాదు. పాఠశాలలకు కావలసిన భౌతిక వనరులన్నీ సమకూర్చాలి. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి. స్కూళ్లను మూసివేయడం నిలిపివేయాలి. ఒకనాడు ప్రభుత్వ స్కూళ్లకు సమకూరిన వనరులను ఇప్పుడు వాణిజ్య అవసరాలకు మళ్లించాలనుకునే దుర్బుద్ధి మానుకోవాలి. విద్యావ్యాపారాన్ని కఠినంగా నియంత్రించాలి. విద్యారంగం మీద అధికార రాజకీయాల నీలినీడలను పారదోలాలి. అన్నిటికి మించి చదువుల రంగాన్ని–అక్రమాదాయాల వనరుగా చూడడం ఏలికలు మానుకోవాలి. ఇంగ్లీషు మీడియా స్కూళ్ల మీద నిర్ణయం తీసుకుంటే, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలి. మన సమాజానికి ఎటువంటి విద్య అవసరమో, అటువంటి విద్యను కరికులమ్‌లో పొందుపరచాలి. ఇందుకు కేవలం రాజకీయ సంకల్పం, బ్యూరోక్రటిక్ ఆచరణా సరిపోవు. యావత్ సమాజాన్ని కలుపుకుని, విద్యారంగ నిపుణుల సూచనలు తీసుకుని, క్షేత్రస్థాయి వాస్తవికతను, అవసరాలను పరిగణలోకి తీసుకుని ప్రణాళికారచన చేయాలి. రెండు సంవత్సరాలు గడచినా, ఆ దిశగా ఒకటిరెండు అడుగులు కూడా పడకపోవడం విషాదం.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

# వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి రూ.60కోట్లు.. ఎన్నికల సంస్కరణలు తెచ్చుకోనంత వరకూ రాజకీయ అవినీతి ఆగదు: సీపీఐ సదస్సులో జేపీ



అధికారం మార్గం కాదు అధికారమే లక్ష్యం, ఎలాగైనా అధికారమే సర్వస్వం, డబ్బే అధికారానికి మార్గం అనే ప్రస్తుత పరిస్థితి మార్చుకుంటేనే సమర్థులు, నిజాయతీపరులు రాజకీయాల్లోకి వచ్చి ఈదేశంలో నిజమైన ప్రజాస్వామ్యం నెలకొంటుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ ప్రజాస్వామిక పరివర్తనకి రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవటం, ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ స్థానంలో దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టటం, ప్రభుత్వోద్యోగులు చేయాల్సిన పనులు చేస్తూ ఎన్నికల్లో గెలవటానికి ప్రయత్నిస్తున్న రాజకీయ పార్టీల, అభ్యర్థుల తీరును మార్చటం కీలక పరిష్కారాలన్నారు.

గుంటూరు కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్ వేములపల్లి శ్రీకృష్ణ హాల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 'ఎన్నికల్లో ధనప్రవాహం–పర్యవసానాలు–ప్రజాస్వామ్య భవిష్యత్తు' సదస్సులో జేపీ పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. స్వతంత్ర పోరాటకాలం నుంచి పరిణామాలు, స్వాతంత్ర్యానంతర దశలో ఎన్నికలు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, 1990ల నుంచి పెరిగిన డబ్బు ప్రవాహం తదితర అనేక అంశాలను విశ్లేషించి చర్చించిన అనంతరం సదస్సులోని వక్తలు జేపీ సూచించిన పరిష్కారాలకు మద్దతు పలికారు.

జేపీ మాట్లాడుతూ.. ప్రజల్లో ఉన్న దుర్భర దారిద్ర్యం, సంపూర్ణ నిరక్షరాస్యత, ప్రభుత్వం పట్ల బ్రిటీషు వారసత్వంగా వచ్చిన భయం వంటి వాటిని ఆసరాగా తీసుకుని కొందరు గద్దెనెక్కి దోచుకుంటూ మెజారిటీ ప్రజలను యాచకులుగా కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే లంచాలు, వేధింపులు, అవహేళనలు చేసే యంత్రాంగాలను చూసి భయపడే ప్రజలు రాజకీయ నేతలను ఆశ్రయిస్తున్నారని, ఓటు కొనుగోళ్లు ఈ రకంగానే మొదలైందని అన్నారు. ఓటు వేస్తామని హామీ ఇచ్చినవారికి, వేసిన వారికి రోజువారీ పనుల్ని చేసి పెట్టేందుకు కార్యకర్తల వ్యవస్థనొకదాన్ని ఏర్పాటు చేసి, వారిని పోషించడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. ఎన్నికల్లో డబ్బు పంచినా గెలుస్తారనే గ్యారంటీ లేదని, కానీ డబ్బు పంచకపోతే ఓడిపోవటం ఖాయమని చెప్పుకోవటానికి చుట్టూ కోకొల్లలుగా ఉదాహరణలు కనిపిస్తాయన్నారు. దేశంలో అభ్యర్థులు ఎన్నికల్లో డబ్బు పంపిణీ చేయకుంటే 40శాతం ఓటింగ్ జరిగే అవకాశం కనిపించటం లేదన్నారు. నేడు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారిలో ఎక్కువమంది చేసిన ఖర్చును రాబట్టుకోవటానికి రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని, సొంతంగా పైరవీలు చేస్తూ అవినీతికి ఆజ్యం పోస్తున్నారని అన్నారు. ఏ దేశంలో కూడా కార్యకర్తల ద్వారా ప్రభుత్వ పథకాల పంపిణీ ఉండదన్నారు.

స్వతంత్రం వచ్చిన నాటి నుంచి వున్న కొన్ని లొసుగులను సరిదిద్దే ఏర్పాట్లు లేకపోవటం వల్ల ధన రాజకీయాలు పెద్ద సమస్యగా మారాయని జేపీ అన్నారు. నేరుగా డబ్బు ఇవ్వటంతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టటం, సంక్షేమం ముసుగులో తాయిలాలు, ఉచితాలు పంచే పథకాలు వంటి వాటితో ప్రజల జీవితాలు ఎదగకుండా చేస్తున్నారన్నారు. ఇవీ సరిపోకపోతే కులం, మతం, ప్రాంతం వంటి విద్వేషాల్ని రగులుస్తున్నారన్నారు. ఈరకంగా ఓట్లు, సీట్లు పొందుతున్న ఒక రాజకీయ పార్టీని నడపటానికి ఏడాదికి రూ. 1,500 కోట్లు నుంచి 3,000 కోట్ల వరకూ ఖర్చవుతుందన్నారు. పార్టీలు ఫ్యాక్టరీల్లా తయారయ్యాయన్నారు. అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా

మార్పును ఆహ్వానించే పరిస్థితి లేదన్నారు. దేశంలో ఇలా ధనరాజకీయాలకు నాంది పలికిన అప్రదిష్ట కర్ణాటక, తమిళనాడు, తెలుగు రాష్ట్రాల నాయకులదేనన్నారు. పశ్చిమ బెంగాల్, గుజరాత్, కేరళ వంటి రాష్ట్రాల్లో ఇతర సమస్యలున్నాయిగానీ ఎన్నికల్లో మరీ ఇంత ధనప్రవాహం లేదన్నారు. 2004-09 మధ్య కాలంలో లోక్‌సత్తా ప్రయత్నంతో దేశంలో దామాషా ఎన్నికల వ్యవస్థ వచ్చే అవకాశం లభించిందని, ఒక ప్రముఖ వామపక్ష నాయకుడి బాధ్యతారాహిత్యం వల్ల ఆ అవకాశం తృటిలో తప్పిపోయిందని, దీనికి దేశం ఈవేళ ఉగ్రవాదుల చర్యలకన్నా కూడా ఎక్కువ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని అన్నారు. దేశంలోని వామపక్ష పార్టీల్లో విధాపరమైన లోపాలున్నా ప్రజల కోసం ఆలోచించాయని, ఆ పార్టీల నాయకులు ఎన్నో త్యాగాలు చేశారని అన్నారు. ఎన్నికల్లో సంస్కరణల్ని తెచ్చుకోవటానికి.. సమస్యలపై రాజీలేని పోరాటంతోపాటు స్పష్టమైన పరిష్కారాలను గుర్తించాలన్నారు.

"2003లో తెహల్కా స్టింగ్ ఆపరేషన్‌ను ఒక అవకాశంగా వినియోగించుకుని రాజకీయ పార్టీలకు నిజాయతీగా విరాళాలిచ్చేందుకు లోక్‌సత్తా చట్టాన్ని సాధించినా, ఆ చట్టం వల్లే లోక్‌సత్తా, ఆమ్‌ఆద్మీ తదితర పార్టీలు రాగలిగినా, ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ వల్ల అది ఇంకా ఆశించిన ఫలితాలను సాధించలేకపోతోంది. ఈ నేపథ్యంలో మంచి రాజకీయాలపై ప్రజలను చైతన్యపరచటంతోపాటు మనదేశ పరిస్థితుల కనుగుణంగా దామాషా ఎన్నికల పద్ధతిని తేవాలని లోక్‌సత్తా కొన్నేళ్లుగా ప్రతిపాదిస్తోంది. దామాషా పద్ధతిపై రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలోనూ ఏకాభిప్రాయ సాధనకు కృషి చేస్తోంది. అలాగే రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకోవటం వల్ల ధనప్రభావం తగ్గటంతోపాటు పరిపాలన బాగుపడుతుంది. ప్రస్తుతం రాజకీయం, పరిపాలన అంతా శాసనసభ్యుల చుట్టూ తిరుగుతున్నాయి. ఎమ్మెల్యే రాజ్యం వల్ల అవినీతి విశృంఖల మవుతోంది. చట్టసభ నుంచి ప్రభుత్వాన్ని వేరు చేస్తే మొత్తం రాజకీయం మారటానికి మార్గం సుగమమవుతుంది" అని జేపీ అన్నారు.

ఎన్నికల్లో ఎంత గొప్పగా హామీలిచ్చినా, నల్లధనాన్ని ప్రభుత్వం అరికట్టలేకపోవటానికి కూడా ఎన్నికలు డబ్బు చుట్టూ తిరుగుతుండటమే ప్రధాన కారణమని జేపీ అన్నారు. ఇది ఇలాగే వదిలేస్తే వచ్చే ఎన్నికల్లో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో రూ. 60కోట్లు ఖర్చయ్యే అవకాశముందన్నారు. ఇంకా కొన్ని తరాలు నష్టపోకుండా ఇప్పటికైనా అన్ని పార్టీలూ ఎన్నికల సంస్కరణలకు కలిసిరావాలని జేపీ విజ్ఞప్తి చేశారు.

సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ, డబ్బు లేనివారు ఎన్నికల్లో పోటీకి అనర్హులు అనే పరిస్థితి నెలకొందన్నారు. డబ్బు లేకపోయినా, పార్టీ కోసం, విధానాల కోసం పనిచేస్తే గతంలో ఎమ్మెల్సీ, ఎంపీ (రాజ్యసభ) పదవుల్ని కేటాయించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం విచ్చలవిడిగా డబ్బు పంపిణీ జరుగుతోందన్నారు. డబ్బు తీసుకుని ఓట్లు వేయటాన్ని ఓటర్లు తప్పుగా భావించటం లేదన్నారు. తెలంగాణలో అన్ని పార్టీలను మూయించేయాలన్న కేసీఆర్ తీరుని తప్పుపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపీలో 21మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని విమర్శించారు. ఢిల్లీ వెళ్లి అసెంబ్లీ సీట్లను 175 నుంచి 225కు పెంచేందుకు కేంద్రంతో చర్చలు జరుపుతున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకపోయినా ఆయనకు ఏ ఇబ్బందీ లేదన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి అర్థం లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల్లో ధనప్రభావంపై సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నికల్లో ఉన్న అనేక లోపాలను ప్రచార సమయంలోను, ఆ తర్వాత సీపీఐ ఎత్తిచూపుతోందన్నారు. కార్పొరేట్లకు, ధనార్జన వర్గాలకు రాజకీయాలు వేదికగా మారాయని, పార్లమెంటు వారికి క్లబ్‌గా మారిందని అన్నారు. ఎన్నికల్లో సంస్కరణలకు సామాజిక రాజకీయ ఉద్యమం తీసుకురావాలన్నారు. ఇప్పటికే ఈ ప్రయత్నాన్ని ప్రారంభించామని, తిరుపతి సమావేశంలో ఈ అంశంపై ఒక డాక్యుమెంట్ తయారుచేసి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించామని తెలిపారు.

ఎన్నికల్లోనే కాదు, సమాజంలో కూడా ధన ప్రభావం తగ్గాల్సి ఉందని వైద్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. సేవ చేయాలనే భావన ప్రజల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందని ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సంగిరెడ్డి హనుమంత రెడ్డి అన్నారు. ప్రస్తుతం విద్యావ్యవస్థ నిర్వీర్యమైపోయిందని, యువతపై దీని ప్రభావం అధికంగా ఉందని అన్నారు.

విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ మిలార్టన్ మాట్లాడుతూ, దేశంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఏటా లెక్కలు చూపని వేల కోట్లు వసూలు చేస్తున్నాయన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్ గత ఎన్నికల్లో కేవలం రూ. 20 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, అవి పారదర్శకంగా ప్రజల నుంచి సేకరించిన విరాళాలని చెప్పారు.

సదస్సులో సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు కె. హరినాథరెడ్డి, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, విశాలాంధ్ర దినపత్రిక పూర్వ సంపాదకులు రాఘవాచారి, డాక్టర్ విశ్వనాథ్, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు రాం ప్రసాద్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు టి. సేవాకుమార్, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# దూకుడు దౌత్యమా?

-కె.రామచంద్రమూర్తి



స్వతంత్ర భారతం 70వ ఏట అడుగుపెడుతున్న సందర్భంలో ప్రమాదపుటంచుల్లోకి దేశాన్ని తీసుకొని వెళ్లగల ఒకానొక దౌత్య క్రీడ రూపుదిద్దుకోవటం మొదలైంది. ఇంతకాలం కేంద్రంలో ఏ పార్టీ లేదా ఏ కూటమి ప్రభుత్వం వచ్చినా భారత విదేశాంగ విధానం మాత్రం మారదనే విశ్వాసం ఉండేది. ప్రధాని నరేంద్ర మోదీ మదిలో మెదులుతున్నట్టు కనిపిస్తున్న ఆలోచనలు కనుక కార్యరూపం ధరిస్తే మన విదేశాంగ విధానం స్వరూపస్వభావాలు సమూలంగా మారిపోతాయి. మనదేశంలోనూ, ఇరుగుపొరుగు దేశాలలోనూ పరిస్థితులు ఇప్పుడున్నట్టు ఉండవని మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు.

ఇటీవల ఢిల్లీలో అఖిల పక్ష సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం ఇటు వంటి అభిప్రాయానికి ఆస్కారం కలిగిస్తున్నది. హిజ్బుల్ కమాండర్ బుర్హాన్ వానీని జులై 8న భద్రతాబలగాలు మట్టుపెట్టిన క్షణంలో రగులుకున్న కశ్మీరం ఇంతవరకూ చల్లారలేదు. ఆగ్రహో దగ్రులైన సాధారణ ప్రజలకూ, సాయుధ దళాలకూ మధ్య జరిగిన ఘర్షణల్లో పలువురు మరణించి, కొన్ని వందలమంది గాయపడినా ఉద్రిక్తపరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. వానీ నేలకొరిగిన తర్వాత నెలరోజులకు ఆగస్టు 9న ప్రధాని నోరు విప్పారు. శాంతి పునరుద్ధరణలో సహకరించవలసిందిగా కశ్మీరీలకు విజ్ఞప్తి చేశారు. కశ్మీర్‌లో జరుగుతున్నది స్వాతంత్ర్య పోరాటమనీ, స్వాతంత్ర్య సమరవీరులను భారత్ ఉక్కుపాదంతో అణచివేస్తున్నదనీ అంతర్జాతీయ వేదికల మీద పాకిస్తాన్ యధావిధిగా మొత్తుకుంటున్నది. మొసలి కన్నీరు కార్చుతోంది. ఈ ధోరణి కొత్త కాదు.

**అసాధారణ చొరవ**

కశ్మీర్ లోయలో భారత ప్రభుత్వం పట్ల వ్యతిరేక పవనాలు బలంగా వీస్తున్న మాట నిజం. కశ్మీరీలు ఆగ్రహావేశాలతో ఊగిపోతున్న మాట కూడా వాస్తవం. పరిస్థితిని అదుపులోకి తేవడానికి కేంద్ర ప్రభుత్వం ఏదైనా అసాధారణ చొరవ ప్రదర్శించవలసిన సందర్భం ఇది. అవసరమైతే వేర్పాటువాదులతోనైనా చర్చలు జరపాలనీ, వారిని శాంతింపజేయాలనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తున్నది. అఖిలపక్ష సమావేశంలో నరేంద్రమోదీ ఇటువంటి చర్చల గురించిన ప్రతిపాదన చేస్తారని రాజకీయ పరిశీలకులు భావించారు. కానీ వారి అంచనాలను తల్లకిందులు చేస్తూ వేర్పాటువాదులతో చర్చల ప్రసక్తి లేదనీ, దేశ భద్రత విషయంలో రాజీపడే సమస్య లేదనీ మోదీ స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా పాకిస్తాన్ ఆక్రమణలో ఉన్న కశ్మీర్ భూభాగాన్ని (పాక్ ఆక్యుపైడ్ కశ్మీర్ – పీవోకే) భారత దేశంలో విలీనం చేయడమే దేశం ఎదుట మిగిలి ఉన్న ఎజెండా అనీ, పీవోకే లోనూ, బలూచిస్తాన్‌లోనూ పాకిస్తాన్ సైన్యం సృష్టిస్తున్న హింసా కాండనూ, పౌరహక్కుల ఉల్లంఘనలనూ ప్రపంచం దృష్టికి తీసుకురావాలనీ ప్రధాని ఉద్ఘాటించారు.

'అఫెన్స్ ఈజ్ ద బెస్ట్ వే ఆఫ్ డిఫెన్స్' (ఎదురుదాడే ఆత్మరక్షణకు సరైన మార్గం) అన్న సూత్రాన్ని అమలుచేయాలని మోదీ సంకల్పించినట్టు ఆయన ధోరణి సూచిస్తున్నది. పాకిస్తాన్ పట్ల భారత్ విధానం దశాబ్దాలుగా మారలేదు. కశ్మీర్ అంశంపైన పాకిస్తాన్ మౌలిక విధానం సైతం అంతే. కశ్మీర్ లోయలో అస్థిరత సృష్టించడం, మిలిటెంట్లకు శిక్షణ ఇచ్చి లోయలోకి పంపించడం, హింసను ప్రేరేపించడం షరా మామూలే. అంతర్జాతీయ వేదికలపై యాగీ చేయడానికి వచ్చిన ప్రతి అవకాశాన్నీ పాకిస్తాన్ సమర్థంగా సద్వినియోగం చేసుకుంది. 1971లో తూర్పు పాకిస్తాన్‌లో తిరుగుబాటు జరిగి బంగ్లాదేశ్‌గా స్వతంత్ర దేశం ఆవిర్భవించిన ఫలితంగా పాకిస్తాన్ రెండు ముక్కలైనప్పటికీ కశ్మీర్ విషయంలో మాత్రం దౌత్యపరంగా

ఆధిక్యం ఇప్పటికీ పాకిస్తాన్‌దే. భారత దౌత్యవేత్తలూ, దేశాధినేతలూ ఆత్మరక్షణ కోసం దారులు వెదకవలసిందే కానీ పాకిస్తాన్‌కు దీటుగా సమాధానం చెప్పే పరిస్థితి లేదు. భారత భద్రతా బలగాల నీడలో కశ్మీరీలు జీవిస్తున్నారనీ, వారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవనీ, మానవ హక్కులు మంటగలిశాయనీ ప్రపంచ ప్రజలను నమ్మించడంలో పాకిస్తాన్ ప్రభుత్వాలు విజయం సాధించాయి. పాక్‌లో పరిపాలనను సైనిక వ్యవస్థ శాసిస్తున్నప్పటికీ, ఎన్నికైన ప్రధానులు సైన్యాధ్యక్షుడికి జీహుకుం అంటూ దీనంగా ఉన్నప్పటికీ, బలూచిస్తాన్‌లో, పీవోకేలో ఆజాదీ పేరు మీద అశాంతి నెలకొన్నప్పటికీ, పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ పెంచి పోషించిన ఉగ్రవాదం పాకిస్తాన్‌నే కాటేస్తూ మారణహోమం సృష్టిస్తున్నప్పటికీ కశ్మీర్ విషయంలో మాత్రం అంతర్జాతీయంగా ఇండియాను బద్‌నాం చేయడంలోనూ, ఇండియాకు తలవంపులు తేవడంలోనూ పాకిస్తాన్ విజయం సాధిస్తూనే ఉన్నది. ఈ పరిస్థితిని మార్చివేయాలనే నిర్ణయం నరేంద్రమోదీ తీసుకున్నట్టయితే భారత విదేశాంగ విధానంలో అత్యంత కీలకమైన, సకారాత్మకమైన మార్పు రావలసి ఉన్నది. సంజాయిషీ చెప్పుకునే దుస్థితి నుంచి పాకిస్తాన్‌ని అంతర్జాతీయ సమాజం ఎదుట దోషిగా నిలబెట్టే స్థితికి ఎదగాలి. అంతర్జాతీయ వ్యవహారాల ప్రవీణులు కొందరు ప్రతిపాదిస్తున్న విదేశీ విధానంలో దూకుడు సిద్ధాంతాన్ని ఎన్డీయే అమలుచేస్తే అమెరికాకు ఇండియా మరింత దగ్గరవుతుంది. బహుశా 'నాటో' (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) కూటమిలో సైతం చేరుతుంది.

### సరికొత్త వ్యూహం

ఈ సిద్ధాంతం ప్రకారం కశ్మీర్ సమస్యను హద్దు మీరకుండా చూసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటూనే పాకిస్తాన్‌ని ఇరకాటంలో పెట్టే వ్యూహం అమలుచేయాలి. ఆఫ్ఘానిస్తాన్‌లో తాలిబాన్ సర్కార్ ఉన్న సమయంలో విమానం హైజాక్ చేయడం, ఆఫ్ఘానిస్తాన్‌లోని కాంధహార్‌కు దారి మళ్లించటం, వాజపేయి ప్రభుత్వంలో విదేశాంగమంత్రిగా ఉన్న జస్వంత్‌సింగ్ కశ్మీర్ మిలిటెంట్ అగ్రనాయకులను వెంటబెట్టుకుని కాంధహార్ వెళ్లి అక్కడ వారిని హైజాకర్లకు అప్పగించి ప్రయాణీకులను రక్షించడం వంటి నాటకీయ పరిణామాలు సంభవించాయి. ఆఫ్ఘానిస్తాన్‌లో మళ్ళీ ఆధిపత్యం కోసం పాకిస్తాన్ ప్రోత్సాహంతో తాలిబాన్ విశ్వప్రయత్నం చేస్తున్నది. దాన్ని విఫలం చేయడానికి ఆఫ్ఘానిస్తాన్ ప్రభుత్వం, అమెరికా సైన్యం సర్వశక్తులనూ ఒడ్డుతున్నాయి. భారత్ మొదటి నుంచి ఆఫ్ఘానిస్తాన్‌కు దూరదూరంగానే ఉంటూ వచ్చింది. ఆఫ్ఘాన్ పార్లమెంటు భవనం నిర్మాణానికి చొరవ తీసుకోవడం, అక్కడ ప్రాథమిక సౌకర్యాల నిర్మాణానికి సహకారం అందించడం వంటి కార్యక్రమాలు ఇండియా తరపున ఇటీవలనే ప్రారంభమయ్యాయి. దూకుడు సిద్ధాంతం ప్రకారం ఆఫ్ఘానిస్తాన్‌కు ఇండియా మరింత సన్నిహితం కావాలి. ఆఫ్ఘానిస్తాన్ సైనికులను ఇండియా తీసుకొని వచ్చి శిక్షణ ఇవ్వాలి. విస్తారమైన శిక్షణ వసతులు ఇండియాలో వున్నాయి. ఆఫ్ఘాన్ సైన్యానికి తర్ఫీదు ఇచ్చి వారికి అవసరమైన ఆధునిక ఆయుధాలు సమకూర్చగలిగితే వారు తాలిబాన్‌ను నిరోధించగలరు. సరిహద్దులను రక్షించుకోగలరు. ఆఫ్ఘానిస్తాన్‌లో పాకిస్తాన్ ప్రాబల్యం మళ్లీ పెరగకుండా చేయడం ఇండియాకు చాలా అవసరం.

పీవోకేలో కశ్మీరీలు సంతోషంగా లేరు. అక్కడా ఆజాదీ కోసం ఉద్యమం జరుగుతోంది. ఇటీవల పాక్ ప్రభుత్వం 500మంది కశ్మీరీలను అరెస్టు చేసింది. పీవోకేలో పీడననూ, దౌర్జన్యాన్నీ భరించలేక వలస వెళ్ళిన కశ్మీరీలు అనేక దేశాలలో తలదాచుకున్నారు. వారి వివరాలు తెలుసుకుని వారిని సమీకరించాలి. పీవోకేలో అమానవీయ పరిస్థితులపైన వారి చేత ప్రపంచ దేశాలకు చెప్పించే ప్రయత్నం భారత విదేశాంగ మంత్రిత్వశాఖ చేయవలసి ఉంటుంది. జమ్మూ-కశ్మీర్ రాష్ట్రాన్ని ఇక మీదట నాలుగు భాగాలు- జమ్మూ, కశ్మీర్ లోయ, లద్ధాక్, పీవోకే-గా పరిగణించాలి. భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపైన వాదనలన్నీ ఈ ప్రాతిపదికపైనే జరగాలి.

### బలూచిస్తాన్‌పై ఉక్కుపాదం

బలూచిస్తాన్‌లో ఇప్పటికే భారత గూఢచారి సంస్థ 'రా' (రీసెర్చి అండ్ ఎనాలిసిస్ వింగ్) అసమ్మతి రాజేసిందని పాకిస్తాన్ అభియోగం. కశ్మీర్‌లో అల్లర్లు జరిగినప్పుడల్లా కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలను నిందించిన విధంగానే బలూచిస్తాన్‌లో అశాంతికి 'రా'ను ఆడిపోసుకోవడం పాకిస్తాన్‌కు అలవాటు. ఉదాహరణకు కొన్ని రోజుల కిందట క్వెట్టాలో ఉగ్రవాదుల దాడిలో 72మంది అమాయకులు దుర్మరణం పాలైనారు. ఈ దాడి తమ పనేనంటూ ఇస్లామిక్ స్టేట్, పాకిస్తాన్ తాలిబాన్ చీలిక వర్గమైన జమాత్-ఉల్-అహ్రార్ ప్రకటించాయి. అయినప్పటికీ, ఇది 'రా' జరిపించిన రాక్షస క్రీడేనంటూ బలూచిస్తాన్ ముఖ్యమంత్రి సనావుల్లా జెహ్రీ ఆరోపించారు. బలూచిస్తాన్ హక్కుల కార్యకర్త, మహిళా

నాయకురాలు నాయిలా ఖాద్రీ బలూచ్ ఇటీవల ఢిల్లీ సందర్శించినప్పుడు తన రాష్ట్రంలో ఏమి జరుగుతున్నదో వెల్లడించారు. పదిహేను సంవత్సరాలుగా బలూచిస్తాన్ ప్రజలు పాకిస్తాన్ ప్రభుత్వంతో యుద్ధం చేస్తున్నారని చెప్పారు. మానవ హక్కుల ఉల్లంఘనలకు లెక్కలేదనీ, ఇప్పటివరకూ 25వేల మంది పురుషులూ, మహిళలూ, చిన్నారులూ అదృశ్యమైనారనీ, బలూచిస్తాన్‌లో గుర్తుతెలియని వందలమందిని ఖననం చేసిన సామూహిక సమాధులు అనేకం ఉన్నాయనీ ఆమె ఆరోపించారు. పాకిస్తాన్ సైనికులు బలూచీలపైన విచక్షణారహితంగా కాల్పులు జరుపుతున్నారనీ, మహిళలపై అత్యాచారాలు చేస్తున్నారనీ ఆమె ఆగ్రహం వెలిబుచ్చారు. కశ్మీర్ విషయంలో ఇండియాపైన పాకిస్తాన్ చాలా సంవత్సరాలు ఎటువంటి ఆరోపణలు చేస్తున్నదో అంతకంటే తీవ్రమైన ఆరోపణలనే బలూచీ హక్కుల నాయకురాలు పాకిస్తాన్‌పైన చేశారు. మోదీ సర్కార్ బలూచిస్తాన్‌కు నైతికంగా అండదండలు సమకూర్చాలని నయీలా ఖాద్రీ బలూచ్ విజ్ఞప్తి చేశారు. దూకుడు సిద్ధాంతం ప్రకారం కశ్మీర్‌లో భారత వ్యతిరేక ధోరణులను పాకిస్తాన్ బలపరిచినట్టే బలూచిస్తాన్‌లో తిరుగుబాటు విజయానికి ఇండియా బాటలు వేయాలి. ఆ విధంగా పాకిస్తాన్‌ను కశ్మీర్ వైపు కన్నెత్తి చూసే తీరికలేకుండా, శక్తి లేకుండా బలూచీ ఊబిలోకి నెట్టాలి.

దూకుడు సిద్ధాంతం అమలుచేస్తే భారత్‌కు మేలు జరుగుతుందో, కీడు జరుగుతుందో చెప్పడం కష్టం. పాకిస్తాన్ ఉగ్రవాదం ఉచ్చులో పడి గిలగిలలాడుతూ, బలూచీ తిరుగుబాటుతో యాతనపడుతూ, పీవోకే ఆజాదీ ఉద్యమంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ సైన్యాన్ని రంగంలోకి దింపి అణచివేతకు ప్రయత్నిస్తే హక్కులను కాలరాసినందుకు అభిశంసన తప్పదు. అంతర్జాతీయంగా ఇప్పుడున్న కొద్దిపాటి పరువుప్రతిష్ఠలు సైతం మంటగలసిపోతాయి. దక్షిణాసియాలో తనకు అనుకూలమైన వాతావరణం సృష్టించుకునేందుకు పథకం అమలుచేస్తున్న చైనా పని కుదేలు అవుతుంది. ఇదే విధంగా జరిగితే దూకుడు సిద్ధాంతం సత్ఫలితాలు ఇచ్చినట్టే. మరోవిధంగా జరిగితే? పాకిస్తాన్‌తో మరో యుద్ధం రావచ్చు. పాకిస్తాన్‌కు చైనా అండగా నిలవచ్చు. భారత్‌కు తోడుగా అమెరికా చేరవచ్చు. అది పరస్పర హననోద్యోగానికి దారితీయవచ్చు. అణుయుద్ధం సంభవించి దక్షిణాసియా యావత్తూ శ్మశానం కావచ్చు. అందుకే దూకుడు సిద్ధాంతం అమలు చేయడం ప్రమాదపుటంచుల్లో భయానకమైన విన్యాసం. ఆచితూచి అడుగులేయకపోతే అధ:పతనమే. ఇంతటి సాహసం మోదీ చేస్తారా?

(సాక్షి సౌజన్యంతో)

### మార్గదర్శిగా నిలిచే గొప్ప నాయకుడు జాతీయస్థాయిలో లేకపోవటం దురదృష్టకరం

# రాష్ట్రాలపై కేంద్రం పెత్తనంపై సుప్రీంకోర్టు అసంతృప్తి

**1995** తర్వాత ఇప్పటి వరకూ రాష్ట్రాల మధ్య తలెత్తిన తగాదాలను పరిష్కరించిన దాఖలా చూడలేదని, రాష్ట్రాల మధ్య సమస్యల్ని పరిష్కరించి మార్గదర్శిగా నిలిచే గొప్ప నాయకుడు ప్రస్తుతం జాతీయస్థాయిలో లేకపోవటం దురదృష్టకరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రవేశపన్ను (ఎంట్రీ ట్యాక్స్) విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదంటూ అనేక ప్రముఖ పారిశ్రామిక సంస్థలు దాఖలు చేసిన కేసుపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ ఠాకూర్ నేతృత్వంలోని 9మంది సభ్యుల విస్తృత ధర్మాసనం విచారణ చేపట్టిన సందర్భంలో ఈ వ్యాఖ్యలు చేసింది. వెనకబడిన రాష్ట్రాలకు పన్ను రాయితీలు ఇవ్వక, ఆర్థిక సాయం చేయక, పన్నులు విధించే హక్కును కూడా హరిస్తారా అని ప్రశ్నించింది. రాష్ట్రాలు పన్ను వేసుకోవటానికి ఉద్దేశించిన బిల్లుకు రాష్ట్రపతి అనుమతి ఉండాలన్న కేంద్రం వాదన పట్ల కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. అనుమతి ఇవ్వకపోతే ఆర్టికల్ 307 కింద దాన్ని పరిష్కరించే కమిటీలు ఎప్పుడు వేస్తారు? వేయకపోతే దాని కోసం కోర్టుల కోర్టుల చుట్టూ తిరగాల్సిందేనా? ఇప్పుడు రాష్ట్రాల్లో కూడా ప్రజలతో ఎన్నికైన బాధ్యతాయుత ప్రభుత్వాలు ఉన్నాయి కదా? ప్రజలు వారికి అధికారం ఇచ్చినప్పుడు మళ్లీ అనుమతుల కోసం కేంద్రం ముందు చేయిచాచే పరిస్థితి కల్పిస్తే వారి హక్కుల్ని హరించటం కాదా? అని ధర్మాసనం ప్రశ్నించింది.

# చట్టప్రకారం ఎకరాకు రూ.18 లక్షలు ఇవ్వాలి..
# భూసేకరణలో మానవీయ కోణం- మల్లన్నసాగర్ నేపథ్యం

- బండారు రామ్మోహనరావు

తెలంగాణ నీళ్లు, నిధులు తెలంగాణకే వచ్చాక వాటిని ఏరకంగా వినియోగించాలో నిర్ణయించే అధికారం ప్రజల నుంచి ఎన్నికైన కేసీఆర్ ప్రభుత్వానికి ఉంటుంది. ప్రతిదానికీ అడ్డం కొట్టటం భావవ్యక్తీకరణ స్వేచ్ఛను దుర్వినియోగం చేసే అప్రజాస్వామిక సంస్కృతే అవుతుంది. అయితే తెలంగాణకు తరాలపాటు మేలుచేసే హేతుబద్ధ దార్శనికత లోపించిందన్న ఆధారాలున్నప్పుడు ప్రశ్నించకతప్పదు. ఇది భావాల, విధానాల సంఘర్షణగా పోరాటం చేసి పాలనను సరిచేసే ప్రయత్నం చేయాలి. రూ.లక్ష కోట్ల పైచిలుకు నిధులతో లక్ష ఎకరాల పైచిలుకు భూసేకరణతో ప్రాజెక్టుల్ని రీడిజైన్ చేసినప్పుడు అందరినీ కలుపుకుని పారదర్శకంగా చేసి వుంటే బాగుండేది. ఫిరాయింపుల తెలంగాణలో ఏ సాంప్రదాయ రాజకీయ పార్టీనీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదు కాబట్టి, అసెంబ్లీ బయట ఉన్న ఆలోచనాపరుల్ని, నిపుణుల్ని, పౌరసమాజాన్ని కలుపుకుని చర్చించి నిర్ణయాలు చేసి ఉండాల్సింది. సాగునీటి ప్రాజెక్టుల పాలసీ విషయాన్ని అలా వుంచితే, భూసేకరణ పరిహారం మరో పెద్ద ప్రజాసమస్యగా తయారైంది. మెదక్ జిల్లాలోని తొగుట, కొండపాక మండలాల్లోని ఆరు గ్రామాల పరిధిలో 12వేల ఎకరాల పైచిలుకు భూమిలో నిర్మించ తలపెట్టిన మల్లన్నసాగర్ తెలంగాణలోనే కాకుండా పొరుగు రాష్ట్రాల్లో కూడా వేడి చర్చకు కేంద్రబిందువైంది. మల్లన్నసాగర్‌కే పరిమితం కాకుండా ఇంకా వేల ఎకరాలను సేకరించే ప్రయత్నంలో తెలంగాణ సర్కారు ఉంది కాబట్టి ఈ సమస్యకు ఒక ఆమోదయోగ్య ప్రజాహిత పరిష్కారాన్ని ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా రూపొందించుకోవాలి. కాళ్ల కింద భూమి కదిలిపోతుంటే సర్కారు, రాజకీయ వ్యవస్థ, సమాజం సక్రమంగా స్పందించలేకపోతే అది తెలంగాణను మరో సంక్షోభంలోకి నెడుతుంది. మల్లన్నసాగర్ నేపథ్యంలో భూసేకరణ సమస్యల్ని చట్టబద్ధత, మానవీయత కోణంలో నిష్పాక్షికంగా పరిశీలించి పరిష్కారాన్ని సూచించే ప్రయత్నమిది.

మల్లన్నసాగర్ భూసేకరణను కేవలం ప్రభుత్వ కోణంలోనో లేక ప్రతిపక్షాలు, కొందరు వ్యక్తులు, ప్రజాసంఘాల దృష్టి కోణం నుంచి, వారివారి రాజకీయ ప్రయోజనాలు, వారు పాటిస్తున్న రాజకీయ, సామాజిక విలువలు, ఓటు బ్యాంకు రాజకీయాల నుంచి కాకుండా అక్కడ భూములు కోల్పోతున్న రైతులు,



తద్వారా ఆయా గ్రామాలలో వ్యవసాయ భూమి, ఉపాధి, వనరులు కోల్పోతున్న వారి దృష్టితో చూడటం అవసరం. ఆకాంక్షలతో చట్టాలు తయారుచేయటం వల్ల ఫలితాలు సాధించలేంగానీ, ప్రతి చట్టానికీ, ఆ మాటకొస్తే రాజ్యాంగానికి కూడా ప్రజల ఆకాంక్షలే స్ఫూర్తిగా ఉండాలి. అందుకే చట్టంతోపాటు మట్టికీ, మనిషికీ ఉండే మానవీయ దృక్కోణంతో చూసి ఈ సమస్యపై ఒక అవగాహనకు రావలసి ఉంటుంది.

ప్రాజెక్టులు, పరిశ్రమలు ఏదైనా అభివృద్ధి భూమి పైనే వస్తుంది తప్ప ఆకాశంలో రాదు. అభివృద్ధి పథకాలకు, ఉపాధి అవకాశాలకు భూమి ఒక సాధనం. ఒక వనరు. అందుకే ఏ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చినా భూసేకరణ అనేది ఒక సమస్యగానే ఉంటుంది. భూమి, భూమి యాజమానికి రాజ్యం, రాజ్యవ్యవస్థ ఇచ్చే నిర్వచనం-అది రాచరిక వ్యవస్థనేకాదు ఆదిమ కాలపు సమాజం నుంచి ఒక అధికార వ్యవస్థ సృష్టించుకున్నాక నేటి ప్రజాస్వామ్య వ్యవస్థ వరకు- ఒకటిగానే ఉంది.

భూమి ఏనాటికైనా రాజ్యానిదే (స్టేట్). దీన్ని ప్రజోపయోగం కోసం ఎప్పుడైనా ఆనాటి 'రాజ్యం' ప్రభుత్వం తీసుకోవచ్చు, సేకరించవచ్చు. కానీ మిలియన్ డాలర్ల ప్రశ్న ఏమిటంటే, ఏది ప్రజోపయోగం అనేదే! ఆనాటి బ్రిటీషు కాలపు భూ సేకరణ చట్టం నుంచి నేటి 2013లో ఆధునిక భూసేకరణ చట్టం వరకు ఈ ప్రశ్నకు సరైన నిర్వచనం ఇవ్వనే లేదు. ఒక రైల్వే లైను, ఒక పంటకాలువ, ఒక టెలిఫోన్ లైను, విద్యుత్తు లైను, ఒక చెరువు నిర్మాణం, రోడ్డు నిర్మాణం, ఒక ప్రాజెక్టు ఇలా విస్తృతమైన ప్రజలకు మౌలికవసతులు కట్టించటానికి భూమి

సేకరణ విషయంలో ఒక స్పష్టత వున్నా, వ్యక్తులు, కంపెనీలు, స్వార్థ లాభాపేక్షతో ముడిపడివున్న పరిశ్రమలకు, సెజ్‌లకు ప్రభుత్వమే మధ్య దళారీగా వ్యవహరించి భూసేకరణ చట్టం కింద భూమిని బలవంతంగా రైతుల నుంచి సేకరించి, దానికి రైతులకు అరా కొరా పరిహారం ఇచ్చి రైతులకిచ్చిన పరిహారానికి రెండింతలు, మూడింతలు ఎక్కువ రేటుకి పరిశ్రమలకు, సెజ్‌లకు, వ్యక్తులకు ప్రభుత్వమే మధ్య దళారీ పాత్ర వహించి అమ్మడం అవసరమా అనే ప్రశ్న ఇక్కడ ఉదయిస్తుంది. ప్రభుత్వం, ప్రభుత్వాలు ప్రజాసంక్షేమం కోసమే ఉన్నాయి కానీ ప్రజల భూముల మీద రియల్ ఎస్టేట్ వ్యాపారం చెయ్యడానికి కాదు కదా! 2013 కొత్త భూసేకరణ చట్టం పాత చట్టం కంటే మానవీయ కోణంలో ఉందనేది నిర్వివాదాంశం. గతంలో చట్టంలో లేని.. గ్రామస్తులు 60,70శాతం మూకుమ్మడిగా అంగీకరించాలని, సామాజికంగా ఉపాధి వనరుల విషయంలో రైతు కూలీలు, కార్మికులపై భూమి సేకరణ వల్ల జరిగే ప్రభావం అంచనా వెయ్యాలనేది మంచి మార్పు. కానీ ప్రజోపయోగం అనే మాటకున్న విస్తృతార్థాన్ని వివరించలేకపోవటం ఒక పెద్ద లోటు.

ఇక భూమి సేకరణ విషయానికొస్తే, రైతులు ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం తలపెట్టిన చర్యలకు సహకరించి తమ భూమి, ఇళ్లు, తదితర ఆస్తులను వదులుకోవడానికి సిద్ధపడాలి. అంటే రైతులు భూములు ఏడుస్తూ ఇవ్వకూడదు. రైతు తన భూమిని కోల్పోతే.. ఆ భూమిలో జరిగే అభివృద్ధిలో తనకు వాటా లభించాలి, ఆ ప్రభావం వల్ల తన జీవన పరిస్థితులు బాగు పడాలి. ఒక ఉద్యోగమో, ఆర్థిక లబ్ధో మామూలుగా కాకుండా ప్రత్యేకంగా జరగాలి. భూమి కూడా ఆ అభివృద్ధిలో ఒక ప్రధాన వనరే కాకుండా ప్రధాన పెట్టుబడిగా భావించాలని లోక్‌సత్తా కోరుతోంది.

అప్పుడే రైతు తన సర్వస్వాన్ని ధారపోయడానికి సిద్ధపడతాడు. కానీ తన భూమి కోల్పోయి ఇతరులు లాభపడతారని, తాను మాత్రం ఆ భూమిలో అభివృద్ధి జరిగాక కనీసం కాపలాదారుగా (వాచ్‌మన్)గా కూడా పనికిరానని, పొట్ట చేత పట్టుకుని తట్టాబుట్టా సర్దుకుని ఎక్కడికని వెళ తున్నావు.. అనే విషాదగీతం నేపథ్యంలో వెళ్లిపోయే పరిస్థితి రాకూడదు. తన భూమి కోల్పోయినా ఆత్మగౌరవంతో పిల్లాపాపలతో అంతకంటే మెరుగైన జీవితం గడపగలుగుతా అనే 'ధీమా'ను ఆ భూములు కోల్పోయే రైతులకు కల్పించాల్సిన బాధ్యత పార్టీలేవైనా ఆయా ప్రభుత్వాలదే. ఇది పరిష్కారం లేని సమస్య కాదు. ప్రభుత్వాలు, పౌరసమాజం ప్రజల పట్ల ప్రేమతో, దార్శనికతతో ఆలోచించటం ఇందుకు అవసరం.

### గత అనుభవాలు- భయాలూ, ఆందోళనలూ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 70 ఏళ్లుగా భూమి సేకరణ అనేది ఒక అమానవీయ చర్యగా మార్చేశారు. మొదట ఒక రకంగా బలవంతంగా భూమి గుంజుకుని అరకొర పరిహారం ఇచ్చేవారు. చాలాసార్లు పరిహారం కూడా వచ్చేది కాదు. అందుకే గతంలో రోడ్లు రైల్వేలైన్లు ఇతర అభివృద్ధి అంతా గ్రామాలకు దూరంగా పేదలు, దళితుల భూముల్లో నుంచే పోయి గ్రామాలలో ఉన్న బడా పెత్తందార్లు, ఫ్యూడల్ శక్తులే లాభపడిన సందర్భాలు అధికం. ఆ తర్వాత ప్రజల్లో చైతన్యం వచ్చి ఆ భూమి పరిహారం తక్కువ వుందనో, ఇతరత్రా కారణాలు చూపి మార్కెట్ విలువను అంచనా వేయలేదని చెప్పో కోర్టులకెళితే ఆ కోర్టుల్లో కేసు తేలి నష్టపరిహారాన్ని పెంచితే కోర్టుల్లో జాప్యం. మధ్య దళారీలు, న్యాయవాదులు, ఇలా పరిహారం అసలు రైతుకు చేరేసరికి 'ద్రవ్యోల్బణాన్ని' పరిగణలోకి తీసుకుంటే రైతు చేతికి అందేసరికి అది అరకొర పరిహారంగా ఉండేది. ఇందులో లాభపడ్డది, మధ్య దళారులు మాత్రమే. ఇక ఆమధ్య సెజ్‌లకు భూములు సేకరించినప్పుడు ప్రభుత్వమే మధ్య దళారీగా వ్యవహరించి భూమిని సేకరించి మంచి పరిహారమని ఇస్తే, భూములు కోల్పోయిన రైతులు పక్కవూళ్లోనే కాదు దూరాభారం పోయి భూమి కొనుక్కుందామనుకున్నా ప్రభుత్వం ఇచ్చిన పరిహారానికి మూడింతలు నాలుగింతలు ధరలు పెరిగి భూములు కోల్పోయిన రైతులు ప్రత్యామ్నాయంగా భూములు కొనుక్కోలేకపోయారు. సత్యవీడు (చిత్తూరు జిల్లా) సెజ్ నుంచి మహబూబ్‌నగర్ పోలేపల్లి సెజ్ దాకా ఇదే జరిగింది. రైతుల నుంచి సేకరించిన భూమితో మాత్రమ ప్రభుత్వాలు వ్యాపారం చేశాయి.

భూమి సేకరణ అంటే పరిహారం ఎప్పుడో ఏళ్ల తర్వాత అందడం, అదీ రెవిన్యూ అధికారుల దయాదాక్షిణ్యాల మీద, అవినీతి మూలాల మీద అందడం, ఈలోపు నిలుచున్న నేల కుంగిపోయినట్టు భూమి కోల్పోయి, రైతులు నిరాశ్రయులు కావడం ఇదీ ఎక్కడ భూమి సేకరణ జరిగినా చాలామేర చోటుచేసుకుంటున్న దృశ్యం. దీనికి ప్రత్యామ్నాయ విధానాలు ఆలోచించి అవలంబించినప్పుడే మనం భూమి సేకరణ చేసి అభివృద్ధిని చేసుకోగలుగుతాము.

### పరిష్కారాలు

దానికి మార్గాలున్నాయి. మొదటిది, 2013 చట్టమా, 123 లేక ఆయా ప్రభుత్వాలు జారీ చేసే జీవోలా అనేది సాంకేతికమైన అంశం. రైతుకు మెరుగైన పరిహారం, సకాలంలో సరైన విధంగా అందటం- ఇది జరిగిందా లేదా అనేదే అసలు ప్రశ్న.

123జీవో మెరుగైందని, ఇందులో 2013 చట్టం కంటే ఎక్కువ పరిహారం వస్తుందని ప్రభుత్వం చెబుతోంది. కానీ 2013 చట్టంలో భూమి మార్కెట్ విలువకు మూడింతల పరిహారం

ఇవ్వాలని ఉంది. రిజిస్ట్రేషన్ అంచనాల్లో వున్న అరవై వేల రూపాయలకు నేడు మూడింతలు అంటే లక్షాఅరవై వేలు వస్తాయని, 123 జీవోలో ఆరు లక్షల రూపాయలు ఎకరానికి అంతకంటే మెరుగైన పరిహారం అని ప్రభుత్వం చెబుతున్నది. కానీ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రెండేళ్ల క్రితమే ఏర్పాటు చేసి, మార్కెట్ విలువను అంచనా వేసి ఆ పుస్తకాలలో ఉన్న మార్కెట్ విలువ ఎకరానికి అరవై వేలే ఉంటే అది ఇప్పుడు ఆరు లక్షలు అయిందన్న సంగతి మర్చిపోతే ఎలా? ప్రభుత్వమే ఇటీవల వేరే సందర్భంలో ఎకరా రూ. 5-6లక్షలకు కొనుగోలు చేసింది. నేటి మార్కెట్ విలువ ఆరు లక్షలు రూపాయలని ప్రభుత్వమే తేల్చి దాన్ని రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఉండే భూమి విలువ రిజిస్టర్‌లో చేర్చి ఆ తర్వాత దానికి మూడింతలు పరిహారం ఇస్తే రైతులు మల్లన్నసాగర్‌కి తమ భూముల్ని సంతోషంగా ఇస్తారు కదా! 2013 చట్టంలో కూడా స్పష్టంగా ఈ విషయాన్ని నొక్కి చెప్పారు. భూ సేకరణనోటిఫికేషన్‌కు ముందే ఆయా గ్రామాల్లో సర్వే చేసి వాస్తవ మార్కెట్ విలువను అంచనావేసి రిజిస్ట్రేషన్ విలువల పుస్తకంలో మార్పులు చేసి కొత్త మార్కెట్ విలువను రికార్డులలో ఎక్కించి ఆ తర్వాతే భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వాలి. ఇది మల్లన్నసాగర్ విషయంలో జరగలేదు కనుకనే 60×3 రెట్లు అనే సమస్య వచ్చి 123 జీవో మెరుగ్గా ఉందనిపిస్తుంది. అదే గనక జరిగితే ఆరు లక్షలూ × 3 మూడు రెట్లు= 18లక్షలు అయ్యేది. అప్పుడు ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్‌రూం ఇల్లూ అది అదనపు ఆకర్షణ అయ్యి ఎలాంటి ఆందోళనలు, వ్యతిరేకత లేకుండా రైతులే స్వచ్ఛందంగా భూములు ఇస్తారు.

ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు కూడా ఒక విషయం గమనించాలి. రాజకీయ పార్టీలైతే తమ గత చరిత్రలో ఏం చేశాము, భూసేకరణ ఎలా చేసామో ఆలోచించి మల్లన్నసాగర్‌పై తమ వైఖరిని వెల్లడించాలి. అలాగే, ప్రజాసంఘాలు కూడా తమ సిద్ధాంతరాద్ధాంతాలకు పోకుండా అంతిమంగా అభివృద్ధిని కాంక్షించేవారుగా సమస్యను ఏకరువు పెట్టటం కాకుండా పరిష్కారానికి పూనుకోవాలి. రైతులకు ప్రభుత్వ వ్యవస్థకు అనుసంధానం చేసి ఒక సంధానకర్తగా, మధ్యవర్తిగా వ్యవహరించాలి తప్ప వ్యక్తిగత అహాలు ప్రాధాన్యతలతో వ్యవహరించకూడదు.

ఒకసారేమో ప్రాజెక్టు అవసరమా అని, మరోసారి ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదుకానీ రైతుల ప్రయోజనాలు, పరిహారం అని ఇలా మాట మార్చడం సరికాదు. ప్రతిపక్షాలదీ, ప్రజాసంఘాలదీ అంతిమంగా ప్రజల విస్తృతమైన ప్రయోజనాల రీత్యా స్పందన ఉండాలి. ఇవాళ ఈ ప్రభుత్వం వుంటుంది, రేపు ప్రజలు తలచుకుంటే మరో పార్టీ ప్రభుత్వం ఏర్పడుతుంది. కానీ అంతిమంగా పాలకులు ఎవరు మారినా పాలితవర్గం ఒకటుంటుంది. వారి ప్రయోజనాలే అంతిమం అనే విషయం ఆలోచించాలి.

మల్లన్నసాగర్‌ను ఎలాంటి పరిస్థితుల్లో కట్టనీయం అని ఒక పార్టీ అంటే, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రాజెక్టు కట్టి తీరతాం అని ప్రభుత్వం శపథం చేయటం ఆవుల పోరాటంలో ప్రజల్ని లేగదూడల్ని చెయ్యటమే. భీషణ ప్రతిజ్ఞలద్దు. భూములు కోల్పోయే రైతుల ప్రయోజనాలు, అంతిమంగా నీళ్లు, నిధులు, నియామకాల ట్యాగ్‌లైన్‌తో వచ్చిన తెలంగాణలోని బీడు భూముల సాగుకు అవసరమైన అన్ని పద్ధతులూ ఆలోచించి ప్రాజెక్టులు నిర్మించాలి. కరవుకాలంలో కూడా వందల టీఎంసీల నీరు గోదావరి నుంచి సముద్రంలో కలిసే దుర్గతి పట్టకుండా వీలైనంత త్వరగా ప్రాజెక్టులు నిర్మించే విధంగా అందరూ ఒక ఆరోగ్యకరమైన చర్చను చేయాలి. భారీ ఎత్తిపోతల వల్ల లాభనష్టాలను బేరీజువేసి అసంబద్ధత లేకుండా ప్రాజెక్టుల్ని చేపట్టటమెలాగో ఆలోచన చేయాలి. వేడి పుట్టకుండా వెలుగు రావాలి. ఆవేశకావేశాలు లేని చర్చ ఒక మంచి పరిష్కారానికి దారి తీస్తుంది. దీనికి ప్రభుత్వమే ఒక అడుగు ముందుకు వేసి ప్రతిపక్షాలను, ప్రజాసంఘాలను చర్చకు ఆహ్వానించాలి. ప్రభుత్వం భేషజాలకు పోకుండా ఈ పనిచేయాలి.

**ప్రభుత్వ అఖిల పక్షంలో ఈ అంశాలు ఉంటే సముచితమని లోక్‌సత్తా ప్రతిపాదిస్తోంది:**

1) ప్రాజెక్టుల రీడిజైనింగ్‌పై ఒక ఆరోగ్యకరమైన చర్చ..
ఎ) సాంకేతిక నిపుణులు, అధికారులతో బి) రాజకీయ పక్షాలు సి) ప్రజాసంఘాలతో

2) భూమి కోల్పోయే రైతులకు సరైన పరిహారం ఎలా ఉండాలి 2013 భూ సేకరణ చట్టమా న్యాయవ్యవస్థ జోక్యంతో సవరించిన 123 జీవోనా.. ఈ రెంటిలో ఏది మెరుగు

3) మానవీయ కోణంలో భూములు కోల్పోతున్న రైతులేకాకుండా రైతు కూలీలు, చిల్లర వ్యాపారస్తులు, భూమి లేని నిరుపేదలు వీరికి ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, పరిహారం

4) అభివృద్ధి ప్రాజెక్టుల భూమి సేకరణలో అవసరమైన దానికంటే 100శాతం ఎక్కువ సేకరించి భూములు కోల్పోయే రైతులకు ప్రాజెక్టులకు సరిపోను భూమిని మినహాయించి మిగతా భూమిలో అందరికీ వాటాల ప్రకారం పంచడం

5) పరిహారం భూమి, ఉపాధి, ప్రత్యామ్నాయ జీవన విధానానికి అవసరమైన ఇతర ఏర్పాట్లు

ఈ అంశాలన్నీ ఆలోచించి ప్రభుత్వమే ఈ సమస్య పరిష్కారానికి పూనుకోవాలి.

# పోలవరం కల నెరవేరేనా?

-కూసంపూడి శ్రీనివాస్,
లోక్‌సత్తా పార్టీ ఏపీ అధికార ప్రతినిధి



పోలవరం ప్రాజెక్టు అంటే తెలంగాణకు వ్యతిరేకం అని భావించే సమయంలో కూడా పోలవరం ఆంధ్రప్రదేశ్‌కే కాదు తెలంగాణకు కూడా ముఖ్యమైన అంతర్రాష్ట్ర బహుళార్థ సాధక ప్రాజెక్టు అని లోక్‌సత్తా చెబుతూ వచ్చింది. రాష్ట్రం విడిపోతే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా రావాలని ప్రతిపాదించిన లోక్‌సత్తా, పోలవరం కూడా జాతీయ ప్రాజెక్టుగా పూర్తికావాలని స్పష్టంచేసింది. రాష్ట్ర విభజన జరిగినా చట్టంలోని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుకాక పోతుండటంతో 'తెలుగు భవిత' పేరుతో 2015లో ఉత్త రాంధ్ర, రాయ పోలవరం కల నెరవేరేనాల సీమ, కోస్తా, హైదరాబాద్ లో దీక్షల్ని , మానవ హారాల్ని నిర్వ హించింది. ఈ కార్యక్రమంలో ఏపీకి ప్రత్యేక హోదా పన్ను రాయితీలు, నాలుగేళ్లలో పోలవరం పూర్తి, వేగంగా జాతీయ సంస్థల ఏర్పాటు, రాష్ట్రానికి రెవిన్యూలోటు భర్తీ తదితర నాలుగు డిమాండ్లు ప్రధానంగా ఉన్నాయి. అప్పటికింకా ప్రణాళికా సంఘం ఉనికిలోనే ఉంది. ఆరోజు అధికార తెలుగుదేశం సహా ప్రధాన పార్టీలు సహకరించివుంటే చాలామేర విభజన చట్టంలోని అంశాలు అమలయ్యేందుకు మార్గం సుగమమయ్యేది. చొరవ తీసుకోండయ్యా, ఏపీకి ప్రత్యేక హోదాని, విభజన చట్టంలోని అనేక అంశాలను ప్రతిపాదించిన పార్టీగా లోక్‌సత్తా తన వంతు సహకారం అందిస్తుంది అని విజ్ఞప్తి చేసినా పాలకులు స్పందించలేదు. ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసి హామీలపై అప్పుడప్పుడూ హడావుడి చేయటం ఆ పార్టీలకు పరిపాటిగా మారింది. రాష్ట్ర విభజనలో జాతీయ హోదా పొందిన పోలవరం ప్రాజెక్ట్ నిర్ణీత గడువులోగా పూర్తయ్యే అవకాశం కనిపించటం లేదు. కేంద్ర, రాష్ట్ర రాజకీయాల మధ్య ఇది నత్తనడకతో కొనసాగుతోంది. ఈ ప్రాజెక్టు 2018నాటికి పూర్తి చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం చెబుతున్నా వాస్తవ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. నిజానికి ఈ ప్రాజెక్టు పూర్తి కావాలంటే నిధుల సమస్య లేకుండా పనులు జరిగితేనే ఎనిమిదేళ్లు పడుతుందని నీటిపారుదల నిపుణులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ నత్త నడకన పనులు జరిపిస్తున్న ప్రభుత్వం మరో రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పటం నిజంగా హాస్యాస్పదం.

2005లో ప్రాజెక్టు పనులు మొదలుపెట్టినా ఇప్పటివరకూ కొలిక్కిరాలేదు. జాతీయ హోదా పొందిన ఈ ప్రాజెక్టుకు నూరుశాతం నిధులు సమకూర్చే బాధ్యత మాదే అని హామీ ఇచ్చిన కేంద్రప్రభుత్వం.. ఇప్పటివరకు విడుదల చేసిన నిధుల వినియోగానికి సంబంధించి లెక్కలు చెప్పకుండా రాష్ట్రప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేయటం లేదని తమపై నిందలు మోపుతోందని ఆరోపిస్తోంది. పోలవరం నిర్మాణ పనులకు సంబంధించి ఇప్పటికీ సమగ్ర ప్రణాళిక రూపొందించకపోవటం చూస్తుంటే ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తెలుస్తుందని జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ హుకుం సింగ్ ఇటీవలి భేటీలో రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టారు.

పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత కాంట్రాక్ట్ సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ నిర్లక్ష్యమే అది ముందుకు సాగకపోవడానికి అసలైన కారణంగా ఉంది. ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ పనులు చేయకపోయినప్పటికీ ఆ సంస్థనే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం వెనక ఆ సంస్థ అధికార పార్టీకి చెందిన ఎంపీది కావటం కారణంగా ఉంది. ప్రస్తుత కాంట్రాక్టర్ ఏజెన్సీ పనులు చేయడం లేదని, వెంటనే తప్పించాలని స్వయంగా పోలవరం అథారిటీ లేఖ

రాసినా.. దాన్ని తోసిరాజని ట్రాన్స్‌ట్రాయ్‌ని తప్పించకుండా సబ్ కాంట్రాక్ట్‌ని తెచ్చుకునే వెసులుబాటును ఆ సంస్థకే కల్పించింది. మరోవైపు ఆ కాంట్రాక్టర్ పనుల విలువ వ్యయాన్ని రూ.4,054 కోట్ల నుంచి రూ.6,961.70 కోట్లకు, ప్రాజెక్టు మొత్తం వ్యయాన్ని రూ.16,010.45 కోట్ల నుంచి రూ.31వేల కోట్లకు అమాంతం పెంచేశారు.

పోలవరం ప్రాజెక్టు టెండర్ దక్కించుకున్న ట్రాన్స్‌ట్రాయ్ 60 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉండగా, ఇప్పటికే 40 నెలలు గడిచిపోయినా నిర్దేశిత పనుల్లో 10శాతమే పూర్తయ్యాయి. గడువు ఇంకా రెండేళ్లే మిగిలివుంది. ప్రస్తుతం నెలకు ఒక్కశాతం పనులు మాత్రమే జరుగుతున్నాయి. ఇంకా స్పిల్ వే, స్పిల్ చానెల్, అప్రోచ్ చానెల్, పవర్ హౌస్ నిర్మాణం జరగాల్సుంది. ఇది జరగాలంటే ఆగస్టు నెలఖరుకి మట్టి తవ్వకాలు పూర్తి కావాలి. అప్పుడే స్పిల్ వే దగ్గర కాంక్రీట్ పనులు మొదలవుతాయి. అలా జరగాలంటే రోజుకి 2లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి తరలించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం రోజుకు 1లక్షా 10వేల క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే తరలిస్తున్నారు. స్పిల్ వే దగ్గరే ఇప్పటికి 42 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాల పని మిగిలివుంది.

ఒకపక్క వర్షాకాలం ప్రారంభమైంది. ఈ కాలంలో మట్టి తవ్వకాలకు ఇబ్బందులు ఏర్పడతాయి. అలాంటప్పుడు మట్టి తవ్వకం పనులే సగంపైగా మిగిలివున్నాయంటే ప్రాజెక్టు ఇంకెంత ఆలస్యమవుతుందన్నది కళ్లెదుటే కనబడుతుంది. వీటికి కాంక్రీట్ పనులు అదనం. ఇప్పట్లాగే పనులు సాగితే కేవలం కాంక్రీట్ పనులు పూర్తవడానికి ఐదేళ్లు పైగా పడుతుందని నిపుణులు చెబుతుండటం గమనార్హం.

పోలవరం కుడి కాల్వ నిర్మాణంపై చాలా వివాదాలు గత పదిహేనేళ్లుగా కోర్టులో ఉన్నాయి. పట్టిసీమ ప్రాజెక్టు నిర్మించి ఏం చేస్తారనే ప్రశ్నకు సమాధానం కరువవుతుంది. కాల్వలు, కాంట్రాక్టులు, నాసిరకం నిర్మాణాలు, ప్రకాశం బ్యారేజీ వద్ద నీటినిల్వకు అవకాశం లేకపోవటం వంటి ప్రతిపక్షం లేవనెత్తుతున్న అంశాలకు మించి క్లిష్టమైన అంశాలు ఇందులో ఇమిడివున్నాయి. 2018నాటికల్లా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని పదేపదే చెబుతున్న బాబుగారు ఇప్పుడు హడావుడిగా పట్టిసీమ ఎందుకు కట్టవలసి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పవలసి ఉంది. ఎందుకంటే నిజంగానే మరో నాలుగేళ్లలో పోలవరం పూర్తిచేస్తే పట్టిసీమ అవసరం ఉండనే ఉండదు. అటువంటప్పుడు పట్టిసీమకై ఖర్చుపెట్టిన ఇంచుమించు రూ.1300కోట్లు గోదాట్లో పోసినట్టే. ఈ పట్టిసీమపై పెట్టిన శ్రద్ధ, ఖర్చునే పోలవరంపై పెట్టి ఉంటే పనులు కొంతమేరకైనా ముందుకు సాగేవి. అలా చేయకపోవడం వెనుక బాబుగారి సొంత ప్రయోజనాలున్నాయని చెప్పకనే చెబుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అవినీతి, అలసత్వం, సొంత రాజకీయ ప్రయోజనాలు పోలవరానికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ఇన్ని అవరోధాల మధ్య ఏడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పోలవరం ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో అని ఏపీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలి. రాష్ట్ర ప్రయోజనాలను స్వప్రయోజనాలకు బలి చేయకుండా పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీని వెంటనే తొలగించి అనుభవం ఉన్న వేరే కాంట్రాక్టర్‌కి ప్రాజెక్టు పనుల్ని అప్పగించాలి. అలా చేయకుండా ఎన్నికల హామీని విస్మరించి రాష్ట్ర భవిష్యత్తుతో రాజకీయం చేసే పక్షంలో ప్రజల ఆవేశం ఆందోళనగా మారే అవకాశం లేకపోలేదు.

## 'నీరు-చెట్టు'లో అడ్డంగా దోపిడీ

ప్రభుత్వ పథకాలు కొంతమంది కాంట్రాక్టర్లకు, అధికారులకు, నాయకులకు పప్పుబెల్లాల్లా మారాయని లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. నీరు-చెట్టు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం రాజకీయ అవసరాల కోసమే ఇరిగేషన్ శాఖకు అప్పగించి దోపిడీకి గేట్లెత్తారన్నారు. విజయనగరం జిల్లాలో ఆ కార్యక్రమం కింద అడ్డంగా దోచుకుంటున్నారనేది బహిరంగ రహస్యమన్నారు. వీటిపై పత్రికల్లో కథనాలు వస్తుంటే ఏం చేస్తున్నారంటూ జిల్లా సంయుక్త కలెక్టర్ నాగేశ్వరరావుని కలిసి బాబ్జీ ప్రశ్నించారు. నీరు-చెట్టు కార్యక్రమానికి ఎన్ని కోట్లు విడుదల చేశారు, ఎక్కడెక్కడ పని పూర్తి చేశారు ప్రజలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# అవినీతి మధ్య అప్పు మీద అప్పు.. ముప్పు తెచ్చే తప్పు

**- పిల్లా సాయికుమార్**

తెలుగు రాష్ట్రాలు ఇప్పుడు అధిక నిధుల కోసం తంటాలు పడుతున్నాయి. రెవిన్యూ రాబడులు సరిపోని పరిస్థితుల్లో ఒక స్థాయి వరకు అప్పులు తెచ్చుకోవటం సమంజసమే అయినా, అవే దిక్కు కారాదు. వాటితో చేపట్టే పనులు సత్ఫలితాలు ఇవ్వనప్పుడు అప్పులు అనర్థదాయకమే అవుతాయి. అవి గుదిబండలుగా మారి రాష్ట్రాలు మరిన్ని అప్పులపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి 2016 నాటికి గల అప్పుల మొత్తం రూ. 2,62,850కోట్లు అని రిజర్వుబ్యాంకు (ఆర్‌బీఐ) తాజాగా వెల్లడించింది. శర వేగంగా పెరుగుతున్న అప్పులకు కళ్లెం వేయవలసిన అవసరాన్ని ఈ పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. పాలనపరమైన ఖర్చులను బాగా కుదించుకొని సొంత రెవిన్యూ రాబడులను పెంచుకోవడానికి ఉభయ రాష్ట్రాలు నడుం కట్టాలి.

పాతికేళ్లలో ఏ రాష్ట్రం ఏ మేరకు అప్పులు చేసిందీ సంవత్సరాలవారీగా ఆర్‌బీఐ వివరించింది. ఆంధ్రప్రదేశ్‌ను 2014 జూన్‌లో విభజించినప్పటికీ, 2016 మార్చి నాటికి గల అప్పులను రెండు రాష్ట్రాలకు కలిపి ఆర్‌బీఐ వెల్లడించింది. రెండు రాష్ట్రాలు తమ బడ్జెట్ నివేదికల్లో పొందు పరచిన దానికన్నా ఆర్‌బీఐ పేర్కొన్న అప్పు కొంత తక్కువగా ఉంది. పాతికేళ్ల క్రితం, 1991లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పు కేవలం రూ. 8100కోట్లు మాత్రమే. అది క్రమేణా పెరుగుతూ 2016 మార్చి నాటికి రెండు రాష్ట్రాలకు కలిపి ఏకంగా రూ. 2,62,800 కోట్లకు చేరింది. అంటే పాతికేళ్లలో అప్పులు 3,144శాతం పెరిగాయి. ఆ పెరుగుదల వేగం 2009 నుంచి మరీ ఎక్కువగా ఉంది. ఆ ఏడాది అప్పులు రూ.లక్ష కోట్లను దాటిపోయాయి. ఎక్కువగా అప్పులు తెచ్చుకోవటం కోసం జీఎస్‌డీపీని ఎక్కువ చేసి చూపించారంటూ కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సిన కొన్ని ప్రోత్సాహకాలను సైతం నిలిపివేసిన వైనం ఆ ఏడాదే చోటుచేసుకుంది. 2005 నుంచి దశాబ్దకాలంలో అప్పులు రూ. 1,97,000కోట్ల మేర పెరిగాయి. 2016, మార్చి నాటికి గల అప్పులను ఉభయ రాష్ట్రాలు తమ బడ్జెట్‌లలో పొందుపర్చాయి. వాటి ప్రకారం తెలంగాణ రూ. 1,00,707 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ. 1,70,822కోట్లు అప్పు పడ్డాయి. రెండూ కలిపితే రూ. 2,70,822కోట్లు అయ్యాయి. ఆర్‌బీఐ పేర్కొన్న దానికన్నా ఇది దాదాపు రూ. 8000కోట్లు ఎక్కువ. ఆడిట్ పరిశీలన పూర్తయ్యాక వాస్తవ గణాంకాలు వెల్లడవుతాయి.




### దారి మరింత సుగమం

తెలుగు రాష్ట్రాలు సహా వివిధ రాష్ట్రాల ఒత్తిడి కారణంగా కేంద్రం ఇప్పుడు ద్రవ్యబాధ్యత–బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టంలో మార్పులు తేదలచింది. అంతర్జాతీయంగా ఏర్పడిన ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల్ని అధిగమించేందుకూ ఈ చట్టంలో సవరణలు అవసరమని భావించిన కేంద్రం, వీటిపై సిఫార్సుల కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీ ఎన్‌కే సింగ్ నేతృత్వంలోని ఈ కమిటీలో కొందరు ఆర్థిక నిపుణులు ఉన్నారు. ఈ కమిటీకి నిర్దేశించిన విధివిధానాలను బట్టి చూస్తే– ఏటా అప్పుల కోసం రాష్ట్రాలు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. జీడీపీ, జీఎస్‌డీపీల్లోని నిర్ణీత శాతాల్లో కాకుండా వేరే విధానాల ద్వారా రుణపరిమితులు విధించనున్నారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం ద్వారా ఇంతవరకు సాధించిన ఫలితాలను కమిటీ పరిశీలించి, తన నివేదికను అక్టోబర్‌లో కేంద్రానికి అందచేస్తుంది. కేంద్ర చట్టంలో మార్పులకనుగుణంగా రాష్ట్రాలు తమ ఎఫ్ఆర్‌బీఎం చట్టాలను సవరించుకుంటాయి. రాష్ట్రాలు తమ జీఎస్‌డీపీలో మూడు శాతం మాత్రమే నికర అప్పులు తెచ్చుకోవాలనే నిబంధనలు ప్రస్తుతం అమల్లో ఉన్నాయి. ఇలాంటి నిబంధనల్లో మార్పులు అవసరమని ఉమ్మడి రాష్ట్రం కేంద్రాన్ని తరచూ అడుగుతుండేది. ఇప్పుడు ఉభయ రాష్ట్రాలూ అదే డిమాండ్ చేస్తున్నాయి. చట్టంలో మార్పులు తెస్తే రెండు రాష్ట్రాలు ఇప్పటికన్నా అధికంగా అప్పులు దూసుకొచ్చేందుకు వీలవుతుంది. ఇలా ఎక్కువ మొత్తంలో రుణాలు తెచ్చుకోవటం ఎంతవరకు నమ్మతమనేది చర్చనీయాంశం. ఇంతకుముందు కేంద్రం సైతం రాష్ట్రాలకు రుణాలు ఇచ్చేది. చిన్న పొదుపు మొత్తాలకు రాష్ట్రాలు బాగా ప్రాధాన్యం ఇచ్చి వాటిని వినియోగించుకొనేవి. కొన్నేళ్లుగా ఇలాంటి పద్ధతుల్లో చాలా మార్పులు వచ్చాయి. కేంద్రం రుణాలు ఇవ్వడం బాగా తగ్గించేసింది. చిన్న పొదుపు మొత్తాల సేకరణ నుంచి రాష్ట్రాలు వైదొలి గాయి. ఆయా మొత్తాల నువాడు కోవ టమూ

మాను కున్నాయి. రాష్ట్రాలు తమకు అర్హత గల అప్పుల్లో సింహ భాగాన్ని పూచీ పత్రాల (సెక్యూరిటీల) విక్రయం ద్వారానే సేకరించుకోవాలి. ఆర్‌బీఐ నిర్వహించే ఇ-వేలంలో బ్యాంకులు తదితర ఆర్థిక సంస్థలు పాల్గొని ఈ పూచీ పత్రాలను కొనుగోలు చేస్తుంటాయి. రెండు తెలుగు రాష్ట్రాలూ పదేళ్ల వ్యవధి గల పూచీ పత్రాలు విక్రయిస్తున్నాయి. అంటే పదేళ్లు కాగానే పూచీ పత్రాల్లోని మొత్తాన్ని తిరిగి చెల్లించుకోవాలి. ఈ పదేళ్ల వ్యవధిలోను ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ చెల్లించాలి. దానివల్ల అప్పులు ఎక్కువైతే వడ్డీల భారమూ పెరుగుతుంది. ప్రస్తుత 2016-17 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రూ. 7,706 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ. 12,258 కోట్లు వడ్డీల రూపేణా చెల్లిస్తున్నాయి. ఇప్పటికే అప్పుల భారం ఎక్కువగా ఉండటం వల్ల రానున్న రోజుల్లో తిరిగి చెల్లించాల్సిన మొత్తాలు చాలా అధికంగా ఉంటాయి. విపరీతంగా అప్పులు తెచ్చుకోవటం సమంజసం కాదు. రెండు రాష్ట్రాల్లోనూ ఈ అప్పుల వల్ల నిజంగా ఆస్తులు సమకూరి, ఫలితాలు అందుతున్నాయా అన్నది ఆలోచించాలి.

**తెలుగు రాష్ట్రాల అప్పులు ఇలా..**
(రూ.కోట్లలో... 2016 మార్చినాటికి)

| సంవత్సరం | అప్పు మొత్తం |
|---|---|
| 1991 | 8,100 |
| 2001 | 41,800 |
| 2005 | 75,400 |
| 2010 | 1,23,600 |
| 2011 | 1,39,500 |
| 2012 | 1,50,500 |
| 2013 | 1,74,200 |
| 2014 | 1,96,200 |
| 2015 | 2,28,500 |
| 2016 | 2,62,800 |

అప్పుల్లో ప్రపంచబ్యాంకు నుంచి తెచ్చేవి తక్కువే అయినప్పటికీ, అది విధించే ఆంక్షలు అనేకం. అంటే ఈ విషయంలో ప్రభుత్వాలను ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తుంటాయి. ఈ పరిస్థితుల్లో పాలకులకు ఇప్పుడు రెండు కొత్త బ్యాంకులు ఆశాకిరణాల్లా కనిపిస్తున్నాయి. న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ), ఆసియా మౌలిక వసతుల పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ) అనే రెండు రకాల బ్యాంకులు ఇటీవల కార్యకలాపాలు ప్రారంభించాయి. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణ ఆఫ్రికా (బ్రిక్స్ దేశాలు) కలసి ఏర్పాటు చేసుకున్నందున ఎన్‌డీబీని బ్రిక్స్ బ్యాంకు అనీ వ్యవహరిస్తున్నారు. దీని ప్రధాన కార్యాలయం చైనాలోని షాంఘైలో ఏర్పాటైంది. ఇక ఏఐఐబీ.. ఆసియా, పసిఫిక్ దేశాల్లో మౌలిక వసతుల కల్పనకు రుణాలు ఇస్తుంది. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కావలసిన రుణాల కోసం ఈ బ్యాంకులను సంప్రదించాల్సిందిగా కేంద్రం సూచించటంతో ఉభయ రాష్ట్రాల నుంచి కొన్ని ప్రతిపాదనలు ఈ బ్యాంకులకు వెళ్లాయి. కొత్త బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇచ్చినంత మాత్రాన ఎక్కువగా ఆధారపడటమూ మంచిది కాదు. అప్పులు ఇచ్చే వ్యక్తి అయినా, సంస్థలవారైనా ఉదారంగా ఏమీ వ్యవహరించరు. ప్రపంచబ్యాంకు మాదిరిగానే కొత్త బ్యాంకులూ నిబంధనలు విధించకమానవు. క్షుణ్ణంగా తెలుసుకున్నమీదటే ఉభయ రాష్ట్రాలు ముందడుగు వేయాలి.

ప్రభుత్వాలు తమ అధీనంలోని కార్పొరేషన్ల ద్వారా అప్పులు తెచ్చి వాడుకొనే విధానం ఎప్పటి నుంచో ఉన్నదే. తెలుగు రాష్ట్రాలు ఇప్పుడు దీన్ని మరింత విస్తృతపరుస్తున్నాయి. ఇలా బడ్జెట్ బయట తెచ్చే అప్పులు ఎఫ్‌ఆర్‌బీఎం చట్ట నిబంధనల పరిధిలోకి రావు. కానీ, ఆయా కార్పొరేషన్ల తరపున ప్రభుత్వమే రుణ మంజూరీ సంస్థలకు హామీ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే కార్పొరేషన్లు అప్పులు తీర్చలేప్పుడు ప్రభుత్వమే వాటిని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఇలా రాష్ట్రాలు ఎడాపెడా అప్పులు తెస్తూ పోతే భవిష్యత్తులో అనేక అనర్థాలు ఏర్పడతాయి. అప్పులు తెచ్చే ముందు వాటిని ఎటువంటి దుబారా లేకుండా ఖర్చుచేయగల యంత్రాంగం అందుబాటులో ఉందా అనేది చాలా ముఖ్యం. నైపుణ్యం గల యంత్రాంగం అంటూ లేకుండా భారీగా అప్పులు దూసుకొచ్చినా ప్రయోజనం ఉండదు. అందువల్ల తెలుగు రాష్ట్రాలు తొలుత ఇంజినీరింగ్ విభాగాల పటిష్టతపై దృష్టి పెట్టాలి. నిర్మాణ పనులు అనగానే అవినీతి గుర్తుకొస్తుంది. అవినీతిని తగ్గించే చర్యలు చేపట్టకుండా అప్పులు తెస్తూ పోతే, అవన్నీ బూడిదలో పోసిన పన్నీరు చందం అవుతాయి.

## నియంత్రణకు ఏం చేయాలి?


రెవిన్యూ ఖర్చులను తగ్గించగలిగితే ఆ మేరకు మిగుళ్లు ఏర్పడతాయి. ఇందుకు కావలసిందల్లా వ్యూహాత్మక విధానాలు. సొంత రాబడులను బాగా పెంచుకోవాలి. అంటే పన్ను రేట్లను పెంచేయడం కాదు. పన్ను చెల్లింపుల్లో లొసుగులను పసిగట్టి పన్ను ఎగవేతలను అరికట్టగలిగితే రాబడి మరింత పెరుగుతుంది. అక్రమాలకు పాల్పడే అధికార యంత్రాంగంపై కొరడ ఝుళిపించగలిగితే ఆదాయం మరింత ఊపందుకుంటుంది. అప్పులతో చేపట్టే వివిధ ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేయడం చాలా అవసరం. అలా చేయలేనప్పుడు రెండు రకాల అనర్థాలు ఏర్పడతాయి. ఆయా ప్రాజెక్టుల వల్ల ప్రజలకు ఫలితాలు చేకూరవు సరికదా, మరిన్ని అప్పులు తెచ్చి వాటికి ధారపోయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఉభయ రాష్ట్రాల పరిధిలో 2014 మార్చి నాటికిగల మొత్తం అప్పులు రూ. 1,96,200 కోట్లు. అందులో 42శాతం మేర అప్పుల వల్ల ఎలాంటి ఫలితాలు రాలేదు. దీన్నిబట్టి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఉభయ రాష్ట్రాలు ఇప్పుడు ఇటువంటి పోకడలను అధిగమించాలి. అప్పులతో చేపట్టే పథకాల ద్వారా సిద్ధించే ప్రయోజనాలు అప్పులు, వాటిపై వడ్డీల మొత్తాల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయనే విశ్వాసం కలిగించగలగాలి. సాగునీటి ప్రాజెక్టులతో సహా వివిధ రకాల పనులను ఒక నిర్ణీత వ్యవధిలో పూర్తిచేసే విధంగా తగిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలి. అటువంటి పరిస్థితి ఉన్నప్పుడే అప్పులు కొంత మేర ఎక్కువగా ఉన్నా ప్రజలు స్వాగతిస్తారు. అధిక అప్పుల కోసం ఎగబడుతున్న తెలుగు రాష్ట్రాలు ఇప్పుడు ఈ దిశలో పయనించాలి.

**(ఈనాడు సౌజన్యంతో)**

# మరో నయీంను సృష్టిస్తారా?

- దేవులపల్లి అమర్

గ్రేహౌండ్స్ అనే ప్రత్యేక పోలీసు విభాగం ఏర్పాటుకు వ్యూహకర్తయైన కేఎస్ వ్యాస్‌ను హత్య చేసిన అప్పటి నక్సలైట్ నయీముద్దీన్ 23 ఏళ్ల తర్వాత అదే గ్రేహౌండ్స్ చేతుల్లో మొన్న హతం అయ్యాడు. ప్రజలకూ, పౌరహక్కుల కార్యకర్తలకూ, తీవ్రవాద ఉద్యమానికీ తలనొప్పిగా మారిన నయీం లాంటి వారు తమకు కూడా తలనొప్పి తెస్తుంటే తప్ప మన ప్రభుత్వాలు వారిని ఈ లోకం నుంచి తప్పించవు. అందుకు నయీం ఒక్కడే కాదు చాలా ఉదాహరణ లున్నాయి. ఉపయోగ పడతాడు అనుకుంటే, వాడు ఎంత కరడుగట్టిన నేరస్తుడైనా రక్షణ వలయం ఏర్పాటు చేసి కంటికి రెప్పలా కాపాడుకుంటారు. ఎన్ని దుర్మార్గాలు చేసినా చిద్విలాసంగా చూస్తుంటారు. అక్రమంగా ఆస్తులూ, లెక్కలేనంత డబ్బు కూడగట్టుకోవడానికి అనుమతించడమేకాదు, తమ వంతు సాయం కూడా చేస్తుంటారు. ఒక పోలీసు అధికారిని హత్య చేసిన నేరానికి జైలు జీవితం గడిపి బయటికి వచ్చిన ఒక సాధారణ కుటుంబానికి చెందిన యువకుడు నయీం వేలకోట్ల ఆస్తులను సంపాదించడానికి వెనుక చాలా కథ ఉంది.



## నక్సలైట్ల అణచివేతకు అష్టావక్ర మార్గం

ఈ దేశంలో తీవ్రవాద ఉద్యమాన్ని కేవలం శాంతిభద్రతల సమస్యగానే చూస్తూ వచ్చిన ప్రభుత్వాలు ఆ ఉద్యమాన్ని అదే పద్ధతిలో అణచివేయబోయి సాధ్యంకాక ఎన్నో వక్రమార్గాలను ఎంచుకున్నాయి. ఆ ఉద్యమాల సైద్ధాంతిక పునాది ఎంత బలంగా ఉంది, ప్రజల పట్ల వారి నిబద్ధత ఎంత అనేవి ఇక్కడ చర్చనీయాంశాలు కావు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి విధుల్లోకి వచ్చే వ్యవస్థలు ఆ ఉద్యమాన్ని అణచివేయడానికి ఎంచుకున్న వక్రమార్గాల గురించి మాట్లాడాలి. ఆ వక్రమార్గాలోకెల్లా మరీ అష్టావక్ర మార్గం కోవర్టులు. కత్తుల సమ్మయ్య, జడల నాగరాజు, బయ్యపు సమ్మిరెడ్డి, సోమల నాయక్, గోవింద రెడ్డి, నయీంలాంటి వాళ్లంతా ఈ వక్రబుద్ధికి పుట్టిన కుక్క మూతి పిందెలే. ఒక దశలో తీవ్రవాద ఉద్యమంలో చాలా చురుగ్గా పాల్గన్న వీళ్లంతా ఆ తర్వాత పోలీసుల చేతిలో పావులుగా మారి ఆ ఉద్యమకారులను చంపడం, చంపడానికి సహకరించడంతో మొదలుపెట్టారు. ఆ తదుపరి పౌరహక్కుల నేతలనూ, కార్యకర్తలనూ మట్టుబెట్టటం, ప్రజలను హింసించడం, దౌర్జన్యాలు సాగించటంతో ఆగక రాజకీయ నాయకత్వాన్ని కూడా గుప్పిట పెట్టుకోవడానికి వారు చెయ్యని ప్రయత్నం లేదు. నయీం కూడా అట్లా పెరిగిన వాడే. ఎందరో పోలీసు అధికారులు, మరెందరో రాజకీయ నాయకులూ నయీంతో స్నేహం చేయడానికి తహతహలా డినవారే. నయీం ఇచ్చిన నజరా నాలను సంతోషంగా స్వీకరించినవారే. నయీంను ఎన్‌కౌంటర్‌లో చంపేసిన తర్వాత పోలీసుల సోదాల్లో చాలా విషయాలు బయటపడే ఆస్కారం గల డాక్యుమెంట్లు బోలెడు దొరికాయి. అవన్నిటినీ బహిరంగ పరిస్తే (కొన్ని పేర్లు ఇప్పటికే తెలిశాయి) సమాజంలోని చాలామంది పెద్ద మనుషుల బతుకులు బజారు నపడటం ఖాయం. అందులో పోలీసులు, రాజకీయ నాయకులూ, వ్యాపారులూ, మీడియా ఇంకా ఎవరయినా ఉండొచ్చు.

## భస్మాసుర హస్తం సృష్టికర్తలు

1993 జనవరిలో హైదరాబాద్ ఫతెహ్ మైదాన్ స్టేడియంలో ఐపీఎస్ అధికారి వ్యాస్‌ను హతమార్చిన తరువాత జైలుకు వెళ్లిన నయీం.. ఏడేళ్ల తరువాత పోలీసుల ఆశీస్సులతో బయటికి వచ్చి అదే స్టేడియం పక్కన ఉన్న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పత్రికా గోష్టి నిర్వహించి తాను ఎవరెవరిని చంపబోతున్నదీ హిట్‌లిస్ట్ చదివి వినిపించాడు. తీవ్రవాద ఉద్యమాన్ని అంతం చేస్తాననీ, అవసరం అయితే ఆనాటి పీపుల్స్‌వార్ కేంద్ర కార్యదర్శి గణపతిని కూడా హతమారుస్తాననీ ప్రకటించాడు. ఆనాటి పోలీస్ బాస్‌లకు ఇది నచ్చింది. నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేసే పనిని నయీం వంటి వాళ్లకు అప్పగించి తాము నిశ్చింతగా ఉండవచ్చని అనుకున్నారు. కానీ ఇటువంటి

వారు చివరికి తమ పాలిట భస్మాసుర హస్తాలు అయ్యే ప్రమాదముందని చెపితే విన్నారా? "ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని చిలకపలుకులు పలికే, చట్టం తన పని తాను చేసుకుపోతుందని ధర్మపన్నాలు వల్లించే పోలీసులు, ప్రభుత్వ నేతలూ గమనించవలసిన విషయం ఒకటుంది. రేపు వీళ్లు (నయీం తదితరులు) నక్సలైట్లను చంపుతారు సరే తరువాత ఏమిటి? ఇలాంటి నేర ప్రపంచాన్ని పెంచి పోషిస్తున్న పోలీసులకూ ప్రభుత్వానికీ అది భస్మాసుర హస్తంగా మారకుండా ఎవరయినా ఆపగలరా?" అని ప్రజాతంత్ర వారపత్రికలో (2000 ఆగస్టులో) రాస్తే పోలీసు పెద్దలకు రుచించలేదు. ఒక పోలీసు అధికారిని నా వద్దకు పంపించి "మీకు అటువంటి సందేహం అక్కర లేదు. ఎక్కడికి పోతారు వీళ్లు. మా అవసరం తీరాక వీళ్లను అడ్డుతొలగించుకోవటం మా చేతిలో పని. అయినా నయీం దుర్మార్గుడు, వాడితో ఎందుకు పెట్టుకుంటారు" అని నాకు ఒక ఉచిత సలహా కూడా చెప్పించారు.

### బెదిరించేవారికే వరకు పోలీసు పహారా

పదహారేళ్లనాటి నా ప్రశ్నకు నయీం చేసిన దుర్మార్గాలే పెద్ద సమాధానం. నక్సలైట్లను చంపాక, పౌరహక్కుల వాళ్ల మీద, ఆ తరువాత పోలీసులూ, రాజకీయ నాయకుల మీదా పడ్డాడు నయీం. ఇటువంటి సంఘ విద్రోహ శక్తుల వ్యవస్థలను కొన్నిటిని సృష్టించిన ఘనత ఖచ్చితంగా మన ప్రభుత్వాలది, పోలీసు పెద్దలదే. హత్యా నేరాలు మోస్తున్న కత్తుల సమ్మయ్యకు పాస్‌పోర్టు, వీసాలూ ఇప్పించి దేశం నుంచి తప్పించారు. అనుమానంతో అమాయకులను వేధించి ఒక్కోసారి వాళ్ల జీవితాలు నాశనం కావడానికి కూడా కారణమయ్యే పోలీసులు కత్తుల సమ్మయ్య వంటి కరడుగట్టిన నేరస్తులను సైతం క్షేమంగా దేశం దాటించేస్తారు. ఎందుకంటే అతను నక్సలైట్లను చంపాడు. బయ్యపు సమ్మిరెడ్డి అనే మరో కోవర్ట్ సొంత గొడవల్లో హత్యకు గురయ్యాడు. గోవిందరెడ్డి, జడల నాగరాజు ఏమయ్యారు? చాలాకాలం జడల నాగరాజు కూడా మన పోలీసు పెద్దల ముద్దుల అతిథే. ఒకసారి సిద్దిపేట దాబాల దగ్గర నిలబడి చాయ్ తాగుతుంటే ఆరు జీపుల నిండా సాయుధులు హైదరాబాద్ వైపు దూసుకుపోతూ కనిపించారు. ఎవరని ఆరా తీస్తే వాళ్లంతా మాజీ నక్సలైట్ జడల నాగరాజు సెక్యూరిటీ అని తెలిసింది. ముందు జీపులో ఉన్న అతనికి రక్షణగా ఈ బలగాలు. వారిలో కొందరు మఫ్టీలోని పోలీసులు. అవును మరి, నక్సలైట్ల శత్రువులను కాపాడటం మన పోలీసు వ్యవస్థ పనే కదా.

### నేరస్త ముఠాల కోసం లెక్కలేని నిధులు

నయీముద్దీన్‌లాంటి నేరస్తుల జీవితాలకు ముగింపు ఇంతకంటే భిన్నంగా ఉండదు. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, నయీంలను, కత్తుల సమ్మయ్యలను మనమే సృష్టించి, ఏకు మేకు అయ్యేదాకా చూసి, మనమే ఎందుకు మట్టుబెట్టటం? ఈ ప్రశ్న మన పోలీసు పెద్దలు వేసుకోవాలి. మాకే సంబంధమూ లేదు, ఇదంతా గిట్టనివాళ్లు, పోలీసు వ్యతిరేకులూ, అభివృద్ధి నిరోధకులూ చేసే ఆరోపణ అని ప్రభుత్వం, పోలీసులు కొట్టిపారేయొచ్చు. 1986లో ఫియర్ వికాస్ నుంచి ఈనాటి గ్రీన్‌టైగర్‌ల దాకా ఈ 30ఏళ్లలో పోలీసు పెద్దల ప్రత్యక్ష, పరోక్ష మద్దతుతోనే నయీం లాంటి వాళ్లు బలవంతులై సమాజాన్ని పీడిస్తున్నారు. వాళ్లు నక్సలైట్లను వ్యతిరేకిస్తారు, చంపుతారు కాబట్టి వాళ్లకు మా మద్దతు అన్నది పోలీసుల ధోరణి. 1986లో నాటి కరీంనగర్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పత్రికా గోష్టిలో ఎస్పీ అశోక్ ప్రసాద్ సమక్షంలోనే ఫియర్ వికాస్ నాయకుడు, హుస్నాబాద్ వాస్తవ్యుడు అన్నెబోయిన మల్లయ్య ఆ సంస్థ ఆవిర్భావాన్ని, దాని లక్ష్యాల్ని వివరించాడు. అక్కడ నుంచి మొదలై జన రక్షణ సంస్థ, క్రాంతి సేన, గ్రీన్ టైగర్స్, రెడ్ టైగర్స్ వంటి అనేక సంస్థలు పోలీసుల ఆశీర్వాదంతోనే పుట్టాయి, ప్రజల ఆగ్రహానికి అంతరించాయి. ఇట్లాంటి వ్యక్తులు సంస్థలను చేరదీసి బలోపేతం చెయ్యటానికి లెక్కురాని పోలీసు ఎస్ఆర్ అమౌంట్ కోట్లలో ఉంటుందంట. ఎస్పీల అధీనంలో ఉండే ఈ నిధులకు ఆడిటింగ్ వంటి చట్టపరమైన నిబంధనలు వర్తించవనీ చెబుతుంటారు.

దాదాపు ఒకటిన్నర దశాబ్దకాలంపాటు నయీం తన దుర్మార్గాలను కొనసాగించడానికి, యధేచ్ఛగా జనాన్ని హింసించడానికీ తోడ్పడిన ఉన్నతస్థాయి పోలీసు అధికారులు కొందరు పదవీ విరమణ చేశారు. కొందరు రాష్ట్ర విభజన అనంతరం అవతలి రాష్ట్రానికి వెళ్లారు. కొంతకాలంగా నయీం ఆట ముగియనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఎప్పుడయితే అధికారపక్షానికే చెందిన కొనపురి రాములును హత్య చేశాడో, ఎప్పుడయితే అధికారపక్షానికే చెందిన కొందరు ప్రజాప్రతినిధులను వారి వారి నియోజకవర్గాలకు వెళ్లకుండా నిలువరించాడో, ఎప్పుడయితే వారి నుంచి సైతం కోట్లాది రూపాయలు డిమాండ్ చేశాడో అప్పుడే నయీం కథ ముగియబోతున్నదని అర్థమైంది. అదే జరిగింది. మంచిదేగానీ, మరో నయీం పుట్టడన్న, పుట్టించబోమన్న హామీ మన పోలీసు పెద్దలు ఇవ్వగలరా?

**(లోక్‌సత్తా తొలినుంచీ వాదిస్తున్న పోలీసు సంస్కరణలు, అధికార వికేంద్రీకరణ, నేర రాజకీయాలు, ప్రభుత్వోద్యోగ వ్యవస్థల ప్రక్షాళన వంటి మౌలిక మార్పుల ఆవశ్యకతను తాజా సాక్ష్యంతో చెప్పిన ఈ వ్యాసం సాక్షిలో ప్రచురితమైంది)**

# 'వివక్షరహిత స్వచ్ఛ భారత్' యువత ధ్యేయం కావాలి


-ఎ. అన్నపూర్ణ,
కాలిఫోర్నియా

అవును. ఆదిమానవుల కాలం నుంచీ సమాజం ప్రజల అవసరాలకనుగుణంగా మారుతూ ఉండటం సహజ పరిణామం. నియమాలను, సంస్కృతినీ ఉల్లంఘించటంగా, అవమానించటంగా దాన్ని ఎల్లవేళలా భావించనక్కర్లేదు. అయితే మార్పును అంగీకరించని ఛాందసులు, అవకాశవాదులూ ప్రతి మార్పుకూ అడ్డుతగులుతూ రభస చేస్తుంటారు. దీన్ని పట్టించుకోవలసిన పనిలేదు. మహిళలు కేరళలోని అయ్యప్ప దేవాలయ ప్రవేశం చేయరాదని, అయితే వయసుపైబడినవారు, రజస్వల కాని బాలికలు ఆలయాన్ని సందర్శించవచ్చని దేవస్థానం అధికారుల నియమం. ఎన్నో ఏళ్లుగా ఈ ఆచారం కొనసాగుతూ వచ్చింది. కాలానుగుణంగా మారుతున్న ప్రజల ఆలోచనాధోరణిలో భాగంగా మహిళలు ఈ వివక్షను అవమానంగా పురుషాభిజాత్యంగా భావించి ఎదురుతిరిగారు. "దేవుడు, దేవాలయం సర్వమానవ శ్రేయస్సు కోసమే. కనక మేము ఆ షరతులను ఇక అంగీకరించేది లేదు'' అని తేల్చిచెప్పారు. అంతేకాకుండా ఒక యువతి కోర్టులో కేసు వేసింది. దాన్ని సమర్థిస్తూ అనుకూలంగా న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. అయితే దేవస్థానం అధికారులు అంగీకరించకపోగా, సీసీ కెమేరాలలో సూక్ష్మపరిశీలనలు సైతం మొదలుపెట్టారు. ఇది అత్యంత హేయమైన చర్యగా మహిళలతోపాటు పలువురు యువకులు కూడా నిరసించారు. ఇలాంటి నియమాల పేరుతో ప్రతీ ఆధ్యాత్మిక కేంద్రంలో వారి ఇష్టానుసారం ఏవో కొన్ని నిబంధనల్ని అమలుచేయటం పరిపాటిగా మారిపోయింది. వీఐపీలు, సినీతారలు, ఇతర సెలబ్రిటీలు వచ్చినప్పుడు మాత్రం ఎవరూ చెప్పకుండానే, అడక్కుండానే నియమాలు వాటంతటవే వైదొలుగుతాయి. సామాన్యులపై మాత్రం చిన్నచూపు, హూంకరింపులు. కొన్ని దేవాలయాలు మత వివక్షతను చూపుతుంటే, మరికొన్ని కుల భేదం చూపుతున్నాయి. పుట్టిన కులం ఒకటి, మారిన మతం మరొకటి. కులమతాలు వ్యక్తిగత వ్యవహారాలు గనక అభ్యంతరం ఉండకూడదని పైకి అంగీకరిస్తున్నా ఆచరణలో మాత్రం చాలా పట్టింపులు ప్రదర్శిస్తారు. కానీ మహిళల కంటే పురుషులు ఎక్కువ అనే వివక్ష కులమతాలకంటే ఘోరమైన తప్పిదంగా ఆధునిక మహిళలు భావిస్తున్నారు. ఎప్పుడో రాజారామమోహన్‌రాయ్, వీరేశలింగం పంతులు వంటివారు చేసిన పోరాటాలు ఇంకా పూర్తిస్థాయి ఫలితాలను సాధించలేదు. శుచిగా, శుభ్రతగా ఉండాలనే 'పవిత్రత' ప్రాతిపదికగా నియమాలు ఏర్పడ్డాయి. దైవసన్నిధిలో అందరూ సమానులేగానీ సామాన్యుల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. వ్యక్తిగతంగా నేను 'పరిశుద్ధుడను' అనుకుంటూ నిబంధనలు ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ సరైన సామాజిక హేతుబద్ధత లేకుండా ఇతరులూ వాటిని అనుసరించాలనటం ఆభిజాత్యమే అవుతుంది. నేటి యువత ఈ ఛాందస భావాలను, ఆచారాల పేరుతో కుల, మత వివక్షను వ్యతిరేకించి భేదభావాన్ని తుడిచిపెట్టాలి అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తరచూ పార్టీ పరంగా, పార్టీలకతీతంగా కూడా చెబుతూంటారు. సాధారణంగా ఆదర్శభావాలుండే యువత పెద్దసంఖ్యలో ఉన్న మనదేశంలో వాళ్లు మారితే ఈదేశం అలవోకగా మారిపోతుందని జేపీ స్పష్టమైన నమ్మకం. కులమతాలకతీతమైన భావాలను ఆయన విద్యార్థిదశ నుంచే ఒక ఉద్యమంలా వ్యాపింపచేశారు. అణగారిన కులాల విముక్తి పట్ల నిజమైన అంకితభావమున్న పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీలు జేపీతో చాలా సన్నిహితంగా తమ భావాలను పంచుకుంటూ పరిష్కారాలపై చర్చిస్తుంటారు. వారికి దిశానిర్దేశంతోపాటు చేతనైన చేయూతనూ ఎటువంటి ప్రచారం లేకుండా అందిస్తుంటారు. జేపీ స్ఫూర్తితో మా ముగ్గురు పిల్లలూ ఆదర్శ వివాహాలు చేసుకోవటం నేను గర్వకారణంగా భావిస్తాను. గౌరవప్రదమైన అంశంగా తృప్తిపడతాను. ఇలాంటి సాంఘిక మార్పుల్ని లోక్‌సత్తా ఉద్యమసంస్థలోని ఎందరో ఆచరించి మరీ చూపించారు. ఒకప్పుడు ఏవో చాదస్తాలు, కులం, మతం, ప్రాంతం అంటూ పట్టింపులు ఉన్నా ఆరోజుల్లోనూ వాటిని అధిగమించి ఆదర్శ వివాహాలు చేసుకున్నవారు ఉన్నారు. ఈరోజుల్లో అలాంటి ఆంక్షలు కూడా బలహీనపడుతున్నాయి. మార్పును కోరుకునే ఆలోచనా ధోరణి ఉంటే, ఆచరించే చిత్తశుద్ధి, నిరాడంబరత ఉంటే తమ ఇంటి నుంచే మార్పును ఆచరించి చూపటానికి కావలసిన అవకాశాలు, స్వేచ్ఛ ఈరోజున ఉన్నాయి. చదువు, వివేకం, ఆదర్శంతో ఆ మార్పును ఇప్పటికే ప్రారంభించినవారికి సమాజంలో ఎంతోకొంత విజ్ఞత ఉన్నవారు సైతం అండగా నిలవాలి. సమాజంలో ఇది ఆహ్వానించదగ్గ పరిణామంగా మనందరం గుర్తించాలి. పాత ధోరణులను వల్లె వేసే వారిని దూరంగా ఉంచి యువతీయువకులు సొంత నిర్ణయాలు తీసుకోవాలి. అవసరానికి చిచ్చు రగిలించి చలి కాచుకునే ద్రోహులను గుర్తించి వారి పట్ల జాతి యావత్తూ అప్రమత్తంగా ఉండాలి. అప్పుడే మహిళలు, పురుషుల మధ్య వివక్ష తొలిగి సర్వమానవ సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుంది. దేశం ప్రగతి పథాన సుస్థిర పయనం సాగిస్తుంది. యువతా, మరిక ప్రధాన బాధ్యత మీదే!



# ప్రభుత్వ వైద్య కళాశాల కోసం
# లోక్‌సత్తా దీక్షకు స్పందించిన విజయనగరం






విజయనగరం జిల్లాకు ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ చేసిన 24గంటల నిరాహారదీక్షకు జిల్లావ్యాప్తంగా మంచి స్పందన లభించింది. రాజకీయ పార్టీలన్నీ మద్దతు పలికాయి. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ప్రతిపక్ష వైసీపీ, వివిధ ప్రజాసంఘాలు దీక్షాస్థలికి వచ్చి సంఘీభావం తెలిపాయి. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన నెల్లిమర్ల ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామి కూడా దీక్షా శిబిరానికి వచ్చి మద్దతు పలకటం చర్చనీయాంశమైంది. జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల కావాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ప్రజలలో జరుగుతున్న చర్చను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానన్నారు. భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్య కళాశాల కోసం జరుగుతున్న పోరాటం ఆరంభం మాత్రమేనన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేసి ప్రజావైద్యసేవల్ని మెరుగుపరచాలన్నారు. విజయనగరం జిల్లాలో సర్కారీ వైద్యకళాశాల కోసం రెండేళ్లుగా లోక్‌సత్తా పోరాడుతోందని, రాజకీయ పార్టీలేకాకుండా ప్రజలు కూడా ఈ డిమాండ్‌కు భారీగా మద్దతు పలుకుతున్నారని వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బద్దాన అప్పారావు అన్నారు. జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తామని ముందుగా ప్రకటించి ఆ తర్వాత ప్రైవేటు ఒత్తిళ్లకు తలగ్గటం తగదని వైసీపీ జిల్లా నేత మజ్జి శ్రీనివాసరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు యడ్ల ఆదిరాజు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని విస్మరించడం దారుణమన్నారు. వామపక్షనేతలు తమ్మినేని సూర్యనారాయణ, బుగత అశోక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం వైద్య కళాశాల డిమాండ్‌ను నెరవేర్చాలన్నారు. నిరసన దీక్షలో జేఏసీ కన్వీనర్ మామిడి అప్పలనాయుడు, కో-కన్వీనర్లు చోడి ఆదినారాయణ, మజ్జి కాంతారావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అజ్జి శివప్రసాద్, వైసీపీ నాయకుడు సంగంరెడ్డి బంగారునాయుడు, పిళ్లా విజయకుమార్, కాళ్ల గౌరీశంకర్, అవనాపు విజయ్, పీరుబండి జైహింద్ కుమార్, డోలా మన్మథకుమార్, జీవీ రంగారావు, బోడసింగి ఈశ్వరరావు, అల్లు చాణక్య, కాంగ్రెస్ ప్రతినిధి బుంగ భానుమూర్తి, ఇతర పార్టీల, సంఘాల నేతలు పి.వి రమణ, ఆదాడ మోహనరావు, లోగిశ రామకృష్ణ, చిన్నారావు, కోటేశ్వరరావు, ఎంవీఆర్ కృష్ణాజీ, దప్పు శ్రీను, పలువురు దళిత, లోక్‌సత్తా నేతలు పాల్గొన్నారు.

## తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపండి



గజపతినగరంలో నడిరోడ్డుపై గిరిజన మహిళ ప్రసవించటం సమాజానికి సిగ్గుచేటని భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరం జిల్లా 8మండలాల్లోని 2లక్షలకుపైగా గిరిజనులు వైద్యం అందక ఎలా అల్లాడుతున్నారో రాష్ట్ర విభజనపై ఏర్పాటు చేసిన శ్రీకృష్ణా కమిటీ చెప్పిందన్నారు. జిల్లాలో వైద్యసేవలను ప్రక్షాళన చేయటంతోపాటు జిల్లాకి ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు చేస్తూ జడ్పీ సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా, ప్రభుత్వ వైద్య కళాశాల సాధన జేఏసీ తరపున ఈ మేరకు జడ్పీ ఛైర్‌పర్సన్ స్వాతీరాణిని కలిసి విజ్ఞాపన పత్రం అందచేశారు. జడ్పీటీసీలకు, ఎమ్మెల్సీ జి. శ్రీనివాసుల నాయుడికి కూడా ప్రతుల్ని అందచేశారు. కార్యక్రమంలో ఆదినారాయణ, మజ్జి కాంతారావు, మమ్ముల తిరుపతిరావు, పైడితల్లి, బి.ఎ రావు, చిన్నారావు, కోటేశ్వరరావు, భానుమూర్తి, పి.వి రమణ, బి. రమేష్, ఎ. నాగభూషణం, కుందేటి బాబూరావు, శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ తిరుపతి మునిసిపల్ కార్యాలయం వద్ద లోక్‌సత్తా నిరసన దీక్షను నిర్వహించింది. ప్రత్యేక హోదా విషయంలో కేంద్రం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించినా మంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనా చౌదరి మాట్లాడకపోవటం దారుణమని లోక్‌సత్తా పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కల్లూరి బాలసుబ్రమణ్యం అన్నారు. ఢిల్లీలో ఎలాంటి పోరాటం చేయాలో కనీసం తన ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేయలేదన్నారు. 'ఓటుకు కోట్లు' కేసులో ప్రధాన ముద్దాయిగా ఉండటం వల్లే కేంద్రంపై చంద్రబాబు పోరాడలేక పోతున్నారన్నారు. ప్రజాఉద్యమాల్ని పుష్కరాల వంటి ఈవెంట్లతో, దాటవేత ధోరణితో నీరుగార్చేందుకు తెలుగుదేశం, బీజేపీ చేస్తున్న ప్రయత్నాల్ని ప్రజలు తిప్పికొడతారన్నారు.




శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సత్తా నేతల్ని పోలీసులు అరెస్టు చేసి ఆ తర్వాత విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగర అధ్యక్షుడు బెల్లంకొండ సురేష్, ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి, మునిచంద్ర, బాలకృష్ణ, పవన్‌గోపి, యశ్వంత్, ప్రణీత్, ఇస్మాయిల్, సాయి, సాయికృష్ణ, నరేష్, అభినవ్, పునీత్ తదితరులు పాల్గొన్నారు.

# సహ చట్టమంటే భయమెందుకు?



తిరుమల తిరుపతి దేవస్థానంలో సమాచార హక్కు చట్టాన్ని అమలుచేయాలని లోక్‌సత్తా పార్టీ విజ్ఞప్తి చేసింది. సహ చట్టం అమలు ద్వారానే టీటీడీలో పారదర్శక పాలన సాధ్యమవుతుందని స్పష్టం చేసింది. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లూరు బాలసుబ్రహ్మణ్యం నేతృత్వంలో లోక్‌సత్తా నేతలు టీటీడీ కార్యనిర్వహణాధికారి సాంబశివరావును కలిసి విజ్ఞాపన పత్రం అందించారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, 2005లో సహ చట్టాన్ని తేవటంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కీలకపాత్ర పోషించారని, ఈ చట్టం వల్ల ప్రభుత్వ కార్యాలయాలతోపాటు దేవాదాయ ధర్మాదాయ కార్యాలయాలలో ప్రజలు అడిగిన సమాచారాన్ని ఇస్తున్నా, టీటీడీ మాత్రం ఈ చట్టాన్ని అమలుచేయటంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని అన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామికి దేశవిదేశాల్లో భక్తులున్నారని, ఎన్నో విలువైన కానుకల్ని వివిధ రూపాలలో ఇస్తుంటారని, వివరాలను పారదర్శకంగా ప్రజలకు తెలియచేయాలని అన్నారు. కొందరు దిగువస్థాయి అధికారులు అక్రమార్జనతో ఎంత విలాసవంతంగా బతుకుతున్నారో బహిరంగ రహస్యమేనన్నారు. ముఖ్యంగా తిరుమల దర్శన టికెట్ల కేటాయింపులో, రెవిన్యూ విభాగం షాపుల కేటాయింపులో, ఇంజినీరింగ్, మార్కెటింగ్ విభాగాల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నట్టు లోక్‌సత్తా విచారణలో వెలుగుచూసిందన్నారు. 2016లో పదవీ విరమణ చేసిన డిప్యూటీ ఈవో చెంచులక్ష్మి ఉద్యోగ బాధ్యతల్ని పొడిగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను పున:పరిశీలించాలని ఈవోను కోరారు. ప్రభుత్వ నియామకాలతో నడిచే దేవస్థానంలో సహ చట్టం ద్వారా వివరాలు వెల్లడించాల్సుంటుందన్నారు. కార్యక్రమంలో సురేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.







భారత 70వ స్వతంత్ర వేడుకల సందర్భంగా హైదరాబాద్
జవహార్‌నగర్‌లోని సీఆర్‌పిఎఫ్ పబ్లిక్ స్కూల్‌లో లోక్‌సత్తా
వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

Posting Date 07-09-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on September 1st 2016



సమాజంలో మార్పు ను తీసుకు రావడానికి లోక్ సత్తా అనే వేదికను ఏర్పాటు చేసాము. సమాజం లో అందరూ ముందుకొచ్చి పగ్గాలు పట్టుకుంటాం అంటేనే లోక్ సత్తా ఎదుగుతుంది .

**MLA సీట్ కోసం 10 కోట్లు ఇచ్చి కొంతమంది నాయకులని , వాళ్ల కొడుకుల్ని , కూతుర్లని భుజానికెత్తు కుంటున్నారు. అలా కాదు మీ అంతట మీరే సమాజాన్ని మార్చుకోండి అని ఒక వేదిక ఏర్పాటు చేస్తే దానిలో కొంతమందే చేరుతున్నారు .**

ముందు మన సమాజం లో మార్పు రావాలి !

# నిజాలు మాట్లాడుకుందాం-4

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad